ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 25.02.2026 | సంపుటి :12 | సంచిక : 217 | పేజీలు :12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370





హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఇంటర్ పరీక్షలు నేటినుంచి

- భారీగా ఏర్పాట్లు చేసిన బోర్డు
- పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- 5 నిముషాల ఆలస్యాన్ని పరిగణిస్తాం
- అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- పకడ్బందీగా పరీక్షల నిర్వహణ
- సీఎస్ కె.రామకృష్ణారావు

హైదరాబాద్(జనంసాక్షి): ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25, బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుంచి ప్రథమ, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 1495పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఫస్టియర్‌లో మిగతా 2లో..



**మార్క్సిజం అంతం కాదు : మల్లా**

రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్

ప్రజలతో కలిసి పనిచేయాలని భావిస్తున్నాం. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తాం. చట్ట ప్రకారమే పోరాటం చేయాలని లొంగిపోయాం. మావోయిజం అనేది ఎప్పటికీ అంతం కాదు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. అవకాశం ఉన్నప్పుడల్లా ప్రజలతో కలిసి వారి కష్టసుఖాల్లో, పోరాటాల్లో భాగస్వాములవుతాం. కొన్ని ప్రశ్నలను ప్రభుత్వంతో చర్చిస్తాం. త్వరలో అన్ని ప్రశ్నలకు జవాబు చెప్తాం.

అనారోగ్య కారణాల రీత్యా లొంగిపోయాను. రహస్య జీవితం నుంచి బహిరంగ జీవితం గడపాలని భావిస్తున్నాను. దశాబ్దాల కాలం నుంచి నేను నమ్మిన సిద్ధాంతాల ప్రకారమే ప్రజల కోసం పనిచేస్తాను. త్వరలో రాజకీయ ప్రవేశం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని భావిస్తున్నాను. మీరు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పే పరిస్థితిలో లేను. నేను ఏది మాట్లాడినా అపార్థాలకు దారితీసే విధంగా ఉంటుంది. - దేవ్‌జీ



# మావోయిస్టు పార్టీ అగ్రనేతల లొంగుబాటు

**అప్రకటిత కేంద్రకమిటీ కార్యదర్శి తిప్పరి తిరుపతితో సహా మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలు జనజీవన స్రవంతిలోకి..**

- మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది
- వారు కూడా లొంగిపోతే పునరావాసం కల్పిస్తాం : డీజీపీ శివధర్ రెడ్డి
- రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తా.. ప్రజా సమస్యలపై పోరాడుతా..!
- దశాబ్దాలుగా నమ్మిన సిద్ధాంతపు గైడెన్స్ లోనే లీగల్ ఫ్రేమ్‌లో పనిచేస్తా: దేవ్ జీ

హైదరాబాద్ (జనంసాక్షి) : 'అనారోగ్య కారణాల రీత్యా నేను లొంగిపోయాను. రహస్య జీవితం నుంచి బహిరంగ జీవితం గడపాలని భావిస్తున్నాను. దశాబ్దాల కాలం నుంచి నేను నమ్మిన సిద్ధాంతాల ప్రకారమే ప్రజల కోసం పనిచేస్తాను. ప్రజల సమస్యలపై ప్రజల్లో ఉండి పోరాటం చేస్తాను. త్వరలో రాజకీయ ప్రవేశం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని భావిస్తున్నాను. మీరడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిస్థితిలో లేను. ఏది మాట్లాడినా అపారాలకు దారితీసే విధంగా ఉంటుంది. నేను రాజకీయ జీవితం కొనసాగించాలని కోరుకుంటున్నాను. మీరడిగే ప్రశ్నలకు నేను చెప్పే సమాధానం రాజకీయ జీవితానికి ఇబ్బంది కలిగించవద్దని అన్ని విషయాలు పంచుకోవడం లేదు' అని మావోయిస్టు పార్టీ అగ్రనేత దేవ్ జీ వెల్లడించారు. పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి మిగతా 2లో..

## నేపాల్‌లో గణపతి?

అక్కడే గత కొన్నేళ్లుగా మావోయిస్టు అగ్రనేత పునరావాసం పొందుతున్నట్లు పోలీసుల అనుమానం

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం 2లో..

## కేరళ.. ఇక కేరళం

పేరు మారుస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం



9లో..

## ఉద్యోగ సంఘాల హర్షం

- ఒక్కో సమస్య పరిష్కారమవుతోంది
- మా చిరకాల వాంఛ నెరవేర్చారు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉద్యోగ, పెన్షనర్ సంఘాల నేతల కృతజ్ఞతలు

హైదరాబాద్(జనంసాక్షి): దశాబ్దాల తమ వాంఛను నెరవేర్చారంటూ ఉద్యోగ, పెన్షనర్ సంఘాల నేతలు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకూ రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తింపు, రూ.1,056 కోట్ల మూలనిధితో ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య పథకానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నేతలు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళ వారం ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య, బీమా పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని వారు కొనియాడారు. 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలను పొందే విధంగా ఉద్యోగులు, పెన్షనర్లకు అవకాశం లభించడం నిజంగా వరమని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న ఈ నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిపోతాయని ఉద్యోగ సంఘాల నాయకులు కొనియాడారు. ముఖ్యమంత్రికి, మంత్రివర్గ సభ్యులకు ఉద్యోగ సంఘాల నేతలు ధన్యవాదాలు మిగతా 2లో..



## జైల్లో పెట్టినా తగ్గేదిలేదు

- కాంగ్రెస్ అరాచకాలను ఇక సహించేది లేదు
- బాల్క సుమన్‌ను జైలులో పరామర్శించిన కేటీఆర్



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి): ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను బీఆ ర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ చెప్పారు. బాల్క సుమన్ ఇవాళ కొత్తగా జైలు కుపోలేదని, ఉద్యమ సమయంలో ఆరు నెలలు జైల్లో ఉన్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో మిగతా 2లో..



## రెండేళ్లుగా దేవాదులకు ఎకరా భూమినీ సేకరించలేదు

- సాగునీరు అందించిన పాపాన పోలేదు
- వరంగల్ ఆస్పత్రి నిర్మాణాలను పరిశీలించిన హరీశ్

వరంగల్(జనంసాక్షి):కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో దేవాదుల నుంచి ఒక్క ఎకరా భూమినీ సేకరించలేదని, సాగునీరూ అందించలేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మంత్రుల మాటలకు, సీఎం మాటలకు పొంతన లేదన్నారు. ఈ ప్రభుత్వానికి డేట్‌లు, డెడ్‌లైన్‌లు మాత్రమే మారుతున్నాయని హరీశ్ రావు అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మిగతా 2లో..

## 16 రాష్ట్రాల్లోని 104 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్

హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల పోలీసులు భారీ ఆపరేషన్



హైదరాబాద్(జనంసాక్షి):ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 16 రాష్ట్రాల్లోని 104 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. నిందితుల్లో బ్యాంకు అధికారులు కూడా ఉన్నారు. 32 బృందాలతో 16 రాష్ట్రాల్లో 10 రోజుల మిగతా 2లో..

## కృష్ణా జలాలపై రాజీలేదు

**తెలంగాణకు దక్కాల్సిన చుక్క నీరూ వదులుకోం**

- ఒక్క ఖరీఫ్ సీజన్లోనే 140 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి
- జానపహాడ్ జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పరిశీలించిన మంత్రి ఉత్తమ్



పాలకవీడు(జనంసాక్షి): కృష్ణా జలాలను ఒక్క చుక్క కూడా వదులుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని రాష్ట్ర పౌరసరఫరాల ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని గుండెబోయిన గూడెం గ్రామ శివారులో కృష్ణా నదిపై 300 కోట్ల భారీ వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జవహర్ జాన్ పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పరిశీలించారు. 2026 మే చివరి నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ. కృష్ణా జలాల వాటా విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వమే ఎక్కువ వాటాన్ని ఆంధ్ర ప్రాంతానికి కట్టబెట్టి తెలంగాణ ప్రజానీకానికి అన్యాయం చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపణ చేశారు. గత పది ఏళ్ల పాలనతో పోల్చుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో అత్యధికంగా వరి ధాన్యం పండుతుందని, ఒక ఖరీఫ్ సీజన్లోనే 140 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండిందని తెలిపారు.కాగా 25 వేల కోట్ల మిగతా 2లో..

## పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు


- మార్చి మొదటి వారంలో లబ్ధిదారులకు అందిస్తాం
- నిర్మాణ పనులను పనులను వేగవంతం చేయండి
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక : మంత్రి ఉత్తమ్

12లో..

## బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

దేశవ్యాప్తంగా అమలుకు కేంద్రం సన్నాహాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను దేశవ్యాప్తంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రత్యేక టీకా కార్యక్రమంలో భాగంగా 14ఏళ్ల వయసు పైబడిన బాలికలకు ఉచితంగా అందించనున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వర్గాలు మిగతా 2లో..




## నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు



- ఎంతకాలం ఉంటానో తెలియదు..
- అయినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్(జనంసాక్షి): నేను ఎంతకాలం ఉంటానో తెలియట్లేదు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్-ఎ-లాగో రిసార్ట్ లోకి తుపాకీతో చొరబడేందుకు ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాటాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా ?' అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి 'ప్రభావశీల' అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని చెప్పారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల నాయకుడిగా ఉంటే బాగుండేదేమో.. కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందాం అని చమత్కరించారు. ఫిబ్రవరి 22 తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఆస్టిన్ మిగతా 2లో..



## రోగిని తరలిస్తుండగా కుప్పకూలిన ఎయిర్ అంబులెన్స్

- ఏడుగురి దుర్మరణం
- టేకాఫ్ అయిన కొద్దిసేపటికే చోటుచేసుకున్న ఘటన

ఝార్ఖండ్(జనంసాక్షి):ఝార్ఖండ్‌లోని ఛత్రా జిల్లాలో ఎయిర్ అంబులెన్స్ కుప్పకూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కాలిన గాయాలతో విషమ పరిస్థితుల్లో ఉన్న రోగిని చికిత్స కోసం రాంచీ నుంచి దిల్లీకి తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ విషయాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మిగతా 2లో..

## మోదీ అమెరికాకు అమ్ముడుపోయారు



- ట్రంప్ బెదిరింపులకు తలొగ్గిన ప్రధాని మోడీ
- రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ట్రేడ్ డీల్
- ప్రజాసమస్యలపై లోక్‌సభలో మాట్లాడనివ్వలేదు
- మరోసారి విమర్శలు గుప్పించిన రాహుల్

భోపాల్(జనంసాక్షి): భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారంనాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని మిగతా 2లో..

## కన్నకొడుకుని కట్టెలపొయ్యిలో వేసి..

రెండు నెలల బాలుడిని కిరాతకంగా హత్య చేసిన తల్లి

హైదరాబాద్ దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం

2లో..

## జీహెచ్ఎంసీలోనూ పాగా వేస్తాం

ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకు వెళతాం: బండి

# నేపాల్‌లో గణపతి?

- అక్కడే గత కొన్నేళ్లుగా మావోయిస్టు అగ్రనేత పునరావాసం పొందుతున్నట్లు పోలీసులు అనుమానం
- తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం

**హైదరాబాద్(జనంసాక్షి):**కొన్ని దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీని నడిపించిన అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు నేపాల్‌లో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గత కొన్నేళ్లుగా భారత్ పొరుగునున్న నేపాల్‌లో ఆయన మకాం వేశారు. తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన నడవలేని పరిస్థితిలో ఉన్నారు. అయితే గణపతిని భారత్‌కు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వృద్ధాప్యం కారణంగా మావోయిస్టు పార్టీ కార్యదర్శి పదవిని గణపతి వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. మరో వైపు హైదరాబాద్‌లో పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట నలుగురు కీలక మావోయిస్టులు లొంగిపోనున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సెక్రటరీ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు, కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డితోపాటు నున్నె నరసింహారెడ్డిలు లొంగిపోనున్నారు. ఇటీవల ఆసిఫాబాద్ అడవుల్లో ఎస్ఐబీ ఎదుట దేవ్ జీతోపాటు మల్లా రాజిరెడ్డి లొంగిపోయిన సంగతి తెలిసిందే. అదీకాక దేవ్ జీతోపాటు పలువురు అగ్రనేతలు మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలకు చేరుకున్నారంటూ నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో కర్రెగుట్టల ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మరణించిన విషయం విదితమే. 2026, మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశిరచుకొంది. ఆ దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. దీంతో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిరంతరం కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. వేలాది మంది ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. పలువురు అరెస్టయ్యారు. భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో పలువురు అగ్రనేతలు సైతం మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు పోలీసులకు చిక్కితే.. మావోయిస్టు పార్టీ చరిత్రగా మిగిలిపోయే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.

# కృష్ణా జలాలపై రాజీలేదు

రూపాయలు 70 లక్షల మెట్రో టన్నుల వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. మే నెల చివరి నాటికి జాన్ పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేసి పండగల ప్రారంభించుకుందామని అక్కడ రైతులకు చెప్పారు. నన్ను ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి నాకు అండగా ఉన్న కృష్ణా బేసిన్ ప్రాంత ప్రజలకు రుణపడి ఉంటాను అన్నారు. తనను గెలిపించిన వారి కోసం విశ్రాంతి లేకుండా అహర్నిశలు పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. ఈర్ష్య, ద్వేషాలతో ఆరోపిస్తున్న బారాస పార్టీ నాయకుల మాటలు పూర్తిగా విషపూరితమని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు,మాజీ ఎంపీపీ గోపాల్, మార్కెట్ చైర్మన్ విజయ లక్ష్మి నరసింహారావు, ఇరిగేషన్ చీఫ్ ప్ రమేష్ బాబు,ఈ ఈ రామకిషోర్, డిఈ నవీకాంత్,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జీహెచ్‌ఎంసీలోనూ పాగా వేస్తాం

- ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకు వెళతాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళతామని అన్నారు. భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులతోనే కరీంనగర్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. పాతబస్తీలోని భాగ్యలక్ష్మీ ఆలయం వద్ద మొక్కులు తీర్చుకునేందుకే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మీ ఆలయం ఎంతో పవర్‌ఫుల్ అని, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో ఈ ఆలయాన్నీ గో÷-డలెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. పాతబస్తీ హిందువులకు భాగ్యలక్ష్మీ అమ్మవారు రక్షణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ప్రజా సంగ్రామ యాత్రను భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులతో ప్రారంభించామని, కేసీఆర్ ప్రభుత్వ అడ్డంకులను ఎదుర్కొని 1640 కిలోమీటర్ల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశామని బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లో హిందూ సమాజానికి ఏ ఆపద వచ్చినా అడ్డుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేసిన బండి సంజయ్.. ఆలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం, బంజారాహిల్స్ పెద్దమ్మ ఆలయం, శంషాబాద్ ఆలయాలపై దాడులు జరిగాయన్నారు. బాన్సువాడలో హిందువులపై రాళ్లదాడి జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని, అమాయకులను అరెస్ట్ చేయడం సరికాదని కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలీసులు అక్రమ అరెస్టులను ఆపాలని హెచ్చరించారు. అవసరమైతే తానే బాన్సువాడకు వెళ్లి హిందువులకు రక్షణగా నిలుస్తానన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగులకు బకాయిలు, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## రెండేళ్లుగా దేవాదుల ఎకరా భూమినీ సేకరించలేదు

మంత్రి హరీశ్ రావు మరోసారి విరుచుకుపడ్డారు. మంగళవారం వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మాజీ మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్‌ను తాము సందర్శించిన వెంటనే సీఎం రివ్యూ చేశారని.. తాము తట్టిలేపితేనే సీఎం నిద్ర లేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్ట్ మొదటి ప్రాధాన్యమని చెబుతూనే పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి నీళ్లను పొలాలకు మళ్లించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. కాంగ్రెస్ ఏమీ చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. అసెంబ్లీలో కెమెరా తిప్పకుండా, మైక్ కట్ చేయకుండా చర్చించే దమ్ము సీఎంకు ఉందా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. దేవాదుల ప్రాజెక్ట్‌లో 90 శాతం పనులు పూర్తయ్యాయని, 10 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని.. త్వరలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల కోసం కేసీఆర్ హెల్త్ సిటీ నిర్మిస్తే.. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం రేవంత్ రెడ్డిదని.. పేదల కోసం పనిచేసే ఆలోచన కేసీఆర్‌ది అని ఆరోపించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిపై నిర్లక్ష్యం చేయవద్దని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందని పనులు చేయట్లేదని ఆరోపించారు.

**సౌతర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**

**టెండరు నోటీసు(పేపర్ నోటిఫికేషన్ -19/25-26)**

సీఈ/ఎంపీ జోన్‌ఈ ప్రొక్యూర్ టెండర్స్:1)కొత్తపేట్‌కు ఎస్‌పీ నం.22-ఏ/25-26 33కేవీ సోర్స్ రీకాల్ చేయుట, 2)ఆటోనగర్ ఎస్ఎస్ ఈహెచ్‌టీ నుంచి ప్రశాంత్‌నగర్ ఫీడర్ వరకు 33కేవీ బైఫర్‌కేషన్ చేయుట. బిడ్ మొదలు తేది:25.02.26 16.00 గం॥లకు.దాఖలుకు చివరి తేది:11.03.26, 16.00 గం॥లకు.& హార్డ్‌కాపీ దాఖలు తేది: 12.03.26, 12.00 గం॥లకు. మరియు మొదటి ఈఎక్స్‌టీ 1) ఆదిత్య ఎస్ఎస్ ఎస్‌పీ.నం.27/25-26 33 కేవీ సోర్స్ దాఖలుకు చివరి తేది: 04.03.26. హార్డ్‌కాపీ దాఖలు తేది: 05.03.26,12గం॥లకు.మరియు సీల్డ్‌టెండర్ డీఈ/ఈసీజీహెచ్ 1) ఎస్‌పీ నం.1/25-26(షార్ట్‌టెండర్) చాంపాపేట్ ఎస్ఎస్33 కేవీ ఫీడర్( సెల్ మొదలు తేది: 25.02.26, 11 గం॥లకు, సెల్ చివరి తేది: 04.03.26, 16 గం॥లకు, స్వీకరణకు చివరి తేది: 05.03.26, 13 గం॥లకు, బిడ్ తెరచు తేది: 05.03.26, 15 గం॥లకు. గమనిక: దీని గురించి ఏదైనా వివరాలకు వెబ్‌సైట్ **https://tgsouthernpower.org/generaltendrs** లో పొందగలరు.

**సం/- చీఫ్ ఇంజినీర్, మాస్టర్ ప్లాన్ జోన్,టీజీఎస్‌పీడీసీఎల్, గ్రేటర్ హైదరాబాద్**

DIPR No.15937-PP/CL/ADVT/1/2025-26



# మావోయిస్టు పార్టీ అగ్రనేతల లొంగుబాటు

అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. ఈ నలుగురి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన ప్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు.

**ఒక్కొక్కరు అంచెలంచెలుగా..**

1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984-89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి.. 1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010-16 మధ్య ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 1996లో ఆర్ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999-2000లో ఏటూరునాగారం-మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె నరసింహా రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు.

# నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు

టక్కర్ మార్టిన్ (21) అనే యువకుడు షాట్ గన్, ఇంధనం క్యాన్‌తో మార్-ఎ-లాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మార్టిన్ అక్కడికక్కడే మరణించాడు. ఆ సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లో ఉన్నారు. గతంలో కూడా ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో చనిపోయిన యువకుడు ఎప్ స్టీన్ ఫైల్స్ విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై అసహనంతో ఉన్నట్లు కొన్ని టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా వెల్లడయ్యింది.తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు.2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

# మోదీ అమెరికాకు అమ్ముడుపోయారు

అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ అబద్దాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు.అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

# ఉద్యోగ సంఘాల హర్షం

తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐకాస నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, పి.దామోదర్ రెడ్డి (పీఆర్‌టీయూ), చావా రవి (యూటీఎఫ్), కే.వెంకటేశ్వర్లు (టీఎన్జీవో), ఉపేందర్ రెడ్డి (టీజీవో), జి.సదానందగౌడ్ (ఎస్టీయూ), దామోదర్ రెడ్డి, ఉమాదేవి (పెన్షనర్స్), వి.రవీందర్ రెడ్డి (రెవెన్యూ), గిరి శ్రీనివాస్ రెడ్డి (సెక్రటేరియట్), ఖాదర్ (ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్), టి.లక్ష్మన్ (ఎక్సైజ్), తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ (డిప్యూటీ కలెక్టర్ల సంఘం), ఎస్.రాములు, రమేష్ పాక, సీహెచ్.శ్రీనివాస్ (తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్), బాణాల రాంరెడ్డి, వి.భిక్షం (తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్), డా.నిర్మల, ఎల్.దశరథ్(టీజీసీపీఎస్ఈయూ), గరికె ఉపేందర్‌రావు (జీపీవో), సుగంధిని (హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌డబ్ల్యూ), భూమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'మా' ఈఎన్‌టీ సిల్వర్ జూబిలీ వేడుకలు

**హైదరాబాద్(జనంసాక్షి):**ఇప్పటివరకూ ఎన్నో లక్షల మందికి సర్వీస్ అందించిన 'మా' ఈఎన్ టీ హాస్పిటల్ సోషల్ సర్వీస్ లో కూడా ముందు ఉంటోంది... అన్నారు సీపీ సజ్జనార్. 'మా' ఈఎన్ టీ హాస్పిటల్ సిల్వర్ జూబిలీ సెలెబ్రేషన్స్ కి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మోకాళ్లు, న్యూరో ప్రోబ్లేమ్స్, క్యాన్సర్లు.. ఇలా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఇప్పుడు ఎక్కువయ్యాయి. కానీ 25 ఏళ్ల క్రితం ఈఎన్ టీ కోసం ఒక ప్రత్యేక హాస్పిటల్ ప్రారంభించడం అభినందనీయం. పాన్ ఇండియా గా విస్తరిస్తున్న 'మా' హాస్పిటల్ పాన్ గ్లోబల్ కావాలని అభిలషిస్తున్న" అంటూ హాస్పిటల్ సీఎండీ సునీత జీ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మేఘనాథ్ ని అభినందించారు. రెండు దశాబ్దాలుగా మా ఈఎన్ టీ తో తనకు అనుబంధం ఉందన్నారు.'మా' ఈఎన్ టీ ప్రారంభించి 25 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా సిబ్బంది అందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తున్నట్టు ప్రకటించారు సీఎండీ సునీత జీ కుమార్. 'మా' హాస్పిటల్ తరపున ప్రతి ఏటా పేద చిన్నారులకు ఉచిత కాక్లియర్ ఆపరేషన్లను చేస్తున్నట్టు చెప్పారామె. రెండేళ్ల లోపు చిన్నారులందరికీ ఉచిత హియరింగ్ టెస్టులను కూడా అందిస్తున్నామన్నారు. చిన్నారుల కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీల కోసం సిబ్బంది అందరూ తమ ఒకరోజు శాలరీని డొనేట్ చేస్తున్నట్టు సిబ్బంది తరపున డాక్టర్ రణీత్ ఈ సందర్భంగా ప్రకటించారు.'మా' ఈఎన్ టీ ప్రారంభం నుండి సేవలందిస్తున్న సీనియర్ సిబ్బందిని సజ్జనార్ సత్కరించారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, ఓబుల్రెడ్డి స్కూల్స్ అధినేత ఎస్వీ రావు, శ్రీ గిరి కుమార్, డాక్టర్ రణీత్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ అక్షిత్, రవికాంత్, వికాస్, జిష్, తదితరులు పాల్గొన్నారు.



## కన్నకొడుకుని కట్టెలపొయ్యిలో వేసి

హైదరాబాద్(జనంసాక్షి):దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. రెండు నెలల బాలుడిని కన్న తల్లి అత్యంత దారుణంగా హత్య చేసింది. బాలుడిని కట్టెల పొయ్యిలో వేసి కాల్చి చంపింది. ఏడవకుండా నోట్లో బట్టలు కుక్కి, కాళ్లు కట్టేసి మరి హత్య చేసింది. బౌరంపేట్ ప్రాంతంలో ఈ అమానుష ఘటన జరిగింది. ఈ ఘటనపై స్థానికుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బిహార్ కు చెందిన కుటుంబం బౌరంపేట్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ సైట్ వద్ద పని చేస్తున్నట్లు సమాచారం.నవమోసాలు మోసిన బిడ్డను అతి దారుణంగా చంపడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు పసిబిడ్డను చంపడానికి ఆమెకు మనస్సు ఎలా వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తల్లి ఇలా ఎందుకు చేసిందో తెలియాల్సి ఉంది. అలానే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరించారు.

# 16 రాష్ట్రాల్లోని 104 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్

పాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. నిందితులపై దేశవ్యాప్తంగా 1,055 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు వీరు పలు సైబర్ నేరాల్లో రూ.127 కోట్లకు పైగా మోసాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. వారి నుంచి రూ.36 లక్షల నగదుతో పాటు 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్‌కార్డులు, 152 బ్యాంక్ పాస్‌బుక్‌లు, 234 డెబిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

# బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్!

వెల్లడించాయి. ఇందులో భాగం గా గార్డాసిల్ ఇంజెక్షన్‌ను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనున్నట్లు సమాచారం.ఈ వ్యాక్సిన్ నాలుగు రకాల గర్భాశయ క్యాన్సర్‌లను నిరోధిస్తుంది. ఈ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ టైప్ 16, 18 తోపాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఒక డోసు వ్యాక్సిన్ అందించడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాల రక్షణ కల్పిస్తుందని దేశీయంగా, అంతర్జాతీయంగా జరిపిన శాస్త్రీయ పరిశోధనల్లో తేలింది. జాతీయ కార్యక్రమంలో భాగంగా దీన్ని స్వచ్ఛందంగా, ఉచితంగా అందివ్వనున్నారు.15ఏళ్ల లోపు బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గార్డాసిల్-4 టీకాను రెండు డోసుల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర. 3,927. అదే 15 ఏళ్ల వయసు పైబడిన బాలికలు మాత్రం మూడు డోసుల్లో తీసుకోవాలి. ఈవ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసులో అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడోస్థానంలో ఉంది.

# నేటినుంచి ఇంటర్ పరీక్షలు

489126 మంది, సెకండియర్‌లో 507949 మంది కలిపి మొత్తం 997075 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్ష కేంద్రానికి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థుల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, గోడ గడియారాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళన, మానసిక ఆవేదన లాంటి సమస్యలను అధిగమించేందుకు 14416, 80693 91416 నెంబర్లను అందుబాటులోకి తెచ్చామని, విద్యార్థులు ఈ నెంబర్లకు ఫోన్ చేసి కౌన్సెలింగ్ సేవలు పొందవచ్చని కృష్ణ ఆదిత్య తెలిపారు.

**5 నిముషాల ఆలస్యాన్ని పరిగణిస్తాం**

రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్ మీడియట్, ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం తర్వాత ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతినిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పీ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య , పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ , ఫిబ్రవరి 25 వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని , గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత విజిలెన్స్ గా ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్ ల సౌకర్యాలు కల్పించడంతో పాటు సి.సి టీవీ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రం లో ఒక ఏ.ఎన్.ఎం , ఫస్ట్ ఎయిడ్ కిట్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదని అన్ని కేంద్రాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,239 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు ఇతర ఎలక్ట్రానిక్ గా÷-జడెట్ లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే ఎమ్జర్గ÷న్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ప్రతీ పరీక్ష ప్రశ్న పత్రానికి ప్రత్యేకంగా ఖి.ఖీ కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందని పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగా మాత్రమే ప్రశ్నా పత్రాలను ఓపెన్ చేయాలని స్పష్టం చేసారు. మొదటి సారిగా విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు.

# జైల్లో పెట్టినా తగ్గేదిలేదు

అధికారాన్ని హస్తగతం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఆదేమని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించిందని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలో జరిగిన అక్రమాన్ని ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది' అని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.కేటీఆర్ ఇంకా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయి, బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా వ్యవహరించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 22 చోట్లకుగానూ 14 స్థానాల్లో గెలుపుతో స్పష్టమైన మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాల్లో మాత్రమే గెలిచినా అధికార దాహంతో ప్రజాతీర్పును అపహాస్యం చేసింది. సీఎం, స్థానిక మంత్రి సూచనలకు అనుగుణంగా అధికారులు వారికి తొత్తులుగా మారి ప్రజాతీర్పును ఎగతాళి చేశారు' అని మండిపడ్డారు. 'మరికొన్ని మున్సిపాలిటీల లోనూ ఇదే రీతిన వ్యవహరించారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా ప్రవర్తించినా కనీసం మంత్రి స్పందించలేదు. దేశ చరిత్రలో ఇంత ఘోరమైన రాజకీయం లేదు. బాల్క సుమన్‌ను ఇక్కడ జైలులో ఉంచి వారి డ్యూటీకి ఆటంకం కలిగించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులను బూతులు తిట్టినా కేసు పెట్టలేదు. బీజేపీ ఎంపీ అరవింద్ పోలీసులను తిట్టినా కేసులు పెట్టలేదు. అధికార పార్టీ ప్రజాతీర్పును అపహాస్యం చేస్తుంటే.. ప్రశ్నించిన మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. మూడు కోట్ల ఆఫర్ ఇచ్చినా మా కౌన్సిలర్లు లొంగలేదు. సీపీఐ కౌన్సిలర్లు సైతం నిబద్ధతతో ఉన్నారు. పొత్తుధర్మాన్ని పాటిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. 'బాల్క సుమన్‌ను జైలులో పెట్టారు. ఆయనకు జైలు కొత్త కాదు. ఆరు నెలలు వివిధ సందర్భాల్లో జైలులో ఉన్నారు. జైలులో పెడితే భయపడతారనుకుంటే పొరపాటే. రేవంత్ రెడ్డికి మళ్లీ చిప్పకూడు తినే సమయం వస్తుంది. పోలీసులను బూతులు తిడితే కేసులు పెట్టని డీజీపీ బీఆర్ఎస్ నేతలపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తిరిగి రాష్ట్రంలో గులాబి జెండా ఎగురుతుంది. ఏ కలుగులో దాక్కున్నా అరాచకాలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని, చట్టాలను తుంగలో తొక్కుతున్న వారిని వదలం. క్యాతన్ పల్లి, ఇబ్రహీం పట్నం, ఖానాపూర్‌లో వెంటనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం' అన్నారు. నిజాయితీగా ఎన్నిక జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. అధికారుల ముసుగులో అధికార పార్టీకి వత్తాసు పలికే వారిని వదలం. క్యాతన్‌పల్లిలో మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై సైతం కేసు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తున్నదన్నారు.

# రోగిని తరలిస్తుండగా కుప్పకూలిన ఎయిర్ అంబులెన్స్

తెలిపింది.రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ అ90 ( వీటీ-ఏజేవీ) విమానం సోమవారం సాయంత్రం 7:11 గంటలకు రాంచీ నుంచి బయలుదేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే వాతావరణం ప్రతికూలంగా మారడంతో, విమాన మార్గాన్ని మళ్లించాలని పైలట్లు కోల్‌కతా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)ను కోరారు. అయితే, రాత్రి 7:34 గంటలకు కోల్‌కతా ఏటీసీ రాడార్‌తో విమానానికి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. ఈ క్రమంలో వారణాసికి ఆగ్నేయంగా 100 నాటికల్ మైళ్ల దూరంలో విమానం అదృశ్యమైనట్లు గుర్తించారు. చివరకు ఛత్రా జిల్లా సిమారియా బ్లాక్‌లోని కసారియా పంచాయితీ పరిధిలోని దట్టమైన అడవుల్లో విమానం కూలిపోయినట్లు అధికారులు ధృవీకరించారు. విమానంలో ఉన్న ఏడుగురు మృతి చెందినట్లు డిప్యూటీ కమిషనర్ వెల్లడించారు.విమానంలో ఉన్నది వీరే గ్యాస్ సిలిండర్ పేలుడు వల్ల 63శాతం కాలిన గాయాలతో రాంచీలోని దేవ్ కమల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంజయ్ కుమార్ (41) అనే రోగిని మెరుగైన వైద్యం కోసం దిల్లీకి తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రోగితో పాటు డాక్టర్ వికాస్ కుమార్ గుప్తా, పారామెడిక్ సిబ్బంది సచిన్ కుమార్ మిశ్రా, రోగి సహాయకులు అర్చన దేవి, ధూరు కుమార్, సీనియర్ పైలట్ కెప్టెన్ వివేక్ వికాస్ భగత్, కో-పైలట్ కెప్టెన్ సవరాజ్‌దీప్ సింగ్ ఉన్నారు.

# హాల్ టికెట్ చూపించి ఎక్కడైనా దిగొచ్చు

- విద్యార్థులకు సౌకర్యంగా ఆర్టీసీ ప్రత్యేక ఆపరేషన్స్
- ఇంటర్మీడియట్,పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ (జనంసాక్షి) : ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సు ఆపరేషన్స్ పై సచివాలయంలో ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. రేపటి నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ,మార్చ్ 14 వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ఉండడంతో పరీక్షల సమయం ఉదయం ,మధ్యాహ్నం సమయంలో అదనంగా బస్సులు ఉంచేలా చర్యలు తీసుకున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఎండి నాగిరెడ్డి ఇతర ఆర్టీసీ అధికారులతో ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల సమీపిస్తుండడంతో విద్యార్థులకు బస్సులు ఇబ్బందులు లేకుండా కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్షించామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.. గ్రామీణ ప్రాంతాల నుండి పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు బస్సులు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. బస్సుల ఆపరేషన్ మరింత కిందిస్థాయి వరకు పంపించడం జరిగిందన్నారు. పరీక్షా సమయంలో బస్సుల హాల్టు స్టాప్ ఉన్నా లేకున్నా బస్సులు ఆగేలా హాల్ టికెట్ ఆధారంగా పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను దింపేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. దీనిని ప్రతి డిపో మేనేజర్ ద్వారా ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ సౌకర్యాన్ని విద్యార్థులు వినియోగించుకుని ఇలాంటి మానసిక ఆందోళన చెందకుండా పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని రవాణా శాఖ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు.. హాల్ టికెట్ ద్వారా విద్యార్థులకు కావాల్సిన స్టాప్ దగ్గర దిగడానికి ఉపయోగించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఈడిలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- నాలుగు దశల్లో రూ.695 కోట్ల మాస్టర్ ప్లాన్
- తొలి దశ పనులు 2027 మార్చి 31లోపు పూర్తి చేయాలి
- మంత్రి కొండా సురేఖ
- నిత్య అన్నదాన సత్రం నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం





హైదరాబాద్/వేములవాడ (జనంసాక్షి) : సచివాలయంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి సమీక్ష నిర్వహించారు. మొత్తం నాలుగు దశల్లో రూ.695 కోట్ల వ్యయంతో మాస్టర్ ప్లాన్ రూపొందించగా, అందులో తొలి దశకు సంబంధించిన రూ.111.25 కోట్ల పనుల పురోగతిపై సమీక్షించారు. తొలి దశ పనులు 2027 మార్చి 31లోపు పూర్తి చేయాలని, ఈ ఏడాది వర్షాకాలం రాకముందే రూఫ్ లెవల్ పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు మంత్రి ఆదేశించారు. వేములవాడ దేవాలయంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భక్తుల సౌకర్యాల మెరుగుదల, మౌలిక సదుపాయాల విస్తరణపై విస్తృతంగా చర్చించారు. పనులు వేగవంతం చేసి, రాజన్న సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. శృంగేరి పీఠాధిపతి సూచనల మేరకు ఆలయ అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఒకేసారి 500 మంది కూర్చునేలా నిత్య కళ్యాణ మండపం నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. మహా మండపం నిర్మాణంలో రాఫ్ట్ పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని వివరించారు. నిత్య అన్నదాన సత్రం నిర్మాణాన్ని అన్ని వసతులతో చేపట్టాలని ఆదేశించారు దాతల సహకారంతో అన్నదాన సత్రానికి రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.. అందులో భాగంగా మొదటి విరాళంగా మంత్రి కొండా సురేఖ 25 లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించారు..విప్ ఆది శ్రీనివాస్ కొండా సురేఖ కు కృతజ్ఞతలు తెలిపారు..

## భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

చెరువు కట్టపై జరుగుతున్న ట్యాంక్ బండ్ పనుల పురోగతిపై మంత్రి కొండా సురేఖ వివరాలు తెలుసుకున్నారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకోసం ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు చేయాల ని సూచించారు. భక్తుల కోసం తగిన టాయి లెట్లు నిర్మించాలని సూచించారు. రాజన్న ఆల యంలో కోడెల సంరక్షణకు ప్రత్యేక వెటర్నరీ డాక్టర్‌ను నియమించడంతో పాటు, భక్తుల కోసం పూర్తి స్థాయిలో వైద్యులను అందుబాటు లో ఉంచాలని ఆదేశించారు. దేవాలయంలో వాడిన పూలతో అగర్‌బత్తీలు తయారు చేసి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. శ్రీశైలం దేవస్థానం తరహా లో శివస్తోత్రాలతో మ్యూజిక్ ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచిం చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హరీష్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, దేవాదాయశాఖ సలహాదారు గోవింద హరి, ఎస్ఆర్ఆర్డీ ఈవో రమాదేవి తదితర దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పేదలపై అప్రకటిత యుద్ధం చేస్తున్నారా?

- తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రజాపాలన పేరుతో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ పేదలపై అప్రకటిత యుద్ధం చేస్తోందని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు విమర్శించారు. ఖమ్మం పట్టణంలోని ఇల్లు లేని పేదలు గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో వెలుగుమట్ల గ్రామ పరిధిలోని సుమారు 14ఎకరాల భూదాన భూములను పేద ప్రజలు ఐక్యంగా నివాస యోగ్య భూములుగా మార్చుకొని, గుడిసెలు, ఇల్లు నిర్మించుకొని 12ఏళ్లుగా జీవిస్తున్నారని, ఖమ్మం జిల్లా కలెక్టరెట్ కి కూత వేటు దూరంలో, నివాస యోగ్యం, చదును చేయబడిన ఈ పేదల భూమలపై ఏ పెద్దోడి కన్ను పడిందో...? ఏమో కానీ...? భూదాన బోర్డు నుండి ఇంటి స్థలాలు మంజూరు అయినా రెవిన్యూ శాఖ నుండి మాత్రం సహకారం లేకపోవడం, నీళ్ల సదుపాయం, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని పేదలు ఎన్ని సార్లు జిల్లా కలెక్టర్‌కు తమ గోడు చెప్పుకున్నా కూడా జిల్లా అధికారుల సహకారం అందకపోవడం, దశాబ్ద కాలంగా సమస్యలతో పోరాడుతు తమ 'గూడు' కాపాడుకుంటున్న పేదల గుడిసెలను వందలాది మంది పోలీస్‌ల ఆధ్వర్యంలో జేసీబీ మిషన్ లతో "పేదోడి గూడు పై ప్రభుత్వం యుద్ధం ప్రకటించిందా? అన్నట్లుగా ఉందని అన్నారు. మంగళవారం తెల్లవారు జాము నుండి సాయంత్రం వరకు అక్కడి నివాస పేదలను భయభ్రాంతులకు గురి చేస్తూ అన్ని ఇళ్లను నేలమట్టం చేసారని తెలిపారు. ప్రజా పాలనా పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఖమ్మం పేదలపై యుద్ధం ప్రకటించడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. అక్కడ నివసిస్తున్న అర్హులైన పేదలందరికి అక్కడే ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# యువ ఆపద మిత్రులకు హైడ్రా అవకాశం

- సేవలను వినియోగించుకుంటాం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : ప్రకృతి వైపరీత్యాల సమయంలో యువ ఆపద మిత్రుల సేవలను వినియోగించుకుంటామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌లో నియామక సమయంలో కూడా వీరికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. -యువ ఆపద మిత్ర- పథకంలో భాగంగా హైడ్రాలో శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లకు మంగళవారం ధ్రువపత్రాలు అందజేసిన అనంతరం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన 105 మంది యువ వాలంటీర్లు వారం రోజుల పాటు ఫతుల్‌గూడలోని హైడ్రా శిక్షణ పొందారు. ఫిబ్రవరి 18 నుంచి 24 వ తేదీ వరకూ హైడ్రా ఇచ్చే శిక్షణలో ఆపద సమయంలో ప్రజలను ఎలా రక్షించాలనే మెలుకువలన్నీ నేర్చుకున్నారు. స్థానికంగా ఉంటారు.. ప్రమాద సమయంలో రెస్పాండ్ అయ్యే మొట్టమొదటి వ్యక్తులుగా ఓ వైపు సేవలందిస్తూనే.. మరోవైపు వివిధ శాఖల నుంచి వచ్చిన సహాయక బృందాలతో కలసి పని చేయాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్నవారు మరో 10 మందిని సిద్ధం చేసి.. మేమున్నామనే భరోసా స్థానికంగా ఉన్న ప్రజలకు ఇవ్వాలని సూచించారు. అలాగే భారీ వర్షాలు, వరదల సమయంలో హైడ్రాతో కలిసి పని చేయడానికి సిద్ధంగా.. అందుబాటులో ఉండాలని సూచించారు.

## హైడ్రా శిక్షణ జీవితాంతం ఉపయోగపడాలి..

పర్యావరణ హితమైన నగర నిర్మాణం ప్రభుత్వ లక్ష్యమని.. హైడ్రా ఆ దిశగా పని చేస్తోందని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు చెప్పారు. వరదలు లేని నగర నిర్మాణంలో భాగంగా చెరువులు, నాలాలను పరిరక్షించడానికి హైడ్రా చర్యలు తీసుకుంటోందన్నారు. ఆపద సమయంలో ఎలా స్పందించాలి.. ప్రజల ప్రాణాలు ఎలా కాపాడాలి అనే అంశాలన్నిటిలో మీరు తీసుకున్న శిక్షణ జీవితాంతం మీకు ఉపయోగపడాలన్నారు. ఈ సందర్భంగా హైడ్రా కార్యకలాపాలతో పాటు శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలపై కమిషనర్ ఆరాతీశారు. పార్కులు, చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణతో పాటు.. పర్యావరణహితమైన నగర నిర్మాణంలో హైడ్రా తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని.. మేము కూడా భాగస్వామ్యమౌతామని విద్యార్థులు చెప్పారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువులను కూడా పరిశీలించామని.. చాలా బాగున్నాయన్నారు. విపత్తుల సమయంలో ఎలా అని భయపడేవాళ్లమని.. ఇప్పుడు మేము ప్రజలను కాపాడగలమనే ధైర్యం వచ్చిందన్నారు. వారం రోజుల శిక్షణ.. సమాజం పట్ల బాధ్యతను పెంచిందన్నారు. యువ ఆపద మిత్రులుగా హైడ్రాకు అండగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. హైడ్రా అడిషనల్ కమిషనర్ ఆర్ సుదర్శన్, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్యగారు, హైడ్రా ఆర్ ఎఫ్‌వో జయప్రకాష్, డీఎఫ్‌వో యజ్ఞనారాయణ, ఇన్‌స్పెక్టర్ శంషుద్దీన్, ఏడీఎఫ్‌వో మోహనరావు యువ ఆపద మిత్ర శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# సీఎం ప్రజావాణిలో 319 దరఖాస్తులు

హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 319 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 102, రెవెన్యూ శాఖకు సంబంధించి 39, ఇందిరమ్మ ఇండ్ల కోసం 118 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 60 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. కిరణ్ కుమార్, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## మద్యం తాగే విషయంలో గొడవ

- ఒకరి పై దాడి... పరిస్థితి విషమం..



చెన్నారావుపేట, ఫిబ్రవరి 24 (జనం సాక్షి): మండలంలోని జల్లి గ్రామంలో ఘర్షణ జరిగిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ఇదే గ్రామంలో ఓ వ్యక్తి ఇంటి వద్ద శుభకార్యం జరుగుతుంది. శుభకార్యంకు వెళ్లే ముందు మద్యం త్రాగే విషయంలో ఇదే గ్రామానికి చెందిన మంచాల సురేష్, దొంతర బోయిన కొమ్మాలు ఇద్దరి మధ్య మాట మాట పెరిగి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో మంచాల సురేష్ ను దొంతరబోయిన కొమ్మాలు, అతని కుమారులు రాజేందర్, నరేష్ లు ముగ్గురు కలిసి కర్రలతో దాడి చేసి కొట్టారు. ఈ దాడిలో సురేష్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మంచాల సురేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఎంజిఎంకు తరలించారు. ప్రస్తుతం సురేష్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సురేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం అందడంతో జరిగిన సంఘటనపై విచారణ చేపడుతున్నారు.

# నైపుణ్యాభివృద్ధి..అభివృద్ధి వ్యూహం



- అడ్వాన్స్డ్ స్కిల్ సెంటర్లుగా ప్రభుత్వ ఐటీఐలు
- పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన పాఠ్య ప్రణాళిక
- కార్మిక శాఖా మంత్రి డా. జీ వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి ఒక శాఖ మాత్రమే కాదు అభివృద్ధి వ్యూహంగా మారిందన్నారు కార్మిక శాఖా మంత్రి డా. జీ వివేక్ వెంకటస్వామి. గత కొన్ని సంవత్సరాలుగా ఐటీఐలు, శిక్షణా మౌలిక వసతులను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్డ్ స్కిల్ సెంటర్లు గా మారుస్తున్నామని చెప్పారు. ఆధునిక యంత్రాలు, డిజిటల్ పరికరాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన పాఠ్య ప్రణాళికలను అమలు చేస్తున్నామని వివరించారు. కన్హా శాంతి వనంలో నిర్వహించిన ఇండియా స్కిల్స్ కాంపిటిషన్ 2025-26 దక్షిణ ప్రాంత పోటీల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంప్లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ క్రాంతి వేస్లీ, ఐఏఎస్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. సౌత్ ఇండియా స్థాయి పోటీలలో మొత్తం 63 నైపుణ్య విభాగాల్లో 350కి పైగా పోటీదారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా 123 మంది యువతులు పాల్గొనడం ప్రోత్సాహకరంగా నిలిచింది. సంప్రదాయంగా పురుషాధిక్యంగా భావించే కేబినెట్ మేకింగ్, కార్పెంట్రీ, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్, ప్లంబింగ్, హీటింగ్ వంటి రంగాల్లో 20 మంది మహిళలు పోటీ చేయడం సామాజిక మార్పుకు నిదర్శనంగా నిలిచింది. 3డి డిజిటల్, అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోనమస్ మొబైల్ రోబోటిక్, బ్యూటీ థెరపీ, బ్రిక్ లేయింగ్, కేబినెట్ మేకింగ్, కార్పెంట్రీ తదితర విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు మంత్రి గారు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ఈ రోజు కేవలం సర్టిఫికెట్ల గురించినది కాదు. ఇది కృషి, క్రమశిక్షణ, అంకితభావం మరియు ప్రతిభను గౌరవించే రోజు. ఇక్కడ ఉన్న యువతను చూసినప్పుడు దేశ భవిష్యత్తుపై అపారమైన విశ్వాసం కలుగుతోంది అన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ విద్యాసంస్థలు మరియు పరిశ్రమల మధ్య వారధిగా కీలక పాత్ర పోషిస్తోందని, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కరణ సామర్థ్యం, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను శిక్షణలో భాగం చేశామని మంత్రి తెలిపారు. హైదరాబాద్ ఐటీ, ఫార్మాస్యూటికల్స్, ఏరోస్పేస్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో గ్లోబల్ కేంద్రంగా ఎదిగిందని, అందుకే ఏఐ, రోబోటిక్స్, మెకాట్రానిక్స్, డేటా అనలిటిక్స్, గ్రీన్ టెక్నాలజీస్ వంటి రంగాల్లో నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. 'నైపుణ్యాభివృద్ధి కేవలం ఉపాధి కోసం మాత్రమే కాదు, సాధికారత కోసం కూడా. ఒక యువకుడు లేదా యువతి నైపుణ్యం నేర్చుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, గౌరవం వస్తుంది, స్వతంత్రత సాధ్యమవుతుంది. నైపుణ్యం ఉన్న వారు అవకాశాల కోసం ఎదురుచూడరు, వారు అవకాశాలను సృష్టిస్తారని మంత్రి స్పష్టం చేశారు.

# 'మా' హాస్పిటల్ సోషల్ సర్వీస్‌లో ముందుంటుంది

- హైదరాబాద్ సీపీ సజ్జనార్
- ఘనంగా 'మా' ఈఎన్ టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : ఇప్పటివరకూ ఎన్నో లక్షల మందికి సర్వీస్ అందించిన 'మా' ఈఎన్‌టీ హాస్పిటల్ సోషల్ సర్వీస్ లో కూడా ముందుంటుందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. 'మా' ఈఎన్ టీ హాస్పిటల్ సిల్వర్ జూబిలీ సెలెబ్రేషన్స్ కి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మోకాళ్లు, న్యూరో ప్రోబ్లెమ్స్, క్యాన్సర్లు.. ఇలా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఇప్పుడు ఎక్కువయ్యాయి. కానీ 25 ఏళ్ల క్రితం ఈఎన్ టీ కోసం ఒక ప్రత్యేక హాస్పిటల్ ప్రారంభించడం అభినందనీయం. పాన్ ఇండియా గా విస్తరిస్తున్న 'మా' హాస్పిటల్ పాన్ గ్లోబల్ కావాలని అభిలషిస్తున్న" అంటూ హాస్పిటల్ సీఎండీ సునీత జీ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మేఘనాథ్ ని అభినందించారు. రెండు దశాబ్దాలుగా మా ఈఎన్ టీతో తనకు అనుబంధం ఉందన్నారు.

'మా' ఈఎన్ టీ ప్రారంభించి 25 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా సిబ్బంది అందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తున్నట్టు ప్రకటించారు సీఎండీ సునీత జీ కుమార్. 'మా' హాస్పిటల్ తరపున ప్రతి ఏటా పేద చిన్నారులకు ఉచిత కాక్లియర్ ఆపరేషన్లను చేస్తున్నట్టు చెప్పారామె. రెండేళ్ల లోపు చిన్నారులందరికీ ఉచిత హియరింగ్ టెస్టులను కూడా అందిస్తున్నామన్నారు. చిన్నారుల కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీల కోసం సిబ్బంది అందరూ తమ ఒకరోజు శాలరీని డొనేట్ చేస్తున్నట్టు సిబ్బంది తరపున డాక్టర్ రణీత్ ఈ సందర్భంగా ప్రకటించారు. 'మా' ఈఎన్ టీ ప్రారంభం నుండి సేవలందిస్తున్న సీనియర్ సిబ్బందిని సజ్జనార్ సత్కరించారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, ఓబుల్రెడ్డి స్కూల్స్ అధినేత ఎస్వీ రావు, గిరి కుమార్, డాక్టర్ రణీత్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ అక్షిత్, రవికాంత్, వికాస్, జిష్, పాల్గొన్నారు.

# త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

- ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి నడిపించాలన్నదే మా అజెండా
- తెలంగాణ సమగ్రాభివృద్ధికే 'క్యూర్ - ప్యూర్ - రేర్'
- 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో.. త్వరలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు శ్రీకారం చుట్టబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేలా, పెట్టుబడిదారులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేలా, ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా అందరితో చర్చించి ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... గ్రోత్ అంటే యాదృచ్ఛికంగా వచ్చేది కాదని, భావి తరాల భవిష్యత్తు కోసం శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ విజన్ 2047' ను రూపొందించిందన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న తెలంగాణను, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'క్యూర్ - ప్యూర్ - రేర్' అనే త్రిముఖ వ్యూహానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామన్నారు. నగరం నుంచి గ్రామం వరకు ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. ఏఐ, ఇండస్ట్రీ 5.0 లాంటి టెక్నాలజీస్ తో వర్క్ కల్చర్ లో మార్పు వచ్చిందని, రాబోయే రోజుల్లో కంపెనీల కంటే 'ఎకో సిస్టం'కే ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానినే నిర్మించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే వ్యవస్థలా కాకుండా, వారితో కలిసి నడిచే భాగస్వామిగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రముఖ వైద్యులు డా.నాగేశ్వర్ రెడ్డి, ఫ్యాప్సీ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, స్కై రూట్ ఏరో స్పేస్ ప్రతినిధి పవన్, గ్రోత్ ఎక్స్ 2026 కన్వీనర్ పంకజ్ దివాన్ తదితరులు పాల్గొన్నారు.

# కబేళాకు తరలిస్తున్న గోవుల పట్టివేత

## గోరక్షక్ కార్యకర్తల రాకతో ఉద్రిక్తత

హైదరాబాద్, ఫిబ్రవరి24 (జనంసాక్షి) : రాజేంద్రనగర్ పరిధిలోని ఆరంఘర్ చౌరస్తాలో భారీ కంటైనర్‌లో గోవులను తరలిస్తుండగా గోరక్షక్ కార్యకర్తలు అడ్డుకున్నారు. కంటైనర్ డ్రైవర్‌పై స్థానికులు, గోరక్షక్ కార్యకర్తలు దాడికి దిగారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చెలరేగడంతో ఉద్రిక్తత నెలకొంది. భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గోవులను గోశాలకు తరలించాలని గో రక్షక్ కార్యకర్తలు డిమాండ్ చేశారు.

# అమెరికాతో ట్రేడ్ డీల్ భారత్‌కు తీవ్ర నష్టం




ప్రస్తుత ప్రపంచ వాణిజ్యంలో అత్యంత సంక్లిష్టమైన దశలో భారత్ చరిత్రాత్మకమైన దౌత్యపరమైన పొరపాటు చేసిందా? అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల బెదిరింపులకు తలొగ్గి, నరేంద్ర మోదీ ప్రభుత్వం హడావుడిగా ముగించిన వాణిజ్య ఒప్పందం ఇప్పుడు దేశానికి పెను నష్టంగా మారే ప్రమాదం ఉంది. అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ సుంకాలను చట్ట విరుద్ధమని తీర్పు చెప్పిన నేపథ్యంలో, ఈ తొందరపాటు నిర్ణయం భారత దీర్ఘకాలిక వాణిజ్య ప్రయోజనాలను హననం చేసినట్లుగా విమర్శలు వస్తున్నాయి. ట్రంప్ పరిపాలన తన దారికి రాని దేశాలపై 50 శాతం వరకు సుంకాలు విధించే ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలో చాలా దేశాలు వేచిచూసే వైఖరి అవలంబించాయి. ఎందుకంటే, 'ట్రంప్ సుంకాల చట్టబద్ధత'పై అమెరికా సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతోంది. కానీ భారత్ మాత్రం ఈ కేసులో తీర్పు రాకముందే, ట్రంప్ సర్కారుతో వాణిజ్య ఒప్పందాన్ని హడావుడిగా ఖరారు చేసింది. ఫిబ్రవరి 2025లో ప్రధాని మోదీ, ట్రంప్ భేటీ అనంతరం నవంబర్ నాటికల్లా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు. అయితే వ్యవసాయం, పాడి పరిశ్రమల్లో మార్కెట్ యాక్సెస్ విషయంలో భిన్నాభిప్రాయాలతో ఈ చర్చలు నిలిచిపోయాయి .

### అదానీ కేసు - ఎప్ స్టీన్ ఫైల్స్: ఒత్తిడికి కారణాలా?

ఈ ఒప్పందం వెనుక దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలే ప్రధానమనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మోదీ ఆప్తమిత్రుడు గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన కేసులు, వివాదాస్పద జెఫ్రీ ఎప్ స్టీన్ ఫైల్స్ లో ప్రధాని పేరు ప్రస్తావన - ఇవే ఈ తొందరపాటు నిర్ణయానికి ప్రధాన కారణాలని రాజకీయ విశ్లేషకులు, నెటిజన్లు ఆరోపిస్తున్నారు.
నవంబర్ 2024లో గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీతో సహా పలువురిపై అమెరికా న్యాయశాఖ 25 కోట్ల డాలర్ల లంచం ఆరోపణలు చేసింది. సౌరశక్తి కాంట్రాక్టు సాధించేందుకు భారత అధికారులకు లంచాలు ఇచ్చారని, పెట్టుబడిదారులను మోసగించారని ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం ఈ కేసు చివరి దశకు చేరుకుంది. ఫారెన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్.సీ.పీ.ఏ.) కింద నేరం రుజువైతే అదానీకి ఐదేళ్ల జైలు శిక్ష, 2 మిలియన్ డాలర్ల జరిమానా విధించే అవకాశం ఉంది. ట్రంప్ (ఎఫ్.సు.పీ.ఏ.) అమలును 180 రోజులు నిలిపివేసినప్పటికీ, అదానీ పైన ఉన్న వైర్ మోసం, సెక్యూరిటీల మోసం ఆరోపణలు మాత్రం యథాతథంగా ఉన్నాయి. న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం,(ఎఫ్.సీ.పీ.ఏ.) అదానీకి కేసు పూర్తి ఊరటనివ్వదు. ట్రంప్ ప్రభుత్వం లంచం కేసుల్లో అమెరికన్ కంపెనీలపై దృష్టిపెట్టే అవకాశం ఉంది, విదేశీ వ్యక్తులపై కేసులు కొనసాగించవచ్చు .
ఇదిలావుండగా, జెఫ్రీ ఎప్ స్టీన్ ఫైల్స్ ఇటీవల విడుదలకాగా, అందులో ప్రధాని మోదీ పేరు ప్రస్తావన కలకలం రేపింది. 2017లో మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు ముందు ఎప్ స్టీన్ సలహా తీసుకున్నట్లు ఒక ఇమెయిల్లో పేర్కొన్నారు. అమెరికా ప్రయోజనాల కోసమే మోదీ ఆ పర్యటన చేపట్టినట్లు ఆ ఇమెయిల్లో పేర్కొనడం వివాదాన్ని మరింత రెచ్చగొట్టింది. అయితే ఈ ఆరోపణలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. 'నేరస్థుడి ఊహాగానాలు'గా కొట్టిపారేసింది . నిపుణులు కూడా, ఎప్ స్టీన్ ఫైల్స్ లో పేర్లు ఉండటం అంటే నేరంలో భాగస్వామ్యం కాదని హెచ్చరిస్తున్నారు. ఎప్ స్టీన్ ప్రభావం చూపేందుకు తనతో అనుబంధం ఉన్నట్లు చెప్పుకున్న వ్యక్తుల్లో ఇవి కొందరని, వీటిని అతిగా సెన్సేషనలైజ్ చేయడం సరికాదని స్పష్టం చేస్తున్నారు .

### ఈ డీల్‌తో ఎవరికి లాభం? రైతాంగానికి ముప్పు:

ఈ ఒప్పందం భారత్ కంటే అమెరికాకే ఎక్కువ ప్రయోజనం చేకూర్చేదిగా ఉంది. ముఖ్యంగా వ్యవసాయ, పాడిపరిశ్రమల్లో అమెరికా కోరుతున్న మార్కెట్ యాక్సెస్ భారత రైతాంగం భవిష్యత్తుపై తీవ్ర ప్రశ్నలు సృష్టించింది. భారత్ సగటున 18 శాతం వ్యవసాయ సుంకాలు విధిస్తోంది, అమెరికా జీరో శాతం మాత్రమే. ఈ అసమానతను తొలగించాలనేది అమెరికా డిమాండ్. భారత్లో 86 శాతం రైతులు చిన్న, స్వల్పకాలిక రైతులు, రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమి కలవారు. వీరు అమెరికన్ అగ్రి-బిజినెస్తో పోటీపడటం దాదాపు అసాధ్యం .

### విపత్తు ఖరీదు: 175 బిలియన్ డాలర్ల రుణ విముక్తి:

ఫిబ్రవరి 2026 చివరిలో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పరిస్థితిని పూర్తిగా మార్చేసింది. 1977 నాటి అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద ట్రంప్ విధించిన సుంకాలు చట్టవిరుద్ధమని 6-3 తీర్పులో స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ తమ తీర్పులో, "దిగుమతులను నియంత్రించే అధికారంలో సుంకాలు విధించే అధికారం ఇమిడి ఉండదు" అని పేర్కొన్నారు . ఈ తీర్పుతో(ఐఈఈపీఏ) కింద వసూలు చేసిన 175 బిలియన్ డాలర్లకు పైగా సుంకాలను అమెరికా వాపసు చేయాల్సి రావచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. అంటే అమెరికా సగటు సుంకం రేటు 13.6 శాతం నుంచి 6.5 శాతానికి తగ్గుతుందని భావిస్తున్నారు .

### తీర్పు అనంతరం భారత్ స్పందన:

"చెతులు కాలాక ఆకులు పెట్టుకున్నట్లుంది". సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే, భారత ప్రభుత్వం అమెరికాతో జరగాల్సిన మిగిలిన వాణిజ్య చర్చలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఇది పూర్తిగా అస్తవ్యస్తమైన దౌత్య వైఖరిగా విమర్శలు వస్తున్నాయి. ట్రంప్ ప్రభుత్వం ఆగస్టు 2025లో భారత్ తో జరగాల్సిన ఆరో దశ చర్చలను రద్దు చేసుకుంది . ఇప్పుడు కోర్టు తీర్పు తర్వాత, ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకోని దేశాలు ఊపిరి పీల్చుకుంటుంటే, భారత్ మాత్రం తన తొందరపాటు నిర్ణయానికి చింతించాల్సిన పరిస్థితి. ఒకవైపు సుంకాలు వసూలు చేయకూడదనే కోర్టు తీర్పు, మరోవైపు అప్పటికే ఒప్పందంలో భాగంగా ఇచ్చిన రాయితీలు - ఈ రెండింటి మధ్య భారత్ చిక్కుకుపోయింది. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ మంగళవారం నుంచి ఈ సుంకాల వసూళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది .

### దీర్ఘకాలిక పాఠం: వేచిచూసే వ్యూహమే మేలు:

ప్రస్తుత పరిణామాలు భారత దౌత్యానికి ఓ పెద్ద పాఠం నేర్పాయి. అంతర్జాతీయ ఒత్తిడులకు తలొగ్గే ముందు, ఆయా దేశాల న్యాయవ్యవస్థలో కొనసాగుతున్న కేసుల తీర్పుల కోసం వేచిచూడటం వ్యూహాత్మకంగా ఎంతో అవసరమని ఈ ఘటన రుజువు చేసింది. ట్రంప్ సుంకాల చట్టబద్ధతపై సుప్రీంకోర్టులో కేసు ఉందని తెలిసినప్పటికీ, భారత్ హడావుడిగా ఒప్పందం కుదుర్చుకోవడం దేశ వాణిజ్య ప్రయోజనాలకు తీవ్ర లోటు చేకూర్చింది. ట్రంప్ ప్రభుత్వం భారత్ పై రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు 50 శాతం సుంకాలు విధించింది. దీనితో రత్నాలు, ఆభరణాలు, రెడీమేడ్ గార్మెంట్స్, ఆటో కాంపొనెంట్స్ రంగాల ఎగుమతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి . ఇప్పుడు ట్రంప్ సుంకాలే చట్టవిరుద్ధమని తీర్పు రావడంతో, భారత్ అనవసరంగా రాయితీలు ఇచ్చిన నష్టం మిగిలింది. ఈ తీర్పు భారత దౌత్యంలోని లోపాలను వెలుగు లోకి తెచ్చింది. ఒత్తిడికి తలొగ్గడం కాకుండా, వేచిచూసే వ్యూహంతో ఎదుర్కోవడం ఎంతో ప్రయోజనకరమని నిరూపించింది. దేశ ప్రయోజనాలను కాపాడుకోవడంలో ఈ పాఠం భారత్‌కు భవిష్యత్తులో దోహదపడుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

మానసిక శక్తి-ఆత్మవిశ్వాసం
# కోల్పోతున్న యువత



21వ శతాబ్దం ప్రారంభం నుండి యువత జీవన విధానంలో వచ్చిన వేగవంతమైన మార్పులు వారి మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసంపై లోతైన ప్రభావం చూపుతున్నాయి. 2000లో 15-29 వయస్సు గల యువతలో తీవ్ర మనోవేదన లక్షణాలు 10-12% మధ్య ఉండగా, 2010 నాటికి ఈ శాతం 15%కి చేరింది. 2020 కరోనా మహమ్మారి తర్వాత అనేక దేశాల్లో ఈ స్థాయి 22-28% వరకు పెరిగింది. 2022 తర్వాత కొంత తగ్గుదల కనిపించినా, 2015 స్థాయికి దగ్గరగా లేదా అంతకంటే ఎక్కువగానే ఉంది. ఆందోళన లక్షణాలు 2005లో 8-10% మధ్య ఉండగా, 2023 నాటికి కొన్ని ప్రాంతాల్లో 25% దాటాయి. 2024 గణాంకాల ప్రకారం 18--25 వయస్సు గల యువతలో 35% మంది తమ సామర్థ్యంపై అనిశ్చితి వ్యక్తం చేశారు. సుమారు 40% మంది సోషల్ మీడియాలో ఇతరులతో పోల్చుకోవడం వల్ల స్వీయ విలువ తగ్గిందని చెప్పారు. ఇది కేవలం సంఖ్యలు కాదు-ఇవి భవిష్యత్ తరాల మానసిక బలం క్షీణిస్తున్నట్లు సూచిస్తున్న హెచ్చరికలు. భారతదేశంలో 15-29 వయస్సు గల యువజన జనాభా 27-30% మధ్య ఉంది. 2005లో మానసిక రుగ్మతలు 8% చుట్టూ ఉండగా, 2015 నాటికి 14%కి పెరిగాయి. 2020-2021లో పట్టణ విద్యార్థుల్లో మనోవేదన 25% వరకు నమోదైంది. 2024లో గ్రామీణ ప్రాంతాల్లో 18%, పట్టణ ప్రాంతాల్లో 24% వరకు మానసిక ఒత్తిడి స్థాయిలు ఉన్నాయి. ఇది దేశ భవిష్యత్తుకు సంబంధించిన గంభీర సమస్య.
విద్యా పోటీ తీవ్రత భయంకరంగా పెరిగింది. 2010 తర్వాత జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యేవారు 30% పైగా పెరిగారు. కానీ విజయం సాధించేవారు 5-15% మధ్యే ఉన్నారు. 85-95% మంది విఫలమవుతున్నారు. వరుస అపజయాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఒక్కో పరీక్ష అపజయం ఒక్కోసారి జీవితంలో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయేలా చేస్తోంది.
యువ నిరుద్యోగం మరింత భయానకం. 2019లో 17% ఉండగా, 2022లో 23%కి చేరింది. ఉపాధి భద్రత లేకపోవడం భవిష్యత్తుపై భయాన్ని పెంచుతోంది. 2023 సర్వేలో 40% యువత భవిష్యత్తుపై నమ్మకం తగ్గిందని తెలిపారు. ఉద్యోగం లేకుండా ఉన్న యువతలో ఆత్మవిశ్వాస లోపం, నిరాశ ఎక్కువగా కనిపిస్తున్నాయి.సాంకేతిక వినియోగం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. 2015లో చేతి దూర సంభాషణ పరికరాల వినియోగం 35% ఉండగా, 2025లో 85% దాటింది. రోజుకు 3 గంటలకు పైగా సోషల్ మీడియా వినియోగం చేసేవారిలో ఆందోళన లక్షణాలు 50% వరకు అధికంగా ఉన్నాయి. నిద్ర లోపం కూడా పెద్ద సమస్య. 2008లో 6-8 గంటల నిద్ర పొందేవారు 55% ఉండగా, 2022లో 35%కి పడిపోయారు. 6 గంటల కంటే తక్కువ నిద్ర ఉన్నవారిలో మనోవేదన ప్రమాదం 40-45% ఎక్కువగా ఉంది.
మహమ్మారి కాలంలో 70% విద్యార్థులు దూర విద్యకు మారారు. 48% మంది ఏకాంత భావన అనుభవించారు. 2021లో మనోవేదన స్థాయి 25-30% వరకు పెరిగింది. లాక్‌డౌన్, ఆన్‌లైన్ క్లాసులు, సామాజిక దూరం-ఇవన్నీ యువత మానసిక ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపాయి.
లింగ వ్యత్యాసాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2024లో యువ మహిళల్లో ఆందోళన 28% కాగా, యువ పురుషుల్లో 20% నమోదైంది. అయితే ప్రాణత్యాగాలు పురుషుల్లో 1.5 రెట్లు అధికంగా ఉన్నాయి. మహిళల్లో సామాజిక పోలికలు, అందం ప్రమాణాలు ఒత్తిడిని పెంచుతున్నాయి.
ఈ ధోరణి కొనసాగితే 2030 నాటికి యువతలో తీవ్ర మనోవేదన స్థాయి 30% చేరే అవకాశం ఉంది. ఉత్పాదకత 10-15% తగ్గే ప్రమాదం ఉంది. దేశ ఆర్థిక వృద్ధిపై 2-4% ప్రతికూల ప్రభావం పడవచ్చు. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు-దేశ భవిష్యత్తుకు సంబంధించిన గంభీర సవాలు.
పరిష్కారాలు సాధ్యమే. విద్యా సంస్థల్లో సలహా కేంద్రాలు 50% స్థాయిలో అమలు చేసిన చోట మనోవేదన 8% తగ్గింది. రోజువారీ పరికర వినియోగాన్ని 2 గంటలకు పరిమితం చేస్తే 12 వారాల్లో ఆందోళన 20% తగ్గుతుంది. వారానికి 150 నిమిషాల శారీరక వ్యాయామం చేస్తే ఆత్మవిశ్వాసం 30% మెరుగుపడుతుంది. 7-8 గంటల నిద్ర పాటిస్తే భావోద్వేగ స్థిరత్వం 25% పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో వారానికి 3 సార్లు సంభాషణలు జరిపితే ఒత్తిడి 18% తగ్గుతుంది.
2000-2026 గణాంకాలు ఒక గంభీర హెచ్చరికను ఇస్తున్నాయి. యువత మానసిక శక్తి--ఆత్మవిశ్వాసం క్షీణత ఒక సామాజిక సమస్యగా రూపుదిద్దుకుంది. సమగ్ర విద్యా సంస్కరణలు, ఉపాధి అవకాశాల విస్తరణ, కుటుంబ మద్దతు బలోపేతం, ఆరోగ్య సేవల విస్తరణ అమలు చేస్తే 5-10 సంవత్సరాల్లో 15-20% మెరుగుదల సాధ్యమని పరిశోధనలు సూచిస్తున్నాయి.
యువత మానసిక స్థైర్య రక్షణ భవిష్యత్ సమాజ స్థిరత్వానికి పునాది. ప్రతి కుటుంబం, ప్రతి విద్యా సంస్థ, ప్రతి విధాన నిర్ణేత ఈ దిశగా అడుగులు వేయాలి. యువత ఆత్మవిశ్వాసం పునర్నిర్మాణం అనేది దేశ భవిష్యత్ రక్షణతో సమానం. సమిష్టి కృషితోనే ఈ సవాలును జయించగలం. యువతకు మళ్లీ ఆత్మవిశ్వాసం తిరిగి ఇవ్వడమే ఈ తరం బాధ్యత.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



# చెట్లు నరుక భువికి చేటు సుమ్మి!!

నింగిలోన ఎగురు నీలి మేఘాలను
మలయ మారు తముల పిలుపు చేత
నేల పైకి తెచ్చి చేలు పండగ జేయు
చెట్లు నరుక భువికి చేటు సుమ్మి!!
మండు టెండ లందు మల మల మాడుచు
దిక్కు తెలియ కుండ దీన మైన
మానవులకు నీడ తానుగా ఇచ్చెడు
!!చెట్లు!!
కలుషి తాలు చేరి కమ్మని గాలులు
మైల పడెడు వేళ మాన వులకు
స్వచ్ఛ మైన గాలి సమకూర్చు చున్నట్టి
!!చెట్లు!!
పచ్చ దనము చేత పరిసరాలను నింపి
మానవ హృద యాన్ని మధుర మైన
భావ జగతి యందు పరవ శింపగ చేయు
!!చెట్లు!!
సర్వ ప్రకృతి మధ్య సమతౌల్య మణగారి
హెచ్చు తగ్గు లైన
చిచ్చు రగిలి
మానవ మనుగడ మరి లేక జగతిలో
!!చెట్లు!!
జంతు పక్షి జాతి కంతటి కాధార
మగుచు...రోజు రోజు అందమైన
పూల వాస నలతొ పుడమినే రంజించు
!!చెట్లు!!
నేల నింగి మధ్య నేస్తంబు లైనట్టి
నేల కెంతొ శక్తి నిచ్చు నట్టి
నేల తల్లి జీవ నాళంబు లైనట్టి !!చెట్లు!!
మనిషి మోస గించు మనిషినే చివరకు
ధనము తీర్చ లేదు మనిషి కోర్కె
పచ్చని తరువేమొ బహుళార్థ సాధనము
!!చెట్లు!!
ప్రగతి రూపు దాల్చి ప్రతి నిత్యమూ ఎదిగి
ప్రరుల సేవ మించి బతుకు లేక అణువు
అణువు ప్రజల అభ్యున్నతిని కోరు
!!చెట్లు!!
మనిషి కొక్క చెట్టు మక్కువగా పెంచి
పల్లె పట్టు లన్ని వనము లైన
పర్య వరణ మంత ప్రాణ వాయువు నిండి
భావి జనుల బతుకు భాగ్య మౌను.

సడ్లపల్లె చిదంబరరెడ్డి

# మరణ భయం: మనసు నిర్మించిన అంతుచిక్కని సౌధం!

మనిషి పుట్టుకతో మొదలైన భయం, ఆఖరి శ్వాస వరకు నీడలా వెన్నాడుతూనే ఉంటుంది. చీకటిని చూసినా, ఒంటరితనంలో ఉన్నా, ఏదో తెలియని వణుకు. జబ్బులు చుట్టుముడతాయనో, ఓడిపోతామనో, నలుగురిలో తలవంచుకోవాల్సి వస్తుందనో ఇలా భయాల జాబితాకు అంతుండదు. అయితే, ఈ భయాలన్నీ ఎక్కడ పుడుతున్నాయి? శతాబ్దాలుగా మేధావులను తొలిచేస్తున్న ప్రశ్న ఇది. దీనికి వారు కనుగొన్న అసలు సిసలు సమాధానం మరణ భయం. నిజానికి, మరణం పట్ల ఉండే ఆందోళనే మన మనసులోని భయాలన్నింటికీ పునాది. చావు అంటే భయం దీనినే సైన్స్ భాషలో థనటోఫోబియా అంటారు. గ్రీకు దేవుడు థనాటోస్ నుండి వచ్చిన ఈ పేరు వెనుక ఎంతో లోతైన అర్థం ఉంది. ఇది కేవలం శరీరం అంతమైపోతుందన్న భయం కాదు, మనం నిర్మించుకున్న ప్రపంచం, మన అనుబంధాలు, మన అస్తిత్వం మంచులా కరిగిపోతాయేమో అన్న ఆవేదన. ప్రముఖ మేధావి ఎర్నెస్ట్ బెకర్ అన్నట్లు మనం చూస్తున్న ఈ నాగరికత, కళలు, మతాలు అన్నీ మరణం అనే నిజాన్ని మర్చిపోయేందుకు మనం కట్టుకున్న కోటలే! చిత్రం ఏమిటంటే, ఈ భయం మనకు నేరుగా కనిపించదు. అది ఎన్నో ముసుగులు వేసుకుని మన మనసు పొరల్లో దాక్కుంటుంది. మన ప్రవర్తనలో చాలా సూక్ష్మంగా కలిసిపోతుంది. ఎవరైనా అనారోగ్యం గురించి అతిగా ఆందోళన చెందుతున్నారంటే, అది కేవలం ఆ నొప్పుల గురించి కాదు. ఆ వ్యాధి తమను మృత్యువు ముంగిట నిలబెడుతుందన్న అంతర్లీన భయం. ఒక చిన్న అస్వస్థతను కూడా ప్రాణాంతక వ్యాధిగా ఊహించుకోవడం వెనుక ఉన్నది మన అస్తిత్వ భయం.దీనినే మనస్తత్వవేత్తలు హైపోకాండ్రియా అంటారు అంటే, శరీరంలో కలిగే ప్రతి మార్పులోనూ మరణం కనిపిస్తుందన్నమాట. కొందరికి ఎత్తు చూస్తే కళ్లు తిరుగుతాయి, మరికొందరికి లోతైన నీటినిచూస్తే వణుకు పుడుతుంది.
ఇవి విడివిడిగా కనిపించే ఫోబియాలు అనిపించినా, వీటి వెనుక ఉన్నది మన మెదడు ఇచ్చే ఒక హెచ్చరిక జాగ్రత్త! ఇక్కడ ప్రాణానికే ముప్పు ఉంది అని. పరిణామ క్రమంలో మనిషి తన మనుగడను కాపాడుకోవడానికి అలవాటు చేసుకున్న ఒక రక్షణ కవచమే ఈ భయం. మనకు ఇష్టమైన వారు మనల్ని వదిలి వెళ్ళిపోతారన్న భయం కేవలం విరహం మాత్రమే కాదు. వారు లేకపోతే అసలు నేను బతకగలనా? అన్న ఆర్తనాదం ఆ భయం లోపల దాగి ఉంటుంది. అందుకే, మనసుకి ఒక గాఢమైన ప్రేమను కోల్పోవడం అంటే అది ఒక రకమైన మరణం లాంటిదే. నలుగురిలో నా పరువు పోతుందా? అందరూ నన్ను మర్చిపోతారా? అన్న భయం నిజానికి సామాజిక మరణం పట్ల ఉండే ఆందోళన. మనిషి కేవలం బతకడమే కాదు, సమాజంలో తన ఉనికిని చాటుకోవాలని, చరిత్రలో తన పేరు చిరస్థాయిగా నిలవాలని కోరుకుంటాడు. ఈ అన్వేషణ అంతా ఒక రకంగా అమరత్వం కోసమే! నేను చేసే పనిలో చిన్న తప్పు కూడా



దొర్లకూడదు అని కొందరు అతిగా ఆరాటపడుతుంటారు. ఈ పర్ఫెక్షనిజం వెనుక కూడా ఒక సూక్ష్మమైన భయం ఉంటుంది. తప్పు చేస్తే నన్ను ఎవరూ ప్రేమించరు, చివరకు నేను ఒంటరిగా మిగిలిపోతాను అన్న ఆలోచన ఆఖరికి మరణ భయంలోకే దారితీస్తుంది.
మనం పరిపూర్ణంగా ఉండాలనుకోవడం వెనుక కూడా మరణాన్ని జయించాలన్న కోరిక దాగి ఉంది. మరణం గురించి భయం ఎందుకు? ఈ ప్రశ్నకు సమాధానం కోసం శతాబ్దాలుగా తత్వవేత్తలు ఎన్నో మేధోమథనాలు చేశారు. గ్రీకు తత్వవేత్త ఎపిక్యూరస్ ఒక అద్భుతమైన మాట చెప్పారు మనం ఉన్నప్పుడు మరణం ఉండదు, మరణం వచ్చినప్పుడు మనం ఉండము. కాబట్టి మనం మరణాన్ని అనుభవించేదే లేదు!
వినడానికి ఇది తార్కికంగా చాలా బాగుంది. కానీ, మనిషి కేవలం తర్కంతో (లాజిక్) మాత్రమే బతికే యంత్రం కాదు కదా! అతనికంటూ కొన్ని భావోద్వేగాలు, అహం, తీపి జ్ఞాపకాలు, చిక్కని ప్రేమలు ఉంటాయి. ఇవన్నీ కలిసి అల్లుకున్న ఒక అందమైన ప్రపంచమే అతని అస్తిత్వం . ఆ ఉనికే ఒక్కసారి గా తుడిచిపెట్టుకుపోతుందేమో అన్న ఆందోళనే,మరణ భయం. మరోవైపు స్టోయిక్ తత్వవేత్తలైన మార్కస్ అరేలియస్, సెనెకా వంటి వారు మరో మార్గం చూపారు. వారు రోజూ మరణాన్ని ధ్యానించమని కోరారు. దానినే మెమెంటో మోరీ (మెమెంటో మోరీ) అంటారు. అంటే, నీవు మరణిస్తావని గుర్తుంచుకో అని అర్థం. వారి ఉద్దేశ్యం భయపెట్టడం కాదు,మరణాన్ని ఒక సహజమైన నిజంగా స్వీకరించినప్పుడే, దాని పట్ల ఉన్న అనవసరపు భయం తగ్గుతుందని చెప్పడం. భయం నుండి విముక్తి అంటే ఆ భయాన్ని నిరాకరించడం కాదు, అది ఉందని అంగీకరించడమే! మన భారతీయ తత్వశాస్త్రం మరణాన్ని ఒక భయంకరమైన ముగింపులా చూడదు. భగవద్గీతలో కృష్ణపరమాత్మ చెప్పినట్లు నైనం ఛిందంతి శస్త్రాణి, నైనం దహతి పావకః అంటే, ఆత్మను ఆయుధాలు ఛేదించలేవు, అగ్ని దహించలేదు. మరణం అనేది కేవలం పాత వస్త్రాలను విడిచి కొత్తవి ధరించడం వంటి ఒక పరివర్తన మాత్రమే. ఈ లోతైన దృక్పథం మరణ భయాన్ని పోగొట్టడానికి ఒక అద్భుతమైన మందు అని నేటి ఆధునిక మానసిక శాస్త్రవేత్తలు కూడా అంగీకరిస్తున్నారు. కానీ, దురదృష్టవశాత్తూ నేటి సమాజంలో మరణం గురించి మాట్లాడటమే ఒక నిషేధం (టాబూ) అయిపోయింది. చావు అనే పదాన్ని పలకడానికి కూడా మనం జంకుతాం.
ఆసుపత్రుల్లో డాక్టర్లు కూడా చనిపోయారు అని నేరుగా చెప్పలేక, మేము పేషెంట్‌ని కోల్పోయాం అని సున్నితమైన పదాల వెనుక నిజాన్ని దాచేస్తుంటారు. అంత్యక్రియలను కూడా ఏదో త్వరగా ముగించేసి, మళ్లీ మన యాంత్రిక జీవితంలోకి పారిపోవాలని చూస్తాం. నిపుణులు ఏమంటున్నారంటే. మనం ఎంతగా మరణాన్ని చూసి మొహం చాటేస్తామో, మనలో ఆ భయం అంతగా పెరిగిపోతుందట. ఈ మరణ వ్యతిరేక సంస్కృతి మనల్ని వాస్తవానికి దూరం చేస్తోంది. ఈ సోషల్ మీడియా రోజుల్లో మనం పెట్టే ప్రతి ఫోటో, చేసే ప్రతి రీల్ వెనుక ఒక తెలియని తపన దాగి ఉంది. మన జీవితం ఎంత అందంగా ఉందో ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంటాం. దీనినే సైకాలజీ భాషలో ఇమ్మోర్టల్ ఇమేజ్ అంటారు. అంటే, రేపు నేను లేకపోయినా, ఈ ఇంటర్నెట్ లోకం నన్ను గుర్తుంచుకోవాలి అన్న ఆరాటం. ఇది ఒక రకమైన డిజిటల్ అమరత్వం కోసం మనం చేసే అన్వేషణే! ప్రముఖ మనస్తత్వవేత్త అబ్రహాం మాస్లో చెప్పినట్లు మనిషికి భద్రత (సేఫ్టీ) అనేది ప్రాథమిక అవసరం. కానీ మరణం అనే ఆలోచన ఆ భద్రతను నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుంది.
ఈ ఒత్తిడి వల్లే చాలామందిలో నిద్రలేమి, అనవసరమైన ఆందోళన (ఆంక్సైటీ), పానిక్ అటాక్స్ వంటి సమస్యలు మొదలవుతాయి. కొందరు ఈ భయాన్ని మర్చిపోవడానికి మత్తు పదార్థాలకు బానిసలైతే, మరికొందరు పనిలో పడి (వర్కహాలిజం) తలమునకలవుతుంటారు. ఇవన్నీ ఆ మరణ భయం వేసే రకరకాల వేషాలే! మనస్తత్వ శాస్త్రంలోని టెర్రర్ మేనేజ్‌మెంట్ థియరీ ప్రకారం ఈ మరణ భయాన్ని తట్టుకోవడానికి మనిషి ప్రధానంగా రెండు దారులు వెతుక్కుంటాడు .మతం, సంస్కృతి లేదా రాజకీయాల్లో చేరి, తనకంటే గొప్పదైన ఒక లక్ష్యం కోసం పని చేస్తున్నానని నమ్ముతాడు. నేను ఏదో ఒకటి సాధించాను, నాకంటూ ఒక గుర్తింపు ఉంది అని నిరూపించుకోవడం ద్వారా తన ఉనికికి ఒక అర్థాన్ని వెతుక్కుంటాడు. అయితే, ఈ భయాన్ని కేవలం సిద్ధాంతాలతోనే కాకుండా. మనశ్శాంతితో ఎలా జయించవచ్చో మానసిక నిపుణులు, ఆధ్యాత్మిక గురువులు కొన్ని విలువైన సూచనలు చేశారు. మరణం గురించి భయపడటం మానేసి, జీవితాన్ని పరిపూర్ణంగా ఆస్వాదించడానికి నిపుణులు చెబుతున్న కొన్ని ఆచరణాత్మక మార్గాలు ఇవే మరణం గురించి మాట్లాడటం అమంగళం అనుకోకుండా, దాని గురించి చర్చించడం మొదలుపెట్టాలి.
డెత్ కేఫ్ (డెత్ కేఫ్) లాంటి అంతర్జాతీయ ఉద్యమాలు ఇదే పనిచేస్తున్నాయి. ఇలా బహిరంగంగా సంభాషించడం వల్ల మనసులోని భారం తగ్గి, మరణం పట్ల ఒక సహజమైన అవగాహన పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. రేపు ఏమవుతుందో అన్న ఆందోళన కంటే, ఈ క్షణం నా చేతుల్లో ఉంది అన్న నిజాన్ని ప్రేమించాలి. బౌద్ధ ధ్యాన పద్ధతులు మనకు ఇదే నేర్పుతాయి. ఏదీ శాశ్వతం కాదు (ఇంపర్మనెన్స్) అని అంగీకరించినప్పుడు, భయం పోయి ప్రశాంతత లభిస్తుంది. ప్రముఖ మనస్తత్వవేత్త విక్టర్ ఫ్రాంక్ల్ తన 'మ్యాన్స్ సెర్చ్ ఫర్ మీనింగ్' పుస్తకంలో ఒక అద్భుతమైన విషయం చెప్పారు జీవితానికి ఒక అర్థం, ఒక లక్ష్యం దొరికిన మనిషికి మరణం అంటే భయం ఉండదు. మనం ఎందుకు బతుకుతున్నామో తెలిస్తే, ఎలా చనిపోతామో అన్న ఆందోళన మటుమాయమవుతుంది. ఉద్దేశ్యపూర్వకమైన జీవనమే మరణ భయానికి అసలైన మందు. ప్రతి రోజూ నిద్రపోయే ముందు ఒక్క నిమిషం ఆగి.. ఈ రోజు నేను అర్థవంతంగా బతికినా? ఎవరికైనా సాయపడ్డానా? అని ప్రశ్నించుకోవాలి. ఈ అలవాటు మన జీవితంలో దేనికి ప్రాధాన్యత ఇవ్వాలో నేర్పుతుంది. చావు భయం కంటే బతుకు మీద గౌరవాన్ని పెంచుతుంది. మరణం గురించి ఆలోచించడం అంటే మనల్ని మనం బాధపెట్టుకోవడం కాదు నిజానికి అది మనం ఎలా జీవించాలో నేర్పే ఒక గొప్ప పాఠం.
మరణం పట్ల భయం కలగడం మానవ సహజం. మనల్ని మనం కాపాడుకోవడానికి ప్రకృతి మనకు ఇచ్చిన ఒక హెచ్చరిక ఇది. కానీ, ఈ భయం హద్దు మీరితేనే అసలు సమస్య మొదలవుతుంది. ప్రేమించాల్సిన చోట భయపడతాం, సాహసించాల్సిన చోట వెనకడుగు వేస్తాం. బతకాల్సిన ప్రతి క్షణాన్ని ముందే చచ్చేలా చేసుకుంటాం రోమన్ చక్రవర్తి మార్కస్ అరేలియస్ ఒక అద్భుతమైన మాట చెప్పారు నీవు ఎంత కాలం జీవిస్తావో నీకు తెలియదు కానీ ఈ క్షణాన్ని అద్భుతంగా జీవించే అవకాశం మాత్రం నీ చేతుల్లోనే ఉంది.మరణ భయాన్ని జీవితం పట్ల ఉత్సాహంగా మార్చుకోవడానికి ఇంతకంటే పెద్ద సూత్రం మరొకటి లేదు.మరణం అనేది జీవితానికి వ్యతిరేకం కాదు, అది జీవితంలో ఒక సహజమైన భాగం. పాత ఆకులు రాలితేనే కదా కొత్త చిగురులు వచ్చేది! పాత పాట ముగిస్తేనే కదా కొత్త రాగం మొదలయ్యేది! మనలోని భయాన్ని పూర్తిగా చంపేయాల్సిన అవసరం లేదు. కానీ ఆ భయం ఎందుకు పుడుతుందో తెలుసుకుని, దాంతో వివేకంతో వ్యవహరించడమే జీవన కళ . మనలోని అన్ని భయాలకూ మూలం మరణ భయమే అని గుర్తించిన రోజున ఆ భయం నుండి విముక్తి పొందే దారి కూడా మనకు కనిపిస్తుంది. మరణాన్ని ఒక శత్రువులా కాకుండా, మన జీవితానికి ఒక హద్దును, విలువను నిర్ణయించే గురువు గా భావిద్దాం. అప్పుడే మనం మరణించే వరకు పరిపూర్ణంగా, ప్రాణప్రదంగా జీవించగలుగుతాం.

డా .సూర్యదేవరరామకృష్ణ ,
9490754169

# ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియను వెంటనే చేపట్టాలి

- ఎలక్ట్రిక్ బస్సులతో చాప కింద నీరులా ఆర్టీసీ
- దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి
- ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి అందించాలి
- ఆర్టీసీ జెయింట్ యాక్షన్ కమిటీ నాయకులు




**ముషీరాబాద్, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** రోజు రోజుకి ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతుందని, తద్వారా చాప కింద నీరుల ప్రైవేటీకరణకు ఆర్టీసీ దారితీస్తుందని టీజీ ఆర్టిసి జెయింట్ యాక్షన్ కమిటీ నాయకులు జి ఎస్ ఆర్ టి సి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఈ వెంకన్న, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో కన్వీనర్ కే యాదయ్య, ఎస్ సురేష్,బి.యాదగిరి అన్నారు. ఆర్టీసీ కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్దమంగళవారం చలో సెక్రటేరియట్ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఎన్ని మెమోరాం డమ్‌లు సమర్పించిన స్పందన లేకపోవడంతో చలో సెక్రటేరియట్ కార్యక్రమం చేపట్టివలసి వచ్చిందని ఆర్టిసి జేఏసి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన భారీ ఆర్టీసీ కార్మికుల సమావేశంలో టీ జి ఎస్ ఆర్ టి సి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఈ వెంకన్న, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో కన్వీనర్ కే యాదయ్య, ఎస్ సురేష్,బి.యాదగిరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఆయన ముఖ్యమంత్రి అయ్యి రెండున్నర సంవత్సరాలు గడిచినా విలీన ప్రక్రియ నేటి వరకు మొదలుకాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ నేటి వరకు నెరవేరకపోవడంతో కార్మికులలో అసంతృప్తి నెలకొందని తెలియజేశారు. 2019 నుండి బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను నిర్వీర్యం చేసిందని, దాని వలన ఆర్టీసీ కార్మికులపై యజమాన్యం వేధింపులు ఎక్కువ అయ్యాయని, అధికారులు పని భారాలను పెంచి కార్మికుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. విధి నిర్వహణలో ఆర్టీసీ ఉద్యోగి చనిపోతే బ్రెడ్ విన్నర్ స్కీం కింద ఆ కుటుంబంలో అరులైన ఒక్కరికి రెగ్యులర్ ప్రతిపాదికన ఉద్యోగం ఇస్తారని , ప్రభుత్వంలోనూ, సింగరేణి కాలరీస్ లోనూ ఇలాంటి నియమకాలే జరుగుతున్నాయన్నారు. కానీ ఆర్టీసీలో ఇచ్చే ఉద్యోగం రెగ్యులర్ ప్రతిపాదన కాకుండా కన్సాలి డేటెడ్ బేస్ లో కారుణ్య నియామకాలు చేపట్టడం అత్యంతదురదృష్టకరమన్నారు. బ్రెడ్ విన్నర్స్ స్కీం కింద చేసే నియామకాలు రెగ్యులర్ ప్రాతిపదన ఉండాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకాన్ని ఆర్టీసీ కార్మికులు చాలా విజయవంతం చేశారని, ఈ పథకంలో ప్రయాణికులు డ్రైవర్ కండక్టర్ల పై దాడులు చేస్తున్న, కంప్లైంట్ లు చేస్తున్న అంకితభావతంలో పనిచేస్తున్నారన్నారు. ఆర్టీసీలో రోజురోజుకు ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతుందని, తద్వారా చాప కింద నీరులా ప్రైవేటీకరణకు దారితీస్తుందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహన డిపోలకు రావడం వల్ల సిబ్బందిని ఇతర డిపోలకు బదిలీ చేస్తున్నారని, తద్వారా కార్మిక కుటుంబాలు ఇబ్బందులుపడుతున్నాయని అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి సప్లై చేయాలని, దాని వలన ఆ బస్సులో నాటిసిలకే చెందుతాయని ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులు లాభదాయం కాకపోగా నష్టాలు తెస్తున్నాయని అన్నారు. 2017లో రిటైర్ అయిన కార్మికులకు ఫిక్సేషన్లు జరిగినా, నేటి వరకు వారికి సెటిల్మెంట్ చేయలేదని, వెంటనే2021 వేతన సవరణ ప్రకారం ముప్పై శాతం ఫిట్మెంట్ తో ఆర్టీసీ కార్మికులకు అందజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రజకులపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి



**ఉప్పల్, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకనగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా, కొమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా రజకులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చనిపోయిన చిన్నారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర సమన్వయకర్త గజ్జెల సత్యరాజ్ గౌడ్ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ప్రజలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం కఠినంగా అణచివేయాలని కోరారు. ఈ ఘటనలో నిందితులుగా ఉన్న శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడిలో పసిపాపను కోల్పోయి తీవ్రంగా గాయపడిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి కోటి రూపాయల నష్టపరిహారం మరియు ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై ఎటువంటి దాడులు జరగకుండా కఠిన చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో చిలుకనగర్ రజక సంఘం అధ్యక్షుడు స్వామి, సంఘం నాయకులు ఐలయ్య, రవీందర్, బాబు, కార్తీక్, శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే బీసీ జేఏసీ నాయకులు నేర్ధం భాస్కర్ గౌడ్, గోనె శ్రీకాంత్, పుప్పాల వెంకటేశ్వర్లు, జల్లి మోహన్, తెలంగాణ సంపత్, కొంపల్లి రవీందర్, మాస శేఖర్, కొంపల్లి రాజ్ కుమార్, నామ శ్రావణ్, శివ రిషికేష్, సుందర్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నిరసనకారులు ప్రభుత్వాన్ని కోరారు.

## ఒకే ఇంటి నంబర్ పై 60 ఓట్లు నమోదైన వాటిపై విచారణ జరిపించాలి

- బీఆర్ఎస్ యూత్ ఇంచార్జి శివగారి అంజయ్య



**చేర్యాల, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** చేర్యాల మున్సిపాలిటీ 2వ సాధారణ ఎన్నికలు ఇటీవల జరుగగా చేర్యాల 12వ వార్డు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థి ఇంటి నెంబర్ 18–94 పై మొత్తం సుమారుగా 60 ఓట్లు నమోదైన వాటిపై సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ యూత్ నాలుగు మండలాల ఇంచార్జి శివగారి అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నమోదైన ఓట్లపై విచారణ జరిపించాలని కోరుతూ మంగళవారం చేర్యాల తహసీల్దార్ కె.దిలీప్ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాసన సభ, పార్లమెంట్ ఎన్నికలు పోలింగ్ స్టేషన్ బూత్ నెంబర్ 42,43లో ఈ ఓట్లపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. గత శాసనసభ ఎన్నికలలో ఈ ఓట్లు నమోదు కాలేదన్నారు. మున్సిపాలిటీ ఎన్నికలలో ఈ ఇంటి నెంబర్ పై ఎక్కువ సంఖ్యలో ఓట్లు నమోదు కావడం వల్ల సుమారుగా 60 ఓట్లు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. ఆ ఇంటి నెంబర్ పై ఉన్న ఓటర్లు అదే ఇంటి నెంబర్ రేషన్ కార్డు, ఆధార్ కార్డులలో ఉన్న వివరాలు సరిపోలుతున్నాయో లేదో చూసి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. ఓటర్లు తప్పుగా నమోదైతే కఠిన చర్యలు తీసుకొని అన్ని రద్దు చేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికలలో 12 వార్డు నుంచి అదే ఇంటి నంబరులో నివసించే ఓటరు పోటీ చేయడం జరిగిందన్నారు. అట్టి వ్యక్తిపై ఇలాంటి ఓటర్ల నమోదు చేసినందుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఉప సర్పంచ్ మంచాల కొండయ్య,12వ వార్డు అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాస్, సూరంపల్లి ఉపేందర్,ఊట్కూరి అమర్, పరశురాములు, శ్రీశైలం, బుడిగె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వారంలో ఓటర్ 80 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలోని అన్ని గ్రామాలలో ప్రతీ ఇంటికి వెళ్ళి ఖచ్చితమైన ఓటరు గుర్తింపుతో ప్రొసిడింగ్ మ్యాపింగ్, ఎలక్ట్ర రోల్ మ్యాపింగ్ చేపట్టాలని వారం రోజుల్లో ఈ ప్రక్రియను 80 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితా లో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించను న్నారని ఆమె తెలిపారు. ఎస్ ఐ ఆర్ ప్రారంభమైతే నేరుగా డిల్లీ నుంచి బృందం వచ్చి తనిఖీ చేస్తుందని, అప్పుడు ఏమైనా పొరపాటు ఉందని తేలితే తీవ్ర పరిణామాలు ఉంటాయని, అందుకే బి ఎల్ వో లు సమయం తీసుకుని ఇల్లిల్లు తిరిగి మ్యాపింగ్ చేయాలన్నారు.జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మంగళ వారం సాయంత్రం జిల్లాలోని దామరగిద్ద, ధన్వాడ, మరికల్,మక్తల్, మాగనూరు, కృష్ణ,ఉట్కూర్, నర్వ, నారాయణ పేట మండలాల తహసీల్దార్లు, ఏఈఆర్ వోలతో ఎస్ ఐ ఆర్ పై జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తో కలిసి కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ఈ ఆర్ వో లు, బి ఎల్ వో లు, సూపర్ వైజర్లు ఇప్పుడే క్షేత్రస్థాయిలో మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎక్కువ సమయం ఉండదని తెలిపారు. నోటిఫికేషన్ వచ్చాక ఒత్తిడి పడకుండా ఇప్పుడే ఎవరి పరిధిలో వారు పని చేసుకుంటే ఎస్ ఐ ఆర్ చేసే సమయంలో పని చాలా సులువు అవుతుందన్నారు.అయితే తహాసిల్దారులు విధిగా పర్యవేక్షణ చేయాలని, ప్రస్తుతం తహసిల్దార్ కార్యాలయాల్లోనే మ్యాపింగ్ పని కొనసాగుతోందని తర్వాత విస్తరించే అవకాశం ఉందన్నారు. బిఎల్ఓ లకు ఆదేశాలిచ్చి ఇంటింటికి వెళ్లి పరిశీలన చేయించాలన్నారు. మ్యాపింగ్ సమయంలో పొరపాటు జరగకుండా ఓటరు నిజమేనని నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. వలస వెళ్లిన ఓటర్ల వివరాలు కూడా సేకరించాలని, లేదంటే తీసే ఆస్కారం ఉందని, ఆ తర్వాత మళ్ళీ వాళ్లు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందనే విషయాన్ని మరచి పోవద్దు అని ఆమె తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియ లో సిద్ధి పేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాలలో 80 శాతం పూర్తి అయిందని, వారం రోజుల్లో మన జిల్లా కూడా 80 శాతం చేరుకోవాలని కలెక్టర్ తేల్చి చెప్పారు.ఈ సమీక్షలో ఆర్డిఓ రామచంద్రనాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారినిలు జయసుధ, రాణి దేవి, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## పట్టణ ప్రజా సమస్యలు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**తాండూరు, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** పట్టణ ప్రజా సమస్యలు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలోవినతి పత్రం అందజేశారు. మంగళవారం తాండూరు పట్టణంలో మున్సిపల్ చైర్పర్సన్ నీరాజ బాల్ రెడ్డి వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్ కు ప్రజా సంఘాలు సిఐటియు తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి ఎమ్మార్పీఎస్ కెవిపిఎస్ కురువ సంఘము ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ హక్కుల పోరాట సమితి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. తాండూరు పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రతి వార్డు లో త్రాగునీరు విద్యుత్ దీపాలు డ్రైనేజీ మున్సిపల్ పార్కులకు కబ్జాలకు గురైతున్నాయి మున్సిపల్ పార్కులను కాపాడాలని అదేవిధంగా కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పట్టణ పరిశుభ్రత కోసం పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, జనాభా కనుగుణంగా మున్సిపల్ కార్మికులకు పని భారాన్ని తగ్గించి కొత్తవారిని తీసుకోవాలని మున్సిపల్ కార్మికుల చనిపోయిన వారి కుటుంబంలో కొత్తవారిని తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్, తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి తాండూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఎండి సాదిక్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు కే చంద్రయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఉప్పల్ మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు బుగ్గప్ప, ఎమ్మార్పీఎస్ తాండూర్ పట్టణ అధ్యక్షుడు బలరాం, సిహెచ్ రవికుమార్, ఎంహెచ్పిఎస్ తాండూరు మండల నాయకులు ఎండి మగ్దుమ్ వాసే, ఎండీ సమీద్దీన్, సిఐటియు తాండూరు మండల కన్వీనర్ జైపాల్ , మున్సిపల్ కార్మికుల వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, శ్రీకాంత్, వై రాములు, రఘుపతి, ప్రకాష్ ,తానేష్, ఎం ఎల్లప్ప, రాజు, కురువ సంఘం అధ్యక్షులు జై బాలప్ప తదితరులు ఉన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

- మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** ఉప్పల్‌లో మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి మహిళలు అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. మహిళల ఆర్థిక స్వావలంబనతోనే కుటుంబాలు, సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని ఆమె పేర్కొన్నారు. ఉప్పల్‌లోని కేకేఆర్ తోటల్లో లావణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు యంత్ర శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధృవపత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రజిత పరమేశ్వర్ రెడ్డి శిక్షణ పొందిన మహిళలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అదృష్ట చీటి కార్యక్రమంలో ఎంపికైన స్వప్న, సరళ, మహాలక్ష్మి వారికి కుట్టు యంత్రాలను ఆమె అందజేశారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. కుట్టు శిక్షణ వంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పిస్తాయని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని రజిత పరమేశ్వర్ రెడ్డి గుర్తు చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ వంటి కార్యక్రమాలు మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే చిరు వ్యాపారులు, మహిళా పారిశ్రామికవేత్తలకు వడ్డీలేని రుణాలు అందిస్తూ ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లావణ్య, సంధ్య, వాణి, మాధురి, నవనీత, లింగంపల్లి రామకృష్ణ, భూసం రంగనాథ్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, గోరిగే మహేష్, సురేష్, బాలరాజ్, అలుగుల అనిల్, అల్వాల్ భాస్కర్, ప్రేమ్, పూజారి హనుమంతు, మా శెట్టి రాఘవేంద్ర, తుమ్మల రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, మోహన్ నాయక్, ప్రశాంత్ రెడ్డి, బచ్చా రాము, రంగుల శేఖర్, శశికాంత్ రెడ్డి, వంశీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలి

- కర్ల రాజేష్ ఘటనలోని నిందితులను కాపాడుతుంది ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఓయూ రౌండ్ టేబుల్ సమావేశంలో మందకృష్ణ మాదిగ..




**సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** కర్ల రాజేష్ లాకప్ డెత్ మృతికి చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి బాధ్యుడని, అతన్ని తక్షణమే సస్పెండ్ చేయాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. కర్ల రాజేష్ ఘటనపై పోలీసుల అబద్ధాలు – ఎంఆర్పీఎస్ నిజాలు అనే అంశంతో ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలో లోని సెమినార్ హాల్లో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయకుండా కాపాడుతున్నది మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డేనని ఆయన మండిపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కర్ల రాజేష్ ఘటనకు సంబంధించిన పరిణామాలను ఆధారాలతో సహా విద్యార్థి సంఘాల నేతలకు వివరించారు. గత 98 రోజులుగా ఎంఆర్పీఎస్ ఆధారాలను సేకరిస్తూ సమాజం ముందుంచి, పోలీసు ఉన్నతాధికారులు, మానవ హక్కుల కమిషన్, ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నిందితులైన పోలీసులకు శిక్ష పడేలా, రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేలా నిరంతర ఉద్యమం కొనసాగిస్తున్నామని చెప్పారు. కర్ల రాజేష్ ఘటనపై అధికార, ప్రతిపక్ష పార్టీలతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, సంఘాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడిస్తూ భవిష్యత్ కార్యాచరణలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, పీడీఎస్యూతో పాటు వివిధ విద్యార్థి సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# నిందితులను అరెస్టు చేయకుంటే ఆందోళన ఉధృతం

- అంబేద్కర్ విగ్రహం ధ్వంసంపై రోడ్డెక్కిన ప్రజా సంఘాలు
- మోమిన్ పేట్‌లో భారీ ర్యాలీ, మానవహారం



**మోమిన్‌పేట, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. మోమిన్ పేట్ మండలం, అమ్రాది కలాన్ గ్రామంలో గత శనివారం అర్ధరాత్రి అంబేద్కర్ విగ్రహంపై కొందరు దుండగులు దాడి చేసి ధ్వంసం చేసిన ఘటన విధితమే. మూడు రోజులు గడుస్తున్నా ఇంకా నిందితులను గుర్తించడంలో పోలీసులు వహిస్తున్న నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం మోమిన్ పేట్ మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం, జై భీమ్ యూత్ ఇండియా రాష్ట్ర నాయకులు నడిమిదొడ్డి శ్రీనివాస్, బుద్ధ విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు బేగరి నర్సింలు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయడం అంటే రాజ్యాంగం పైన దాడి చేయడమే అవుతుందన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాలపై గౌరవం లేని వ్యక్తులే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడతారని తెలిపారు. ప్రపంచవ్యాప్తమైన అంబేద్కర్ భావజాలాన్ని ఇలాంటి చిల్లర చేష్టల ద్వారా నిలువరించలేరని స్పష్టం చేశారు. ఈ దేశంలో నూటికి 85 శాతంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ, అగ్రకుల మహిళలకు అంబేద్కర్ నిలువెత్తు జీవితం అన్నారు. ఈ వర్గాల సమగ్ర అభివృద్ధికి బాటలు వేసిన అంబేద్కర్ విగ్రహాన్ని చూసి మనువాదులు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా అంబేద్కర్ ఆలోచనను ఆపడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. రానున్న కాలంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు ఏకమై వారి జీవితాలను నిలబెడుతున్న రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం సమిష్టి ఉద్యమాలు చేస్తారని తెలిపారు. సమ సమాజం వల్లనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్న అంబేద్కర్ భావజాలాన్ని సహించలేని ఉన్మాద శక్తులు ఈ సమాజాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. కానీ భారతదేశ బహుజనుల ముందు ఇవి ఏమాత్రం సాగవని హెచ్చరించారు. దేశానికి దిశా నిర్దేశం చేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసిన వారు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు. మూడు రోజులు గడుస్తున్నప్పటికీ ఈ విషయంలో నిందితులను గుర్తించకపోవడం పోలీసుల నిర్లక్ష్యమేనని అన్నారు. ఇప్పటికైనా నిందితులను గుర్తించి 24 గంటలలో అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దీనిని ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమ్రాది కలాన్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎవాన్, ఆనందం, అమోస్, మండలంలోని వివిధ గ్రామాల అంబేద్కర్ యువజన, బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 28 పరీక్షా కేంద్రాలు
- కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షల నిర్వహణకి పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులకు సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ డీ.వి శ్రీనివాసరావు , డీఈఓ విజయ, ఇంటర్మీడియట్ అధికారి మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డిపిఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్స్ లతో కలిసి మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ఈ నెల 25వ తేది నుంచి వచ్చే నెల (మార్చి) 16వ తేదీ వరకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహిస్తారని వివరించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 6309, రెండవ సంవత్సరంలో 6025 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. జిల్లాలోని మొత్తం 28 సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్రాలలో క్లాక్ రూమ్ సౌకర్యం ఉండాలని... ఎట్టి పరిస్థితి లో మొబైల్ ఫోన్ లను లోపలికి తీసుకుపోకుండా పక్కాగా నిఘా పెట్టాలన్నారు. విద్యార్థులు నిర్దేశించిన సమయంలోపు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఈ సారి రాష్ట్ర ప్రభుత్వము



ప్రతిష్టాత్మకంగా హాల్ టిక్కెట్ పైన క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశారని...తద్వారా ఆ కోడ్ ను స్కాన్ చేస్తే సంబంధిత పరీక్ష కేంద్రాల వివరాలను (లోకేషన్) తెలుపుతుందన్నారు. అలాగే పరీక్షల సమయంలో విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురైతే , ఒత్తిడిని తట్టుకొని ప్రశాంతంగా పరీక్షలు వ్రాసేవిధంగా టేలి మానస్ నెం. 14416కి ఫోన్ చేస్తే నిపునులు కౌన్సిలింగ్ ల ఇస్తారన్నారు. అలాగే విద్యార్థులు సమస్యలను నివృత్తి చేసుకోనుటకు కంట్రోల్ రూమ్ నెంః 7671033323, 9603615652కి ఫోన్ చేయవచ్చున్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలు సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అలాగే ముందస్తుగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరీక్ష కేంద్రాల్లోని కల్పించిన వసతులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యార్థులు పరీక్ష కేంద్రంలోనే ఉండాలన్నారు.ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షలు సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా, నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు, అలాగే పరీక్ష కేంద్రాల వద్ద ఉచిత వైద్య శిభిరాలను ఏర్పాటు చేసి, తగినన్ని మందులు నిల్వ పెట్టాలని వైద్య అధికారులకు సూచించారు, అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ సెక్షన్ ఏర్పాటు చేయాలని, అలాగే పరీక్షలు కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులను మూసి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు, వేసవి దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన త్రాగునీరు సమకూర్చి, కేంద్రాల పరసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే జవాబు పత్రాలను పగడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో వ్యవహరించి, పరీక్షలు విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. వివిధ ప్రాంతాలనుండి వచ్చే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక ఆర్టిసి బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆయన ఆదేశించారు. గతం లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించామని...ఈసారి కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని, పరీక్షలను విజయవంతం చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద నిబందనల మేరకు 163 బిఎన్ఎస్ సెక్షన్ ఏర్పాటు తో పాటు ప్రశ్న పత్రాలు పరీక్ష కేంద్రాలకు తీసుకొని వెళ్లె సమయంలో బందొబస్తు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత విద్యాశాఖ, మెడికల్, ఆర్టీసీ, ట్రెజరీ సంబంధిత శాఖ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మర గ్రామ మల్లన్న జాతర ఘటనను ఖండిస్తున్నాం

- ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి
- బహుజన రాజ్యసమితి నాయకుల డిమాండ్



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర మల్లన్న జాతరలో ఆధిపత్య కుల ఆధిపత్యంతో రజక కుటుంబం పై జరిగిన దాడిలో ఒక చిన్నారి మృత్యువాత పడటం దారుణం అని ఈ విషయాన్ని ఖండిస్తున్నామని, దోషులపై వెంటనే చర్యలు చేపట్టాలని మంగళవారం గద్వాల పట్టణంలో విలేకరుల సమావేశంలో బహుజన రాజ్యసమితి నాయకులు డిమాండ్ చేశారు.ఒక చిన్న విషయాన్ని ఆసరా చేసుకొని అక్కడి ఆధిపత్య వర్గాలు, ఆలయ నిర్వాహకులు మూకుమ్మడిగా దాడి చేయడం విడ్డూరం అని, అక్కడి రజకులు గాయపడ్డారనీ, ఆవేదనకు గురి అయ్యారనీ, ఆదిపత్య ప్రభుత్వం స్పందించి బాధితులకు నష్ట పరిహారం చెల్లించి, దాడికి కారకులైన వారి మీద కఠిన శిక్షలు విధించాలనీ,ప్రతి ఆలయంలో కుల వివక్షను అరికట్టడానికి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలనీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలనీ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన రాజ్య సమితి అధ్యక్షులు ఎం. వాల్మికి, కె. వినోద్ కుమార్, డాక్టర్ ప్రేమ్ కుమార్,కోళ్ల హుసేన్, దేవేందర్ పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని మొత్తం 14 పరీక్ష కేంద్రాల్లో ఈనెల 25 నుండి వచ్చేనెల 16 వరకు ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్ష కేంద్రాలలో 8,471 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారని, పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు.పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదనీ,నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగడం నిషేధం అని, పరీక్ష కేంద్రాల నుండి 200 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు ఈనెల 25 నుండి వచ్చేనెల 18 వరకు ప్రతిరోజూ ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, విద్యార్థులు పరీక్ష సమయం కన్నా అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష కేంద్రాల వద్ద మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రతా పరంగా ప్రత్యేక ఎస్కార్ట్ ను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్ల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి లాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామనీ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

# వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దాలి

**కృష్ణ, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** చదువులో వెనుకబడిన విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వారి అభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాధికారి నిజాముద్దీన్ సూచించారు. కృష్ణ మండల కేంద్రంలోని కృష్ణ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆంగ్ల ఉపాధ్యాయుల పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి నిజాముద్దీన్ ఉపాధ్యాయు లను ఉద్దేశించి ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. బోధన ప్రక్రియలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతిలో ఉన్న ప్రతి విద్యార్థి పురోగతిని గమనించి, ముఖ్యంగా వెనుకబడిన వారికి అనుకూలమైన బోధనా విధానాలు, ప్రత్యేక యాక్షన్ ప్లాన్లు అమలు చేయాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థుల



ఫలితాలపై మరింత శ్రద్ధ పెట్టి, సాధన పరీక్షలు, పునరావృత బోధన, వ్యక్తిగత మార్గదర్శనం వంటి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇది విద్యా సంవత్సరపు చివరి సమావేశం కావడంతో, ఉపాధ్యాయులు ఈ సంవత్సరం అమలు చేసిన ఉత్తమ పద్ధతులు గురించి చర్చించారు. విజయవంతమైన బోధనా విధానాలను పరస్పరం పంచుకుని, వాటిని మరింత విస్తృతంగా అమలు చేయాలని నిర్ణయించారు. అనంతరం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్ ఇంగ్లీష్ బోధనలో పాటించాల్సిన మెలకువలు, విద్యార్థుల అర్థవంతమైన అభ్యాసానికి అనువైన పద్ధతులు, ఫలితాల మెరుగుదలకు అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు.తదుపరి ఉపాధ్యాయులు తమ పాఠశాలలలోని విద్యార్థుల విద్యా ప్రగతిపై సమగ్ర ఫీడ్‌బ్యాక్ అందించారు. వెనుకబడిన విద్యార్థుల కోసం రూపొందిం చిన ప్రత్యేక ప్రణాళికలపై చర్చించి, సమిష్టిగా పనిచే యాలని సంకల్పించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు రామ్ గోపాల్, శ్రీనివాస్, నరేందర్, చంద్రశేఖర్, బలరాం రఘు, బాలరాజు, అశోక్, మీరా, ఉమాదేవి, భారతి, నిర్మల, గీత తదితరులు, అలాగే సీఆర్‌పీ అమీన్ రెడ్డి, పాల్గొన్నారు.

## రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఒంటిపూట బడులు నిర్వహించాలి



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** జిల్లాలోనీ ఉర్దూ, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలు గల ప్రభుత్వ పాఠశాలలో అత్యంత పవిత్ర మాసం రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఒంటి పూట బడులు నిర్వహించాల్సిందిగా తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ మెదక్ జిల్లా పక్షాన మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహ్మద్ రియాజుద్దీన్, జిల్లా అధ్యక్షులు మహ్మద్ ఇంతియజుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ యూసుఫ్ అలి, ఈ సందర్భంగా వారు విజయలక్ష్మి తో మాట్లాడుతూ కేవలం ఉర్దూ మీడియం పాఠశాలలే కాకుండా తెలుగు ,ఇంగ్లీష్ , మీడియాలలో ముస్లిం విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. కాబట్టి వేసవికాలం తీవ్రతరం అవుతున్న దృష్ట్యా వారికి కూడా ఒంటిపూట బడులు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా డిఈఓ విజయలక్ష్మి సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- కలెక్టర్ ను కోరిన సర్పంచ్ నవీన్

**శివ్వంపేట, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** శివ్వంపేట మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామా అభివృద్ధి కోసం అవసరమైన నిధులు మంజూరి చేయాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ను సర్పంచ్ మోకాళ్ల నవీన్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డితో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను, పెద్దగొట్టిముక్ల సర్పంచ్ మోకాళ్ల నవీన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలనీ వినతిపత్రం అందజేశారు. పంచాయతీ ఎన్నికలలో ప్రజలు మాపై ఎంతో నమ్మకంతో మమ్ములను నమ్ముకొని గెలిపించారని నవీన్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. గ్రామ ప్రజల నమ్మకాన్ని



నిలబెట్టుకోవడానికి, గ్రామ ప్రజల అవసరాలను తీర్చడానికి గ్రామానికి ప్రత్యేక నిధులు అవసరమని ఆయన కలెక్టర్ ను కోరారు. అయితే మీ గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హామీ ఇచ్చినట్లు నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లాడి ఆంజనేయులు, సాయికుమార్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు వాహనాలకు సరియైన పత్రాలు కలిగి ఉండాలి



**మక్తల్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కచ్ వార్ టోల్‌గేట్ వద్ద మక్తల్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ ఎస్ఐ భాగ్య లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తన వాహనానికి సంబంధించిన సరియైన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికేట్ వంటి పత్రాలు చెల్లుబాటు అయ్యేలా ఉండాలని తెలిపారు. పత్రాలు లేకుండా వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, అధిక వేగం మరియు మొబైల్ ఫోన్ వినియోగం ప్రమాదాలకు కారణమవుతాయని వివరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలు పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరికల్ ఎస్సై-2 రేవతి, పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్ తో మొబైల్ షాప్ దగ్ధం

**పెబ్బేరు, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని నేతాజీ చౌరస్తా సమీపంలో ఉన్న మహేష్ మొబైల్స్ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం మేరకు కొత్తకోట నుంచి ఫైర్ ఇంజన్ సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దుకాణంలో మొబైల్ సంబంధిత సామగ్రి అధికంగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి భారీగా ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో మొబైల్ షాప్ పూర్తిగా దగ్ధమైందని, సుమారు రూ.40 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని యాజమాని మహేష్



తెలిపారు. మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఇతర ప్రజా ప్రతినిధులు పరిశీలించి సానుభూతి తెలిపారు. పెబ్బేరు రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాఘవేంద్రరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామ నిర్వహించారు. ప్రమాదఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ రెడ్డి తెలిపారు.

## పేదోళ్ళకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



**కౌడిపల్లి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రానికి చెందిన కుమ్మరి సుమలతకి 53 వేల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారులకి అందజేసిన మెదక్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తుంది అని ఈ పథకం కోసం కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుంది అన్నారు. అనంతరం వార్డు సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గుప్తా, కౌడిపల్లి గ్రామ ఉపసర్పంచ్ శ్వేతా మల్లికార్జున గౌడ్, వెంకటేశం గుప్తా, రాగుల భూమయ్య, జగన్, వార్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివి
- ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావు

**మెదక్, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** ఇందిరమ్మ రాజ్యంలోని తెలంగాణ ప్రభుత్వానికిఅభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావ్ అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హవెలి ఘనపూర్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీలేదన్నారు. గతంలో ఎన్నడూ లేని విదంగా మెదక్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. ఒకవైపు అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తూనే డెవలప్మెంట్ పై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలన లో రేషన్ కార్డు ఇవ్వలేని దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వంలో నిరంతర ప్రక్రియగా చేశామన్నారు. డ్వాక్రా మహిళలకు కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం ద్వారా డబ్బులు ఆదా చేస్తున్నట్లు తెలిపారు.కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద మెదక్ నియోజకవర్గం లో ఇప్పటివరకు దాదాపు రూ 5కోట్లు అందజేశామన్నారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.దేశంలో ఎక్కడ లేని విదంగా రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. యాంత్రికరణ పథకం ద్వారా రైతులకు సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలు అందజేసినట్లు తెలిపారుఅందజేశామన్నారు.ఒక్కొక్కటిగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఎడి విజయ నిర్మల హవెలి ఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుక, మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి



రాజ్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాధర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు అంజనేయులు గౌడ్, శంకర్ గౌడ్, దాయర రవి, హాఫిజ్, నాగిరెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# సిజేరియన్ ప్రసవాల శాతాన్ని తగ్గించాలి



**మహబూబాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 24(జనం సాక్షి):** సిజేరియన్ ప్రసవాల శాతాన్ని తగ్గించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో సిజేరియన్ ప్రసవాల శాతాన్ని తగ్గించే దిశగా పిసిపియన్‌డిటి చట్టం అమలుపై కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, సర్జన్లు, మెడికల్ ఆఫీసర్లు సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న సిజేరియన్ ప్రసవాల శాతాన్ని, పి సి పిసిపియన్‌డిటి చట్టం అమలు పైన సమీక్షించారు. ముందుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ జిల్లా లోని ప్రైవేట్ ప్రభుత్వ ఆసుపత్రిల లో జరుగుతున్న సి సెక్షన్ ప్రసవాలు, పిసిపియన్‌డిటి చట్టం ప్రకారం తీసుకుంటున్న చర్యల పైన ప్రారంభ ఉపన్యాసం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియన్ శస్త్రచికిత్సలు నిర్వహించాలని, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. గర్భిణీల ఆరోగ్యం, శిశువుల భద్రతను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుని వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, గర్భిణీలకు సరైన కౌన్సెలింగ్ అందించి, వైద్యపరమైన కారణాలు ఉన్నప్పుడే సిజేరియన్ చేయాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు సిజేరియన్ రేటును నియంత్రణలో ఉంచి, పారదర్శకంగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. పిసిపియన్‌డిటి చట్టం ప్రకారం జిల్లా లోని స్కానింగ్ సెంటర్ లను తరుచు గా తనిఖీలు చేయాలని, నిబంధనలు అతిక్రమించిన వారి పైన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా లో ఆడ పిల్లల నిష్పత్తిని పెంచాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ కోఆర్డినేటర్ డాక్టర్ చింత రమేశ్ ఐ యం ఏ అధ్యక్షుడు డాక్టర్ జగదీశ్వర్, తొర్రూరు అధ్యక్షుడు డాక్టర్ రాజేందర్ రెడ్డి సంబంధిత విభాగాల అధికారులు, వైద్యులు పాల్గొన్నారు. జిల్లాలో సురక్షిత మాతృత్వాన్ని ప్రోత్సహించడం, అనవసర సిజేరియన్ శస్త్రచికిత్సలను తగ్గించడం లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# ఇసుక స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, టిజి ఎండిసి, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో ఇసుక అక్రమ రవాణా నియంత్రణ, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా, కొడవటంచ దేవాలయ జాతర ఏర్పాట్లు, రైతులు యూరియా కొరకు యాప్ ద్వారా బుకింగ్ చేయుట తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా విషయంలో ఎవరు రాజీ పడకూడదని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, టిజి ఎండిసి శాఖలతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఇసుక రవాణాను సిసి కెమెరాల ద్వారా నిఘా పెట్టాలని సూచించారు. అక్రమంగా ఇసుక తరలించినట్లయితే తక్షణమే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసి రిమాండ్ చేయాలని స్పష్టంచేశారు.

ఇసుక రవాణాకు నంబర్లు లేని వాహనాలకు అనుమతి లేదని, డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, వేగ నియంత్రణ పాటించాలని, మైనర్లు వాహనాలు నడపకూడదని తెలిపారు. ఇసుక నియోజకవర్గ ప్రజల అవసరాలకే వినియోగించాలని జిల్లా దాటి ఇసుక తరలించరాదని తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా మాత్రమే రవాణా చేయాలని, ఇసుక తవ్వకాల్లో యంత్రాలు వాడకూడదని, మనుషులను వినియోగించాలన్నారు. అక్రమ నిల్వలు గుర్తించిన వెంటనే సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను కూపన్ల విధానంలో సరఫరా చేయాలని సూచించారు. తప్పుడు పత్రాలు సమర్పించినట్లయితే సంబంధిత వారిపై పోలీస్ కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. అదేవిధంగా ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్న కొడవటంచ దేవాలయ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య చర్యలు, తాగునీరు, మరుగుదొడ్లు, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయ అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మండలాల వారీగా ఇందిరమ్మ ఇండ్లకు అవసరమైన ఇసుకపై నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు సమన్వయంతో పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఇసుక కొరకు గృహనిర్మాణ శాఖ ద్వారా నివేదిక ఇవ్వాలని సూచించారు. ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అవసరాలకు ఇసుక అందేలా చూడాలని, బయటకు తరలింపును పూర్తిగా అరికట్టాలని అన్నారు. పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్ల జాబితాను సిద్ధం చేసి అదనపు ఇసుక సరఫరాను నియంత్రించాలని సూచించారు. అక్రమంగా తరలిస్తే తక్షణమే కేసు నమోదు చేసి ట్రాక్టర్ సీజ్ చేసి రిమాండ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, మైనింగ్ ఏడి జయరాజ్, టీజీఎండిసి పిఓ రామకృష్ణ,నియోజకవర్గ పరిధిలోని మండలాల తహసిల్దారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# కేఎంసీ కోసం ప్రవాసుల ఔదార్యం

- మౌలిక సదుపాయాల కోసం రూ.10 కోట్లు ప్రకటన
- మీడియ ముఖంగా అభినందించిన ఎమ్మెల్యే నాయిని..



హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 24 (జనం సాక్షి) : స్వదేశం పట్ల మమకారం, పుట్టిన పురిటి గడ్డ రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో ఎన్ఆర్ఐల బృందం ముందుకు వచ్చిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గతంలో అమెరికాలో పర్యటించిన క్రమంలో అమెరికాలో స్థిరపడిన ఎన్నారై లను ప్రత్యేకంగా కలసి వరంగల్ వాసులుగా నగరానికి మీవంతు సహకారం అందించాలని కోరారు. ఈ మేరకు డాక్టర్ సుజీత్ కుమార్ నేతృత్వంలోని సుమారు 200 మంది ఎన్ఆర్ఐలు కలిసి కాకతీయ మెడికల్ కాలేజ్ (కేఎంసీ) మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 10 కోట్ల విరాళం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆధునిక వైద్య పరికరాలు, అదనపు వార్డులు, రోగుల కోసం అవసరమైన సౌకర్యాలు, విద్యార్థులకు శిక్షణ వనరులు వంటి అంశాలపై ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో వేలాది మంది ప్రజలు కేఎంసీ, ఎంజీఎం ఆసుపత్రులపై ఆధారపడుతున్నారని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇవే ప్రధాన వైద్య కేంద్రాలని, ఈ విరాళం ద్వారా అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి పరికరాల ఏర్పాటు, అత్యవసర వైద్య విభాగాల బలోపేతం, శస్త్రచికిత్స సదుపాయాల విస్తరణకు దోహదం కానుంది. ఇటీవలి కాలంలో నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజ్, తాగునీటి సదుపాయాలు, విద్యాసంస్థల అభివృద్ధి వంటి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్ఆర్ఐల సేవాభావం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. మన వరంగల్ నుంచి విద్యను అభ్యసించే విదేశాల్లో స్థిరపడిన అందరూ వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి,ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# చేతికొచ్చిన పంట నేలపాలు

- అకాల వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న పంట
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల డిమాండ్





**లక్ష్మణచాంద, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** చేతికొచ్చిన పంట ఇంకో ఇరవై రోజుల్లో కోసే సమయానికి మొక్కజొన్న పంట మొత్తం అకాల వర్షానికి నేలపాలయ్యింది. లక్ష్మణ చందా మండలంలోని వివిధ గ్రామాలలో మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. ఇప్పుడే పాలు పోసుకుంటున్న సమయంలో పంట మొత్తం పూర్తిగా అకాల వర్షానికి మరియు ఈదురుగాలులతో పంట మొత్తం నష్టం పాలయింది. మండలంలోని కనకాపూర్, రాచాపూర్, పోట్టపల్లి కె, పిచర, లక్ష్మణ చందా, ధర్మారం, మునిపెల్లి, పారుపల్లి, మల్లాపూర్, మాచాపూర్ గ్రామాలలో మొక్కజొన్న పంట ఎక్కువగా నష్టం జరిగినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారి వసంతరావు పంట చేను లో క్షేత్రస్థాయిలో ప్రాథమికంగా పరిశీలించారు. అనంతరం నష్టపోయిన రైతులతో మాట్లాడారు.

### రైతులను ఆదుకోవాలి



నేను రెండెకరాల వరకు మొక్కజొన్న పంట వేశాను. సోమవారం రాత్రి అకాల వర్షం కురవడంతో దాదాపు ఒక ఎకరం వరకు పంట పూర్తిగా నష్టం జరిగింది. ప్రభుత్వం దయతలచి మా రైతులను ఆదుకోవాలి

– చిట్యాల మధుకృష్ణ, రాచాపూర్ రైతు

### రెండెకరాల్లో పంట నష్టం



నేను రెండున్నర ఎకరాల వరకు మొక్క జొన్న పంట వేశాను. వర్షం, ఈదురు గాలులతో దాదాపు రెండెకరాల వరకు పంట నష్టం జరిగింది. ఈ అతివృష్టి, అనావృష్టి కారణంతో కూడా రైతులు చాలా నష్టపోతున్నారు. దయచేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నాను.

– మూగ రాకేష్, పీచర రైతు

### 1100 ఎకరాల్లో పంట నష్టం



లక్ష్మణ చందా మండలంలో దాదాపు ప్రాథమికంగా అంచనా ప్రకారం మొక్కజొన్న పంటను ఎక్కువ గా రైతులు వేశారు. అందులో దాదాపుగా 3850 ఎకరాలు మొక్కజొన్న పంటను రైతులు వేశారు. లక్ష్మణ చందా మండలంలో 773 మంది రైతులు, 1100 ఎకరాల నష్టం మన మండలంలో జరిగింది. తదుపరి ప్రభుత్వ ఆదేశానుసారం రైతు వారిగా సర్వే చేయబడుతుంది. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని కోరుతున్నాను.

– వసంతరావు, లక్ష్మణ చందా వ్యవసాయ విస్తరణ అధికారి



# కేటీఆర్‌కు ఘన స్వాగతం

**నెరడిగొండ ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం రోజున మండల కేంద్రం సమీపంలోని టోల్ ప్లాజా వద్ద చేరుకోగానే వారిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకులు కార్యకర్తలతో అక్కడికి చేరుకుని ఘనస్వాగతం పలికారు. అక్కడ కార్యకర్తలను కలుసుకున్నారు. ఎమ్మెల్యే నివాసంలో తేనేటి విందులో పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ని కలవనున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు.

# లింగగిరిలో చోరీ..!

- బంగారం అపహరణ



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** మండలంలోని లింగగిరి గ్రామంలో చోరీ జరిగిన సంఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన పులి కమలమ్మ రోజువారి మాదిరిగానే సోమవారం రాత్రి ఆహారం తిని హాల్ లో పడుకుంది. గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి వేళలో హాల్ పక్కన ఉన్న గదిలోకి చొరబడి బీరువాలోని తులం నర నక్లిస్, పావులెత్తు వంక ఉంగరం సుమారు రూ. 2 లక్షల విలువ చేసే బంగారాన్ని అపహరించుకు పోయారు. అలాగే బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడవేశారు. మంగళవారం ఉదయం వృద్ధురాలు లేచి చూసుకునేసరికి దొంగతనం జరిగినట్లుగా గుర్తించింది. వెంటనే తన కుమారుడు పులి రమేష్‌కు తెలిపింది. ఈ మేరకు తన కుమారుడు రమేష్ చెన్నారావుపేట మంగళవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

# చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన యువకుడి అరెస్టు

- 4 తులాల బంగారం స్వాధీనం
- నెక్కొండ సిఐ శ్రీనివాస్



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 24 ( జనం సాక్షి):** చైన్ స్నాచింగ్ కు పాల్పడిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు నెక్కొండ సిఐ శ్రీనివాస్, చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డిలు మంగళవారం తెలిపారు. ఈనెల 12వ తేదీన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం రాములు తండాలోని చిర్రకుంట తండాకు చెందిన బానోతు ఈరు అనే యువకుడు తన బాబాయి బానోతు శ్రీనివాస్ ను నెక్కొండ రైల్వే స్టేషన్లో దింపాడు. చెన్నారావుపేట మండలంలోని కందిగడ్డ తండాకు చెందిన అంగన్వాడీ టీచర్ గుగులోతు సుజాతను నెక్కొండ నుండి గూడూరుకు వెళ్లే రహదారిలో నెక్కొండ క్రాస్ రోడ్డు వద్ద తన ద్విచక్ర వాహనం పై లిఫ్ట్ ఎక్కించుకొని కందిగడ్డ తండా వద్ద దించుతాడు. ఆమె నడుచుకుంటూ వెళుతుండగా వెనకాల నడుచుకుంటూ వెళ్లి ఆమెపై దాడి చేసి ఆమె మెడలో ఉన్న 4 తులాల బంగారాన్ని అపహరించుకుపోయాడు. మంగళవారం తిమ్మరాయిని పహాడ్ గ్రామ క్రాస్ రోడ్డు వద్ద చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి, సిసిఎస్ పోలీసు వారి నమ్మదగిన సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తుండగా బానోతు ఈరు అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా అతని వద్ద 4 తులాల బంగారం లభ్యమైనట్లు తెలిపారు. బంగారాన్ని, తన ద్విచక్ర వాహనాన్ని, సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం అతన్ని అరెస్టు చేసి మహబూబాబాద్ జైలుకు రిమాండ్ కు తరలించినట్లు వారు తెలిపారు.

# అక్రమ కేసులతో కాంగ్రెస్ పైశాచిక ఆనందం

- బాల్క సుమన్‌తో కేటీఆర్ ములాఖత్



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి) :** రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులపై రేవంత్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతుందని కేటీఆర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న బీఆర్ఎస్ మాజీ ఎంపీ బాల్క సుమన్ ను మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. అంతకుముందు కేటీఆర్ రాక సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో ఎన్ని అరాచకాలు చేసినా కాంగ్రెస్ పార్టీకి, భారతీయ జనతా పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారు. మా పార్టీ అభ్యర్థులను బెదిరించడం, భయపెట్టడం, దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ చేసింది. ఇదే కాకుండా ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేసే విధంగా అనేక మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన అరాచకాలను, దుర్మార్గాలను మొత్తం రాష్ట్ర ప్రజలు గ్రహిస్తున్నారని అన్నారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కు ప్రజలే గట్టి బుద్ధి చెప్తారని తెలిపారు. కేటీఆర్ వెంట ఇన్చార్జి మాజీ మంత్రి జోగు రామన్న. బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్.ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే,గంగుల కమలాకర్, ఎమ్మెల్యే,సంజయ్ కల్వకుంట్ల ఎమ్మెల్యే,కె.పి. వివేకానంద గౌడ్, ఎమ్మెల్య, గ్యాదరి కిషోర్ పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతంతో ఇంట్లో వస్తువులు దగ్ధం



**పాలకుర్తి, ఫిబ్రవరి 24 (జనం సాక్షి)** ప్రమాదవ శాత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇంట్లో వస్తువులు దగ్ధమైన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సినిమా టాకీస్ వెళ్లే మార్గంలో దుస్స శివ (మెకానిక్) దుస్సా లక్ష్మి, నివసిస్తున్న ఇంటిలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇంటిలో ఉన్న సామాన్లు, స్థానికంగా మెకానిక్ పని చేస్తున్న శివ ఆటోమొబైల్స్ కి సంబంధించి స్పేర్ పార్ట్స్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక వార్డు సభ్యుడు కామారపు సునీల్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని బాధితులకు మనోధైర్యాన్ని చెప్పారు.

# తునికాకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలి

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్



**మహా ముత్తారం ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** తునికాకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి తునికాకు శాఖకు సంబంధించిన పనులు వెంటనే ప్రారంభించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ వరి పంట తర్వాత పోనికాకు రెండవ అతిపెద్ద పంటగా ఉందని అట్లాంటిది ఫిబ్రవరి నెల పూర్తి కావస్తున్న టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి కొమ్మ కొట్టే పనులు పూర్తి చేయకపోవడం చూస్తుంటే పేదలకు ఉపాధి కల్పించడంలో ఈ ప్రభుత్వం కూడా నిర్లక్ష్య వైఖరి కనపడుతుందని వారు విమర్శించారు. ఇప్పటివరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు డివిజన్లో 30 యూనిట్లుకు గాను 188 కల్లాలు ఉండగా అందులో ఇప్పటివరకు ఐదు యూనిట్లు 34కల్లాలకు మాత్రమే టెండర్లు అయ్యాయని, ఇంకా 25 యూనిట్లు ఎక్కువగాను 150 కల్లాలు సేల్ కావాల్సి ఉందని ఈనెల చివరి వరకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోతే ప్రభుత్వమే తునికకు సేకరణకు సంబంధించిన పనులు ప్రారంభించాలని, అదేవిధంగా కట్టకు పది రూపాయలు నిర్ణయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, లేనియెడల మార్చి ఫస్ట్ నుండి ఆందోళన పోరాటాలకు పూనుకుంటామని హెచ్చరించారు.

# ప్లకార్డులతో రెండోరోజు సీపీఎస్ ఉద్యోగుల నిరసన

- డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్



**గూడూరు, ఫిబ్రవరి24 (జనంసాక్షి):** ఉపాధ్యాయుల డిఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి మంచోజు మనోహర్ తెలిపారు. టిఎస్ సీపిఎస్ఈయు రాష్ట్ర శాఖ పిలుపుమేరకు, మంగళవారం సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారనికై రెండో రోజు గూడూరు మండలంలోని జడ్పీహెచ్ఎస్ మచ్చర్ల, తీగలవేణి,బాయ్స్ కాంప్లెక్స్ పరిధిలో జరిగిన సమావేశంలో ఉద్యోగులు ప్లకార్డులు ధరించి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా మంచోజు మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలను సకాలంలో చెల్లించకుండా వాయిదాల సంఖ్యను 60కి పెంచడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, సుమారు 1200 కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడం వల్ల ఉద్యోగ,ఉపాధ్యాయ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం ప్రతి నెలా విడుదల చేసే 700 కోట్ల నిధులలో ఈ నెల తప్పనిసరిగా సీపీఎస్ బకాయిల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణలో పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) అమలు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చర్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి. మంగిలాల్,తీగలవేణి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎస్.ఏ. ఫరూక్, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎస్. సత్యనారాయణ, యూనియన్ నాయకులు తొగరు కమలాకర్ రెడ్డి,ఎస్. సురేష్, మనుగొండ రమేష్, ఇస్లావత్ చంద,నీలం రమేష్, నన్నపు శ్రీధర్,బొమ్మినేని రేణుక,వసంత,పి. సాంబయ్య,ధర్మ,ఈమామ్ పాషా,సీపీఎస్ ఉపాధ్యాయులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

# పోరెడ్డిగూడెంలో ప్రకృతి వనం ధ్వంసం

- పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యమా, ప్రజా ప్రతినిధుల అండదండలా..

**మాడుగులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** ప్రభుత్వం పల్లెల్లో పచ్చదనం కోసం కోట్లు ఖర్చు చేస్తుంటే, క్షేత్రస్థాయిలో ఉన్న కొందరు అధికారులు, ప్రజా ప్రతినిధులు మాత్రం ఆ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం పోరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న పల్లె ప్రకృతి వనం ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యానికి, స్థానిక నాయకుల స్వార్థానికి బలైపోయింది ఏపుగా పెరిగిన చెట్లను అడ్డగోలుగా నరికివేయడం చూస్తుంటే, అసలు అక్కడ చట్టం ఉందా లేదా అన్న అనుమానం కలుగుతోంది.

### ప్రశ్నార్థకమైన అధికారుల తీరు

గ్రామ పంచాయతీ కార్యాలయం కళ్లెదుటే ఉన్న ప్రకృతి వనంలో చెట్లు నరికివేతకు గురవుతుంటే పంచాయతీ సెక్రెటరీ ఏం చేస్తున్నారు తన బాధ్యతను గాలికి వదిలేసి, కళ్లు మూసుకుని కూర్చున్నారా లేక పై అధికారులకు రిపోర్ట్ చేయడంలో భయపడుతున్నారా నిబంధనల ప్రకారం చెట్లను కాపాడాల్సిన అధికారి, అవి నరికివేతకు గురవుతున్నా మౌనంగా ఉండటం



వెనుక ఆంతర్యం ఏమిటి.

### సర్పంచ్ అండదండలు ఎవరికి

గ్రామ ప్రథమ పౌరుడిగా గ్రామాన్ని పచ్చదనంతో నింపాల్సిన సర్పంచ్, ఈ నరికివేతను ఎందుకు అడ్డుకోలేకపోయారు స్థానిక నాయకుల అండదండలు లేకుండానే ఇంత సాహసం జరుగుతుందా గ్రామస్తుల ఆరోపణల ప్రకారం, కొందరు వ్యక్తుల ప్రయోజనాల కోసమే పచ్చని వనాన్ని బలి ఇచ్చారని తెలుస్తోంది పచ్చదనం పెంచాల్సిన వారే గొడ్డలి పట్టేవారికి సహకరించడం సిగ్గుచేటు.

అనుమతి ఎవరిచ్చారు అటవీ శాఖ లేదా జిల్లా అధికారుల అనుమతి లేకుండా చెట్లు నరకడం వాల్టా చట్టం ప్రకారం నేరం మరి ఇక్కడ అనుమతి పత్రాలు ఎక్కడ బాధ్యత ఎవరిది రేపు అధికారులు తనిఖీకి వస్తే చెట్లు మాయమైన దానికి ఎవరు సమాధానం చెప్తారు సెక్రెటరీనా లేక సర్పంచా నిధుల దుర్వినియోగం మొక్కలు నాటడానికి, వాటిని పెంచడానికి ఖర్చు చేసిన ప్రజల సొమ్ము ఏమైపోయినట్లు.

### ప్రజల డిమాండ్

పోరెడ్డిగూడెంలో జరిగిన ఈ దారుణానికి బాధ్యులైన పంచాయతీ కార్యదర్శిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ వ్యవహారంలో సర్పంచ్ పాత్రపై విచారణ జరపాలని జిల్లా కలెక్టర్ గాని మండల అధికారులను గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు నిర్లక్ష్యం వహించిన వారిని వదిలిపెడితే, భవిష్యత్తులో ఒక్క చెట్టు కూడా మిగలదని వారు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ సెక్రెటరీ వివరణ కోరగా చెట్లు ఇప్పుడు నరికినవి కాదు గతంలో నరికినవి ఇప్పుడు వేర్లు మాత్రమే తీశామని వివరణ ఇచ్చారు.

## రైతులను నిండా ముంచిన అకాల వర్షం

- రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్న అకాల వర్షాలు



**మధిర, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** మండలంలో సోమవారం రాత్రి భారీ ఎత్తున వచ్చిన గాలిదుమారంతో కూడిన అకాల వర్షం రైతులను నిలువునా ముంచింది. మామిడి,మొక్కజొన్న రైతులను కోలుకోకుండా చేసింది.పలు గ్రామాల్లో వందల ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది.గ్రామాల్లో ఈసారి అధిక మొత్తంలో సాగు చేసిన మొక్కజొన్న మరో నెలలో చేతికి రానున్న తరుణంలో అకాల వర్షం రైతులను పూర్తిగా నష్ట పరిచింది.అసలే గతంలో తీవ్ర వర్షాలతో పత్తి పంట పూర్తిగా దెబ్బతినడంతో మొక్కజొన్న పంట మంచి దిగుబడి సాధించి ఆ కష్టాలు తీరుస్తుందని ఇప్పటివరకు ఆనందపడ్డ రైతుల ఆశలు అడియాశలయ్యాయి. అదేవిధంగా మిర్చి రైతులకు కూడా ఈ అకాల వర్షానికి నష్టపోయారు. కళ్ళల్లో ఆరబోసిన మిర్చి అకాల వర్షానికి తడిసిపోవడంతో రైతుల లబోదిబో అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. దిక్కుతోచనిస్థితిలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన సదస్సు



**నర్సాపూర్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** నర్సాపూర్ ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ సంస్థల అధికరణ పథకంపై అవగాహన సమావేశం మండల సమైక్య నర్సాపూర్ నందు పిఎమ్ఎఫ్ మీ యూనిట్ల పైన లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది మంగళవారం ఈ సమావేశంలో లబ్ధిదారులు గుర్తింపు నర్సాపూర్ చిలిపిచేడ్ వెల్దుర్తి శివ్వంపేట కౌడిపల్లి మండలాల ఏపీఎంలు సీసీలు వివో ఏలు పాల్గొనడం జరిగింది డిస్టిక్ లెవెల్ కోఆర్డినేటర్ అమర్ సింగ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పైన అవగాహన కల్పించడం జరిగింది అర్హత గల బెనిఫిషన్ గుర్తించి రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఏపీఎం సంగమేశ్వర్ చిలిపిచేడ్ ఎపిఎం గౌరీ శంకర్ వెల్దుర్తి ఏపీఎం సుభాష్ గౌడ్ శివంపేట ఏపిఎం పెంట గౌడ్ కౌడిపల్లి ఏపీఎం సంగీత ఆయా మండలాల సీసీలు వివోఏలు తదితరులు పాల్గొన్నారు

## మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు సిద్ధం

- గడువు లోగా పన్ను చెల్లించకపోతే కఠిన చర్యలు
- హాలియా పురపాలక సంఘం హెచ్చరిక

**హాలియా, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** హాలియా పురపాలక సంఘం పరిధిలోని అన్ని ఆస్తి పన్ను చెల్లింపుదారులు 2025--2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను, నీటి పన్ను, వాణిజ్య అనుమతి రుసుములను గడువులోపు చెల్లించాలని పురపాలక సంఘం కమిషనర్ ఏ.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో ఉన్న మొండి బకాయిదారులపై ఎరుపు నోటీసులు సిద్ధం చేసినట్లు, అవి త్వరలో జారీ చేయనున్నట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న తరువాత కూడా బకాయిలు చెల్లించని పక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్తులను స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అలాగే, నీటి పన్ను బకాయిలు ఉన్నవారి నీటి కనెక్షన్లు తొలగించబడతాయని స్పష్టం చేశారు. వసూళ్లను వేగవంతం చేయడానికి బిల్లు సేకరణ సిబ్బంది, నీటి సరఫరా సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇంటింటికి వెళ్లి వసూళ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. పన్ను చెల్లింపుదారులు తమ బకాయిలను నేరుగా బిల్లు సేకరణ



సిబ్బందికి లేదా పురపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా, డిజిటల్ చెల్లింపు విధానాల ద్వారా కూడా పన్నులు చెల్లించే సౌకర్యం కల్పించబడినట్లు తెలిపారు. రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, పారిశుధ్య కార్యక్రమాలు వంటి అభివృద్ధి పనులు సమర్థవంతంగా కొనసాగాలంటే పన్నుల వసూళ్లు అత్యంత కీలకమని, అందువల్ల ప్రతి ఒక్కరూ తమ బకాయిలను తక్షణమే చెల్లించి హాలియా పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. బకాయిలు కొనసాగిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

- ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ చరమందరాజు



**హుజూర్ నగర్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నేడు అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశాల మేరకు హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని లైసెన్స్ డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ బాబు తెలిపారు. మంగళవారం టౌన్ హాల్ లో కంటి వైద్యశిబిరం ఏర్పాట్లను కోదాడ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ చరమందరాజు లు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సిమెంట్ పరిశ్రమల ట్రాన్స్ పోర్ట్, లారీ అసోసియేషన్, ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్, క్యాబ్ డ్రైవర్లు కు ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన సీనియర్ కంటి వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమగు వారికి ఉచితంగా మందులు, కళ్ళ అద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



**పాపన్నపేట, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** బుధవారం నుండి జరగబోయే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరిండెంట్ సతీష్ తెలిపారు. ఈఏడాది ప్రథమ సంవత్సరంలో 224,ద్వితీయ సంవత్సరంలో 146 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం కళాశాలలో సిబ్బంది సమావేశమై చర్చించి,పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేశారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

**ఉప్పల్, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** ఉప్పల్‌లో మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి మహిళలు అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. మహిళల ఆర్థిక స్వావలంబనతోనే కుటుంబాలు, సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని ఆమె పేర్కొన్నారు. ఉప్పల్‌లోని కేకేఆర్ తోటల్లో లావణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు యంత్ర శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధృవపత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రజిత పరమేశ్వర్ రెడ్డి శిక్షణ పొందిన మహిళలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అదృష్ట చీటి కార్యక్రమంలో ఎంపికైన స్వప్న, సరళ, మహాలక్ష్మి వారికి కుట్టు యంత్రాలను ఆమె అందజేశారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. కుట్టు శిక్షణ వంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పిస్తాయని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని రజిత పరమేశ్వర్ రెడ్డి గుర్తు చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ వంటి కార్యక్రమాలు మహిళలకు ఎంతో



ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే చిరు వ్యాపారులు, మహిళా పారిశ్రామికవేత్తలకు వడ్డీలేని రుణాలు అందిస్తూ ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లావణ్య, సంధ్య, వాణి, మాధురి, నవనీత, లింగంపల్లి రామకృష్ణ, భూసం రంగనాథ్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, గోరిగే మహేష్, సురేష్, బాలరాజ్, అలుగుల అనిల్, అల్వాల్ భాస్కర్, ప్రేమ్, పూజారి హనుమంతు, మా శెట్టి రాఘవేంద్ర, తుమ్మల రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, మోహన్ నాయక్, ప్రశాంత్ రెడ్డి, బచ్చా రాము, రంగుల శేఖర్, శశికాంత్ రెడ్డి, వంశీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఇంటర్ పరీక్షలు



**చంద్రుగొండ, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :** నేటి నుండి ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సర పరీక్షలు చంద్రగొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించనున్నట్లు డిపార్ట్మెంట్ ఆఫీసర్ బి శ్రీనివాసరావు కేజీబీవీ స్పెషలాఫీసర్ కవితలు తెలియజేశారు. మంగళవారం పరీక్ష కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంచినీటి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి నుండి మార్చి 16 వరకు ప్రథమ ద్వితీయ ఇంటర్ పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి గాను 278 మంది ద్వితీయ సంవత్సరానికి గాను 227 మంది పరీక్షలకు హాజరవునున్నారు. ఈ పరీక్షా కేంద్రంలో చంద్రుగొండ కేజీబీవీ జూలూరుపాడు కేజీబీవీ అన్నపురెడ్డిపల్లి రెసిడెన్షియల్ బాయ్స్ ఆశ్రమ బాలికల పాఠశాల అన్నపురెడ్డిపల్లి కస్తూర్బా గాంధీ అన్నపురెడ్డిపల్లి విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలియజేశారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు

**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** ఇంటర్ వార్షిక పరీక్షలు సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణలో భాగంగా సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు.నేటి నుంచి వచ్చే నెల 18 వరకు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, విద్యార్థులు పరీక్ష



సమయం కన్నా అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రతా పరంగా ప్రత్యేక ఎస్కార్ట్ ను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్ల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## పసికందు మృతిపై రజక సంఘం కొవ్వొత్తుల ర్యాలీ




**చేర్యాల, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మర గ్రామంలో జాతర సందర్భంగా జరిగిన పసికందు మృతిని నిరసిస్తూ చేర్యాల పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రజక సంఘం నాయకులు, మహిళలు కొవ్వొత్తులు పట్టుకుని కుల వివక్షత, అణగారిన వర్గాలపై దాడులను నిరసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పసికందు బేబి మౌనిక కుల మౌఢ్యానికి బలి కావటం విచారకరమన్నారు. ఘటన జరిగిన వెంటనే బాధితులకు అండగా ఉండాల్సిన అధికార వ్యవస్థ దాడి చేసిన అగ్ర కులస్తులకు వత్తాసు పలకడం విచారకరమన్నారు. బాలిక మృతి కేసులో నిందుతులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# విద్యార్థుల కోసం 'టెలిమానస్' సేవలు

**చండూరు, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** పరీక్షల కాలం వచ్చేసింది. విద్యార్థుల్లో ఒకవైపు సాధించాలనే ఉత్సాహం, మరోవైపు తెలియని ఆందోళన కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యా మరియు వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో నేటి (ఫిబ్రవరి 25) నుంచి ఇంటర్మీడియట్, మార్చి 14 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.జిల్లా యంత్రాంగం పరీక్షల నిర్వహణకు అన్ని పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇంటర్మీడియట్ ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 45 కేంద్రాల్లో సుమారు 27,018 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.పదో తరగతి మార్చి 14 నుండి ఏప్రిల్ 13 వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి పరీక్షకు మధ్య 4 రోజుల విరామం ఉండేలా షెడ్యూల్ రూపొందించడం విశేషం.ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈసారి



'నిమిషం నిబంధన' లేదు. విద్యార్థులు కంగారుపడకుండా, రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు కోరారు.పరీక్షల సమయంలో భయం వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడానికి నిపుణులు మెదడు చురుగ్గా పనిచేయాలంటే కనీసం 6-7 గంటల నిద్ర అవసరం. ఎక్కువ సమయం మేల్కొని చదివితేనే మార్కులు వస్తాయనుకోవడం పొరపాటు. పాఠాలను బట్టీ పట్టకుండా, అంశాలను అర్థం చేసుకుని చదవాలి. పరీక్షలు పూర్తయ్యే వరకు స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా, టీవీలకు దూరంగా ఉండటం ఉత్తమం. ఇంటి భోజనం,బలవర్ధకమైన ఆహారం మితంగా తీసుకోవాలి. తల్లిదండ్రుల పాత్ర కీలకం కేవలం విద్యార్థులకే కాదు, ఇది తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కూడా పరీక్షా సమయమే. పిల్లలపై ర్యాంకుల కోసం ఒత్తిడి చేయవద్దని, ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని నిపుణులు కోరుతున్నారు. చదువు మధ్యలో కాసేపు విశ్రాంతి తీసుకునేలా ప్రోత్సహించాలి. ముఖ్యంగా హాస్టళ్లలో ఉండే పిల్లలకు ఫోన్ ద్వారా మానసిక ధైర్యం అందించాలి.పరీక్షల భయంతో తీవ్ర ఆందోళన లేదా మానసిక ఒత్తిడికి లోనయ్యే విద్యార్థుల కోసం ప్రభుత్వం 24 గంటల ఉచిత కౌన్సెలింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. టోల్ ఫ్రీ నంబర్లు: 14416 లేదా 1800 891 4416 ఈ నంబర్లకు ఎప్పుడైనా ఫోన్ చేసి నిపుణుల సలహాలు పొందవచ్చు.




## గేమింగ్ లవర్స్ కోసం ఐక్యూ కొత్త ఫోన్..

**న్యూఢిల్లీ:**గేమింగ్ లవర్స్ ఎక్కువగా ఇష్టపడే ఐకూ బ్రాండ్ నుంచి మరో కొత్త స్మార్ట్‌ఫోన్ లాంచ్ అయ్యింది. ఐకూ 15 సిరీస్‌లో ఐకూ 15ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. స్నాప్‌డ్రాగన్ 8 జన్ 5 ప్రాసెసర్, 7,600 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీతో ఈ ఫోన్‌ను తీసుకురావడం గమనార్హం. ఫ్లాగ్‌షిప్ ఫీచర్లతో తీసుకొచ్చిన ఈ ఫోన్ ధర, ఇతర వివరాలు ఇప్పుడు చూద్దాం..ఐకూ 15ఆర్ ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆరిజిన్ ఓఎస్ 6తో పనిచేస్తుంది. దీనికి నాలుగేళ్ల ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. 6.59 అంగుళాల 1.5ఐ అమోలెడ్ డిస్‌ప్లే, 120ఊళి రిఫ్రెష్ రేటుతో వస్తోంది. 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. హెచ్‌డీఆర్ 10 సర్టిఫికేషన్, గేమింగ్ సమయంలో 144 ఊళి రిఫ్రెష్ రేటుతో ఈ ఫోన్ పనిచేస్తుంది.ఇందులో స్నాప్‌డ్రాగన్ జన్ ఎస్5 ప్రాసెసర్ అమర్చారు. వెనుకవైపు 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ 700వీ ప్రధాన కెమెరా ఇచ్చారు. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఉంది. ముందు వైపు 32 ఎంపీ కెమెరా ఇచ్చారు. వైఫై 7, బ్లూటూత్ 6, టైప్‌-సీ పోర్ట్, ఐపీ68, ఐపీ 69 రేటింగ్‌తో వస్తోంది. ఇందులో 7,600 ఎంఏహెచ్ బ్యాటరీ 100చి ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది.తిఖీూా 15ఖీ జూతీతిఇవ: ధర విషయానికొస్తే.. ఐకూ 15ఆర్ మూడు స్టోరేజీ వేరియంట్లలో లభ్యమవుతుంది. దీని ధర రూ.50 వేల పైనే ఉంటుందని ఊహించినప్పటికీ.. అంతకంటే తక్కువ ధరకే తీసుకురావడం గమనార్హం. 8జీబీ+ 256జీబీ వేరియంట్ ధర రూ.44,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీ+ 256జీబీ వేరియంట్ రూ.47,999, 12జీబీ+ 512జీబీ వేరియంట్ రూ.52,999గా నిర్ణయించారు. డార్క్ నైట్, ట్రయంఫ్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. అమెజాన్, ఐకూ ఇండియా, వివో రిటైల్ స్టోర్లలో నేటి నుంచి బుకింగ్స్ స్వీకరిస్తున్నారు. మార్చి 3 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్‌కార్డ్/డెబిట్ కార్డు కొనుగోళ్లపై రూ.4వేలు డిస్కౌంట్ పొందొచ్చు. రూ.1899 విలువ చేసే ఐకూ/వివో టీడబ్ల్యూఎస్‌ను ఉచితంగా అందిస్తున్నారు.

## ఎగుమతిదార్లకు షాక్

దిల్లీ: ఎగుమతిదార్లకు మద్దతునిచ్చే పథకం కింద పన్ను ప్రయోజనాలను కేంద్రం సగానికి తగ్గించింది. అయిదేళ్ల కిందట తీసుకొచ్చిన ద రెమిషన్ ఆఫ్ డ్యూటీస్ అండ్ టాక్సెస్ ఆన్ ఎక్స్‌పోర్టెడ్ ప్రోడక్ట్స్(ఆర్‌ఓడీటీఈపీ) పథకం కింద వస్తువుల తయారీ, పంపిణీ ప్రక్రియలో ఎగుమతిదార్లు కట్టే సుంకాలను రిఫండ్ చేస్తున్నారు. ఈ పథకం కింద వర్తించే రేట్లను తక్షణం అమల్లోకి వచ్చేలా 50 శాతానికి పరిమితం చేస్తున్నట్లు సోమవారం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ ప్రకటించింది. ఈ పథకం కింద రిఫండ్‌లు 0.3–3.9 శాతంగా ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, గిరాకీ మందగమనం వంటి సవాళ్ల నడుమ ప్రకటించిన ఈ రేట్ల కోతను పునః పరిశీలించాలని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య(ఫియో) ప్రెసిడెంట్ ఎస్.సి. రల్హాన్ పేర్కొన్నారు. జనవరిలో దేశ ఎగుమతులు 0.61 శాతమే పెరిగి 36.56 బి. డాలర్లు(దాదాపు రూ.3.26 లక్షల కోట్లు)గా నమోదవడంతో వాణిజ్య లోటు మూడు నెలల గరిష్ఠమైన 34.68 బి. డాలర్లకు చేరింది.

# భారీ నష్టాల్లో సూచీలు

### సెన్సెక్స్ 1069 పాయింట్లు డౌన్..



**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, కొత్త ఏఐ టూల్స్ మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ, ఆటో స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ ఓ దశలో 1300 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 25,450 దిగువకు చేరాయి. మదుపర్ల సంపద రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.466 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 83,052.54 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,294.66) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,934.73 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1068.74 పాయింట్ల నష్టంతో 82,225.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 288.35 పాయింట్ల నష్టంతో 25,424.65 స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.95గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5173 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.ప్రముఖ ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్ క్లాడ్ కోడ్ అనే కొత్త టూల్‌ను విడుదల చేసింది. దీనిద్వారా పాతకాలపు ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ అయిన ఊాబఒ కోడ్‌ను చాలా వేగంగా, తక్కువ ఖర్చుతో ఆధునీకరించవచ్చని ఆ సంస్థ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా బ్యాంకులు, ప్రభుత్వాలు, ఇన్సూరెన్స్ సంస్థలు వాడే ఐబీఎం మెయిన్‌ఫ్రేమ్ కంప్యూటర్లలో అత్యధికంగా ఈ లాంగ్వేజ్‌నే ఉపయోగిస్తారు. ఈ సిస్టమ్స్‌ను అప్‌డేట్ చేయడం ఐబీఎంకు ఒక ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. ఆంథ్రోపిక్ ప్రకటన వల్ల ఐబీఎం వ్యాపారంపై ప్రభావం పడుతుందన్న ఆందోళన వ్యక్తమైంది. దీంతో ఒక్కరోజే ఆ కంపెనీ షేర్లు 13 శాతానికి పైగా కుంగాయి. 26 ఏళ్లలో ఎన్నడూ లేని స్థాయిలో ఐబీఎం నష్టాన్ని చవిచూసింది.ఐటీ రంగంలో వస్తున్న ఈ మార్పులు భారతీయ ఐటీ కంపెనీలపైనా ప్రభావం పడింది. ఐటీ దిగ్గజాలైన ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. సుంకాల విషయంలో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్‌లు విధిస్తానని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో మరోసారి టారిఫ్ భయాలు నెలకొన్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ భయాలు కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

## ఎయిర్‌టెల్ మనీ కోసం రూ.20,000 కోట్ల మూలధనం

### అందించనున్న ఎయిర్‌టెల్

**హైదరాబాద్:** తన బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) ఎయిర్‌టెల్ మనీకి, రానున్న కొన్నేళ్లలో రూ.20,000 కోట్ల మూలధనం సమకూర్చనున్నట్లు టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ సోమవారం వెల్లడించింది. దేశంలో రుణాల లభ్యతలో ఉన్న అంతరాన్ని తగ్గించే లక్ష్యంతోనే ఈ నిధులు అందించనున్నట్లు తెలిపింది. ఎయిర్‌టెల్ మనీకి ఈనెల 13న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు లభించింది. రూ.20,000 కోట్ల మూలధనంలో 70% నిధులను ఎయిర్‌టెల్, మిగిలిన 30 శాతాన్ని ప్రమోటర్ గ్రూపు.. భారతీ ఎంటర్‌ప్రైజెస్ సమకూర్చనున్నాయి. 500 మందికి పైగా డేటా సైంటిస్టులు, బలమైన డిజిటల్ ఆస్తుల సాయంతో దేశవ్యాప్తంగా సురక్షిత, వినూత్న డిజిటల్ ఆర్థిక సేవలు అందించాలని ఎయిర్‌టెల్ మనీ లక్ష్యంగా పెట్టుకుంది. గత రెండేళ్లలో లెండింగ్ సర్వీస్ ప్రొవైడర్ ప్లాట్‌ఫామ్ ద్వారా రూ.9,000 కోట్లకు పైగా రుణాలను పంపిణీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ గోపాల్ విత్తల్ మాట్లాడుతూ.. సాంకేతికత, డేటా, వినియోగదార్ల నమ్మకాన్ని మేళవించి, జాతీయ స్థాయిలో అత్యంత విశ్వసనీయ డిజిటల్ క్రెడిట్ ఇంజిన్‌ను నిర్మించినట్లు వెల్లడించారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,48,300 (22 క్యారెట్లు) | ₹ 1,61,780 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,90,000

## నోయల్ టాటా 4 షరతులు..

### చంద్రశేఖరన్ పునర్నియామకం వాయిదా!

**న్యూఢిల్లీ:**టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్ పునర్నియామకం వాయిదా పడింది. మూడోసారి ఛైర్మన్‌గా నియమించే అంశంపై నిర్ణయాన్ని ప్రస్తుతానికి వాయిదా వేయాలని చంద్రశేఖరనే టాటా సన్స్ బోర్డును కోరారు. మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో కొన్ని అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. 2017లో టాటా సన్స్ ఛైర్మన్‌గా నియమితులైన చంద్రశేఖరన్ రెండోసారి ఆ పదవిలో కొనసాగుతున్నారు. 2027 ఫిబ్రవరితో చంద్రశేఖరన్ పదవీకాలం ముగియనుంది.టాటా సన్స్ బోర్డు సమావేశంలో కొందరు బోర్డు సభ్యులు చంద్రశేఖరన్ పునర్నియామకానికి మద్దతు ప్రకటించారు. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా మాత్రం కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారు. కొత్తగా చేపట్టిన వ్యాపారాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు పునర్నియామకం చేపట్టడానికి కొన్ని షరతులు కూడా విధించినట్లు ఆంగ్లమీడియా కథనాలు పేర్కొన్నాయి. టాటా సన్స్ లిస్ట్ (అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ కింద లిస్ట్ చేయాల్సి ఉంది) చేయకూడదని, కంపెనీ అప్పులేకుండా ఉండాలని, రిస్కుతో కూడుకున్న పెట్టుబడులకు దూరంగా ఉండాలని, ఎయిరిండియా, బిగ్‌బాస్కెట్ అప్పులు తగ్గించాలి వంటివి ఈ జాబితాలో ఉన్నాయి.అయితే, బోర్డు పునర్నియామక కమిటీ హెడ్ అనితా జార్జ్ మాత్రం చంద్రశేఖరన్‌కు అనుకూలంగా



మాట్లాడినట్లు తెలిసింది. గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల్లో నష్టాలు సహజమని, దానికి కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. అయితే, కొందరు సభ్యులు ఓటింగ్ చేపట్టాలని సూచించగా.. చంద్రశేఖరన్ మాత్రం ప్రస్తుతానికి ఈ అంశాన్ని వాయిదా వేయాలని బోర్డు సభ్యులను కోరారు. టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య ఏకాభిప్రాయంతోనే టాటా గ్రూప్ సంస్థలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో పునర్నియామక ప్రక్రియ వాయిదా పడింది.

# పసిడి దిగుమతులను గమనిస్తున్నాం

- బ్యాంకులు మిస్-సెల్లింగ్‌కు దూరంగా ఉండాలి
- అయిదేళ్లలో రూ.10 లక్షల కోట్ల ఆస్తుల నగదీకరణ
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

దిల్లీ: వినియోగదారులకు బీమా వంటి ఆర్థిక ఉత్పత్తులను తప్పుడు వివరాలతో బ్యాంకుల్లోనే విక్రయించడం (మిస్–సెల్లింగ్)పై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బ్యాంకులు తమ ప్రధాన వ్యాపారంపై దృష్టి పెట్టాలి. అవసరం లేకపోయినా బీమా ఉత్పత్తులు విక్రయించడానికే బ్యాంకులు ఎక్కువ సమయం కేటాయిస్తున్నాయి. బ్యాంకుల నియంత్రణ సంస్థ ఆర్‌బీఐ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ మధ్య ఉన్న నిర్వహణ పరమైన దూరం వల్ల ఎవరికీ జవాబుదారీతనం లేకుండా పోయింది' అని పేర్కొన్నారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన రిజర్వ్‌బ్యాంక్ (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డ్ సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి విలేకరులతో మాట్లాడారు. మిస్–సెల్లింగ్‌ను ఉపేక్షించేది లేదంటూ ఆర్‌బీఐ ఇచ్చిన ముసాయిదా మార్గదర్శకాలపై సంతోషంగా ఉందన్నారు. 'ఇకపై ఇలాంటి పనులు చేయలేరు అనే సందేశం బ్యాంకులకు వెళ్లాలి' అని మంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు డిపాజిట్లు, రుణాలపైనే దృష్టి సారించాలని ఆమె సూచించారు. గృహరుణం తీసుకునేందుకు ఇల్లు/స్థలం తాకట్టు పెడుతుండగా, మళ్లీ బీమా తీసుకోమని బ్యాంకులు ఒత్తిడి చేస్తుండటాన్ని మంత్రి ప్రశ్నించారు.ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల విలీనం కోసం ప్రభుత్వం వద్ద ప్రస్తుతానికి ప్రణాళికేమీ లేదని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. వికసిత్ భారత్ కోసం బ్యాంకింగ్‌పై నియమించిన ఉన్నతస్థాయి కమిటీ నివేదిక ఇచ్చాక, ఈ రంగాన్ని మరింత పటిష్ఠం చేసే చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు





భారీగా కొనుగోళ్లు చేస్తుండటం వల్లే పసిడి, వెండి ధరలు పెరుగుతున్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. విలువైన లోహాల దిగుమతులను ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సునిశితంగా గమనిస్తున్నాయని, ప్రస్తుతం ఇవి 'ఆందోళనకర స్థాయి'లో ఏమీ లేవని అన్నారు. ఆభరణాల రూపం లో లేదా ఆస్తిగా భారతీయ కుటుంబాలకు బంగారం ఎప్పుడూ ఇష్టమైన పెట్టుబడి అని, దేశీయ అవసరాల కోసం మన దేశం పసిడిని దిగుమతి చేసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. పండగల సీజన్, అక్షయ తృతీయ వంటి సమయాల్లో దేశీయంగా పసిడికి గిరాకీ పెరుగుతుందన్నారు.రాబోయే అయిదేళ్లలో ప్రజా ఆస్తుల నగదీకరణ (ఎన్‌ఎంపీ) ద్వారా, రూ.10 లక్షల కోట్లు సమీకరిం చాలని నిర్ణయించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇందుకోసం ఎన్‌ఎంపీ -2ను ఆమె ప్రకటించారు. 2021లో ప్రకటించిన ఎన్‌ఎంపీ–1 కింద 2022–25లో రూ.6 లక్షల కోట్లు సమీకరించాలని నిర్ణయించగా, అందులో 89 శాతానికి సమానంగా రూ.5.3 లక్షల కోట్లు ఖజానాకు చేరాయన్నారు.

**ఆందోళన అవసరం లేదు: మల్హోత్రా**

గత ఏడాది ఏప్రిల్‌- డిసెంబరు మధ్య మన దేశ పసిడి దిగుమతుల విలువ దాదాపు 1 బిలియన్ డాలర్లు (రూ.9,000 కోట్లు) పెరిగి 50 బిలియన్ డాలర్ల (రూ.4.50 లక్షల కోట్ల)కు చేరింది. ఈ ఏడాది జనవరిలో పసిడి దిగుమతుల విలువ, పరిమాణం..రెం డింటిలోనూ అకస్మాత్తుగా పెరుగుదల కనిపించిందని, ఈ గణాంకాలను ఆర్‌బీఐ విశ్లేషిస్తోందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. 2025 ఏప్రిల్– డిసెంబరులో ధరలు పెరిగిన ప్రభావం, పసిడి దిగుమతుల పరిమాణం తగ్గడంతో సమానమైం దని వివరించారు. ఈ ఏడాది జనవరిలో మాత్రమే గిరాకీలో హెచ్చుతగ్గులు, సీజనల్ మార్పులు కనిపించాయని వెల్లడించారు. మన దేశ విదేశీ వాణిజ్యం బలంగా ఉన్నందున, దీనిపై ఆందోళన చెందడం లేదని స్పష్టం చేశారు. తమ అంచనాల ప్రకారం కరెంట్ ఖాతా లోటు నియంత్రణలోనే ఉందని, జీడీపీలో 1 శాతంగా నమోదైనట్లు పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో డిపాజిట్ల వృద్ధి 12.5%, రుణాలు 14.5% వృద్ధి చెందాయన్నారు. వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం ఆధారంగా కీలక రేట్ల కోతలపై నిర్ణయం

## కేరళ.. ఇక కేరళం

### పేరు మారుస్తూ కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేవుడి సొంత భూమిగా పిలిచే కేరళ పేరు మారనుంది. ఈ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళంగా మార్చేదిశగా కీలక అడుగుపడింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పేరు మార్పుపై కేంద్రాన్ని అభ్యర్థిస్తూ ఇప్పటికే కేరళ అసెంబ్లీ పలుమార్లు తీర్మానాలు చేసిన సంగతి తెలిసిందే. అధికారిక రికార్డుల్లో రాష్ట్రం పేరును సవరించాలంటూ తీసుకువచ్చిన తీర్మానానికి ఇటీవల కేరళ శాసనసభ ఆమోదం తెలపగా.. తాజాగా కేంద్ర క్యాబినెట్ దానిని పరిగణనలోకి తీసుకుంది. ఈ ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.కేరళ పేరు మార్పుపై తొలిసారి 2023లో రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. తమ రాష్ట్రం పేరును పూర్వం నుంచే మలయాళంలో 'కేరళం' అని పిలిచేవారని అప్పట్లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ గుర్తు చేశారు. కానీ, ఇతర భాషల్లో మాత్రం కేరళ అని పిలుస్తున్నారని ఆయన తెలిపారు. కాగా.. ఈ విషయంలో విజయన్ ప్రభుత్వానికి భాజపా మద్దతు ఇచ్చింది. ఈ మేరకు ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ సీఎంకు లేఖ రాశారు. దానికి ముఖ్యమంత్రి బదులిస్తూ.. "రాష్ట్రం అసలు పేరు కేరళం. కానీ బ్రిటిషర్లు తమ సౌకర్యం కోసం కేరళగా మార్చారు. వారు చేసిన మార్పులను రాష్ట్ర సంస్కృతికి అనుగుణంగా సరిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు.

**ఒక రాష్ట్రం పేరు మార్చాలంటే..?**

ఒక రాష్ట్రం పేరు మార్చాలంటే.. మార్పునకు ప్రతిపాదన చేస్తూ చేసిన తీర్మానానికి ఆ శాసనసభలో ఆమోదం లభించాలి. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి సంబంధిత రాష్ట్ర శాసనసభ అభిప్రాయం తీసుకుంటారు. అయితే ఆ అభిప్రాయాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. తర్వాత రాష్ట్రపతి సిఫార్సు మేరకు పేరు మార్పు బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెడతారు. ఆ బిల్లు ఆమోదానికి సాధారణ మెజార్టీ సరిపోతుంది. తర్వాత రాష్ట్రపతి ఆమోదముద్రతో పేరు అధికారికంగా మారుతుంది. ఈ ప్రక్రియకు రాజ్యాంగ సవరణ అవసరం లేదు. ఆర్టికల్ 3 ప్రకారం సాధారణ చట్టం ద్వారానే చేయవచ్చు. అనంతరం రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషల్లో మార్పులు చేస్తారు.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు మోసం కేసు..

## 24 గంటల్లో నిధులు వెనక్కి

చండీగఢ్: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చండీగఢ్ శాఖలో చోటుచేసుకున్న మోసం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వానికి చెందిన రూ.556 కోట్ల నిధులు రికవరీ అయినట్లు హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ మంగళవారం వెల్లడించారు. రూ.22 కోట్ల వడ్డీ సహా దాదాపు రూ.556 కోట్ల నిధులు 24 గంటల్లో వెనక్కి వచ్చినట్లు అసెంబ్లీ సాక్షిగా సీఎం వెల్లడించారు.చండీగఢ్ శాఖలోని మధ్య, చిన్నస్థాయి ఉద్యోగులు కలిసి ఈ మోసానికి పాల్పడినట్లు బ్యాంకు తెలిపిందని సైనీ పేర్కొన్నారు. ఈ మోసానికి పాల్పడింది ప్రైవేటు వ్యక్తి అయినా, ప్రభుత్వ ఉద్యోగి అయినా సహించేది లేదన్నారు. హరియాణా ప్రభుత్వానికి చెందిన బ్యాంకు ఖాతాల నుంచి రూ.590 కోట్ల మేర మోసానికి గురైనట్లు బ్యాంక్ ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో దర్యాప్తునకు ఏసీబీని ఆదేశించినట్లు సీఎం తెలిపారు. ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలోని ఓ కమిటీ కూడా ఏర్పాటు చేశారు.మోసం కేసు వెలుగుచూసిన అనంతరం నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో 16 శాతం మేర పతనమైన బ్యాంక్ షేర్లు నేడు కోలుకున్నాయి. ఎన్‌ఎస్‌ఈలో ఒక శాతం లాభంతో రూ.71.08 వద్ద ట్రేడవుతోంది. హరియాణా ప్రభుత్వానికి సంబంధించి కొన్ని ఖాతాలకే ఈ మోసం పరిమితమైందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ వి.వైద్యనాథన్ తెలిపారు. శాఖలోని మిగతా వినియోగదార్ల ఖాతాలకు ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు.




## అమెరికా యుద్ధనౌకలో 'టాయిలెట్ వార్'

**వాషింగ్టన్:**అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతోన్న నేపథ్యంలో ఇప్పటికే భారీస్థాయిలో అమెరికా సైన్యం ఇరాన్‌ను చుట్టుముట్టిన విషయం తెలిసిందే. అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ సహా పలు యుద్ధనౌకలను ఇరాన్ దిశగా తరలించింది. అయితే యుద్ధం ప్రారంభించకముందే అమెరికా సిబ్బంది తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. విమాన వాహక నౌకలో విధులు నిర్వహిస్తోన్న 4500 సిబ్బంది 'టాయిలెట్' కష్టాలను ఎదుర్కొంటున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. నివేదికల ప్రకారం.. ఎనిమిది నెలలుగా నడి సముద్రంలో ఉన్న యుద్ధనౌకలోని మురుగునీటి వ్యవస్థలో ఇటీవల వైఫల్యం తలెత్తింది. యుద్ధనౌక నిరంతరం కదులుతున్నందున, సరైన నిర్వహణ లేకపోవడం వల్ల అందులో ఉన్న మొత్తం 650 మరుగుదొడ్లలో చాలా వరకు పనిచేయడం లేదు. దీంతో మహిళా సిబ్బందితో పాటు పురుషులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్రూంను ఉపయోగించుకోవాలంటే సిబ్బంది రోజు దాదాపు 45 నిమిషాల పాటు క్యూలో నిల్చోవాల్సి వస్తోంది. ఈ సమస్యను



పరిష్కరించడానికి నౌకలోని సాంకేతిక నిపుణులు రోజుకు 19 గంటలు పనిచేస్తున్నా లాభం లేకుండా పోతోంది.అయితే టాయిలెట్ సమస్యలు తలెత్తడం ఇదే మొదటిసారి కాదని.. గతేడాది మార్చిలోనూ నాలుగు రోజుల్లో నౌకలోని 205 టాయిలెట్లు పాడయ్యాయని సిబ్బంది తెలిపారు. ఇందులో అన్ని రకాల అత్యాధునిక సౌకర్యాలు ఉన్నప్పటికీ.. పెళుసుగా ఉండే వాక్యూమ్–ఆధారిత మురుగునీటి వ్యవస్థపై ఆధారపడడం వల్ల ఈ ఇబ్బందులు తలెత్తుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఇరుకైన మురుగు వ్యవస్థ నిర్మాణం కారణంగా ఒక వాల్వ్‌లో వైఫల్యం తలెత్తినా అన్ని టాయిలెట్లపై ఆ ప్రభావం పడుతోందన్నారు. ఈ పైపులను పునరుద్ధరించడానికి ప్రతిసారీ యాసిడ్ ఫ్లష్ చేయాల్సి వస్తోందన్నారు. దీని కోసం దాదాపు రూ.3 కోట్లను ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. అమెరికా ప్రభుత్వం తన కార్యక్రమాలను తరచూ పొడిగిస్తున్న కారణంగా కొంతమంది సిబ్బంది తీవ్ర అసహనానికి గురై సైన్యం వదిలి వెళ్లిపోవాలనుకుంటున్నట్లు తెలుస్తోంది.

## 24వేల నకిలీ అకౌంట్లతో చైనా సంస్థల చోరీ..

### ఆంథ్రోపిక్ సంచలన ఆరోపణలు

**న్యూఢిల్లీ:**ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఏఐ రేసు కనిపిస్తోంది. అది రాజకీయ భౌగోళిక వివాదాలకు దారితీస్తోంది. అమెరికా ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్ మూడు చైనా కంపెనీలపై తీవ్ర ఆరోపణలు చేయడమే ఇందుకు కారణం. తమ క్లాడ్ మోడళ్ల సామర్థ్యాలను డీప్‌సీక్, మూన్‌షాట్ ఏఐ, మినిమ్యాక్స్ చోరీ చేస్తున్నాయని ఆంథ్రోపిక్ ఆరోపించింది.ఈ మూడు చైనా ల్యాబ్స్ 24వేల నకిలీ అకౌంట్లను వినియోగించి, క్లాడ్‌తో 16 మిలియన్ ఇంటరాక్షన్లను సృష్టించాయని ఆంథ్రోపిక్ పేర్కొంది. నిబంధనలను ఉల్లంఘిస్తూ డిస్టిలేషన్‌కు పాల్పడుతోందని ఆరోపించింది. అనేది ఒక ట్రైనింగ్ టెక్నిక్. ఒక సమర్థవంతమైన ఏఐ మోడల్ ఇచ్చే అవుట్‌పుట్ నుంచి అంతగా సామర్థ్యంలేని ఒక చిన్న మోడల్ నేర్చుకునే ప్రక్రియ. చట్టబద్ధమైన ప్రయోజనాలకోసం ఏఐ రంగంలో ఈ డిస్టిలేషన్‌ను వినియోగిస్తున్నారు. దీంతో కంపెనీల్లోనే అంతర్గతంగా చిన్న, చౌకైన వెర్షన్లను క్రియేట్ చేసుకోవడమనేది సాధారణ ప్రక్రియే. ఈ టెక్నిక్‌ను పోటీదారులు దుర్వినియోగం చేస్తున్నాయని ఆంథ్రోపిక్ చెప్తోంది.పోటీ సంస్థలు పెద్దగా సమయం వెచ్చించకుండానే.. స్వల్ప మొత్తంతో అధునాతన సామర్థ్యాలను కాపీ చేస్తున్నాయని ఆరోపిస్తోంది. ఇలా కాపీ చేసే చిన్న చిన్న ఏఐ మోడల్స్.. సాంకేతికతను దుర్వినియోగం చేయకుండా నిరోధించే రక్షణ వ్యవస్థలను కలిగి ఉండబోవని వినియోగదారులను హెచ్చరించింది. కోడింగ్, ఏజెంటిక్ రీజనింగ్, టూల్ యూజ్, కంప్యూటర్ యూజ్ ఏజెంట్స్, కంప్యూటర్ వెర్షన్ వంటి సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు చైనా సంస్థలు ఈ ఇంటరాక్షన్ జరిపాయని అమెరికా స్టార్టప్ పేర్కొంది.

# ఓయూ బస్తీల సమస్యలపై సీఎం రేవంత్‌కు వినతి

- డబుల్ బెడ్‌రూమ్ గృహాలు, పాఠశాల నిర్మాణంపై చర్చ
- మాజీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి కీలక సమావేశం



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న పలు బస్తీల సమస్యలపై గ్రేటర్ హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియూసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి మంగళ వారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు.. ఈ సందర్భంగా పలు ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పలు బస్తీల విలీన అంశం, అలాగే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఉన్న తొమ్మిది బస్తీలకు సంబంధించి డబుల్ బెడ్‌రూమ్ గృహాల సమస్యలపై సమగ్రంగా ముఖ్యమంత్రి తో చర్చించామని చెప్పారు. ఆయా సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే లా తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అదేవిధంగా తార్నాక డివిజన్‌లోని విజయ డైరీ క్వార్టర్స్ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ప్రత్యేక స్థలాన్ని కేటాయించి, విద్యా సదుపాయాలను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ ప్రాంతంలో పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందువల్ల ప్రభుత్వ స్కూల్ ఏర్పాటుతో పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్యావకాశాలు లభిస్తాయని వారు వివరించారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి డబుల్ బెడ్‌రూమ్ గృహాల సమస్యతో పాటు ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుపై తక్షణమే సంబంధిత అధికారులతో సమీక్షించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని చెప్పారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, తార్నాక డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని స్పష్టం చేశారు.

# అభివృద్ధి చూసి బీఆర్ఎస్ ఓర్వలేక బురదజల్లుతోంది

- బీఆర్ఎస్ అవగాహన లేకపోవడమే ఓటమికి కారణం
- పాలనలో అభివృద్ధి శీలాపలకాలకే పరిమితం
- ఖబర్దార్ బీఆర్ఎస్ నాయకులారా.. రంగులు మార్చడం మానండి : చైర్‌పర్సన్ నిరజబాల్ రెడ్డి




**తాండూర్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి దుసుకుపోతుండటం చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక బురదజల్లే ప్రయత్నాలకు పాల్పడుతున్నారని తాండూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ నిరజబాల్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. మంగళవారం తాండూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన ఆమె, బీఆర్ఎస్ నాయకుల ఓర్మలేని, లేనిపోని ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారని ఆమె అన్నారు. 52 వేల ఓట్లు పోలైన ఈ ఎన్నికల్లో 41 శాతం ఓట్లతో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం కల్పించారని, బీజేపీ గల్లంతైందని పేర్కొన్నారు. ఎన్నికలు ఎవరైనా విజయం కాంగ్రెస్ పార్టీదే అని స్పష్టం చేశారు. సామరస్యంతో పనిచేస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సౌమ్య స్వభావం కలిగినవారని, లోకల్ నాయకుడని, దూసుకొచ్చే తత్వం మాది కాదని నిరజబాల్‌రెడ్డి వివరించారు. బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేకపోవడంతోనే ఓటమి పాలయ్యారని, వారి పాలనలో అభివృద్ధి శీలాపలకాలకే పరిమితమైందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ఎక్కడినుంచి వచ్చారో చెప్పాలని, నాన్ లోకల్ కాదు.. లోకల్ అని మా ఎమ్మెల్యేని గుర్తుచేస్తూ.. అభివృద్ధి చూసి ఆరోపణలు చేయడం తగదని ఆమె మండిపడ్డారు. తప్పు తాము చేసి మీద బురద జల్లడం సరికాదని, రంగులు మార్చే తత్వం మీదే అని వ్యంగ్యంగా అన్నారు. రెండేళ్లలో అభివృద్ధిలో దుసుకుపోతున్నామని, ఖబర్దార్ బీఆర్ఎస్ నాయకులారా అంటూ హెచ్చరించారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం వారి విజ్ఞతే వదిలేశామని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ కనుమరుగు ఖాయమని నిరజబాల్ రెడ్డి ధీమాగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, అబిబ్ లాల్, లింగదల్లి రవికుమార్, సీనియర్ నాయకులు సర్దార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందులో గడ్డం ప్రసాద్ కుమార్

**మర్పల్లి ఫిబ్రవరి 24 (జనంసాక్షి)** మంగళవారం మర్పల్లి మండల కేంద్రంలోని మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. రంజాన్ ఉపవాస దీక్షల విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, ముందుగా ప్రార్థనలలో పాల్గొని అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూర తినిపించి మంగళ వారం ఉపవాస దీక్షను విరమింపచేసారు. మర్పల్లి గ్రామ సర్పంచ్ రామేశ్వర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్ యాదవ్, రాముల యాదవ్, సుభాష్ యాదవ్, ఉప సర్పంచ్ కొప్పుల ప్రభు, శేఖర్ యాదవ్, నర్సింలు యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు జగదీశ్వర్, సలీం, ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరులో గంజాయి జాతర

## నిద్రపోతున్న ఎక్సైజ్ యంత్రాంగం

- అర్బన్ అధికారి వైఫల్యం.. యువత భవితవ్యం గంజాయి పాలు
- ఆదాయంపై మమకారం.. అబ్కారి శాఖ తీరు నిర్లక్ష్యం




**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** పాలమూరు జిల్లా కేంద్రంలో గంజాయి సాగు, సరఫరా చాప కింద నీరులా విస్తరిస్తోంది. ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న జిల్లా కేంద్రం ఇప్పుడు గంజా యి గ్యాంగులకు అడ్డాగా మారుతోంది. రాత్రి సమయాల్లో యువత గంజాయి సేవించి రోడ్లపై బైకులతో హల్‌చల్ చేస్తున్నా, బహిరంగంగానే అమ్మకాలు సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకో కపోవడంపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**వైన్ షాపుల ఆదాయంపైనే దృష్టి..**

జిల్లా అబ్కారి శాఖాధికారులు కేవలం వైన్ షాపుల టార్గెట్లు, వాటి నుంచి వచ్చే ఆదాయం మీదనే దృష్టి సారించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే మద్యం విక్రయాల పర్యవేక్షణలో చూపిస్తున్న ఉత్సాహం, యువత భవిష్యత్తును చిదిమేస్తున్న గంజాయి కట్టడిలో చూపడం లేదని జిల్లా వాసులు మండిపడుతున్నారు. పాత నేరస్తులు, సరఫరాదారుల వివరాలు తెలిసి నా అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక అంతర్యమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అర్బన్ అధికారి అసమర్థతే కారణమా?**

మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలో గంజాయి నియంత్రణ పూర్తిగా అటకెక్కినట్లు తెలుస్తోంది. గతంలో పనిచేసిన అధికారులు గంజాయి ముఠాలపై ఉక్కుపాదం మోపగా, ప్రస్తుత అర్బన్ అధికారి బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి తనిఖీలు నామమాత్రంగా మారాయని సమాచారం. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించడం, మహిళా అధికారుల నియామకం గంజాయి కట్టడికి ప్రతిబంధకంగా మారిందని అబ్కారి సర్కిళ్లలోనే చర్చ జరుగుతోంది. బాధ్యతాయుతమైన పోస్టులో ఉన్న అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయకపోవడం వల్లనే సరఫరాదారులు బరితెగిస్తున్నట్లు తెలుస్తోంది.

**విద్యార్థులే లక్ష్యంగా సరఫరా**

జిల్లా కేంద్రం శరవేగంగా విస్తరిస్తుండటంతో కాలేజీలు, విద్యార్థుల సంఖ్య పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకున్న ముఠాలు విద్యార్థులను గంజాయి ఊబిలోకి లాగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి గంజాయి మహమ్మారిని అరికట్టకపోతే, భవిష్యత్తులో మహబూబ్‌నగర్ గంజాయి వినియోగంలో అగ్రస్థానంలో నిలిచే ప్రమాదం ఉందని మేధావులు హెచ్చరిస్తున్నారు.



## కులమతాలు లేని సమాజం కోసం పోరాటం చేసిన తొలి మహిళ ఈశ్వరి భాయి: డాక్టర్ గీతా రెడ్డి

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** బాబాసాహెబ్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచి, అణగారిన వర్గాల కోసం పోరాడిన ధీశాలి, ఉక్కు మహిళ ఈశ్వరి భాయి అని డాక్టర్ గీతా రెడ్డి వెల్లడించారు.ఈశ్వరి భాయి 35వ వర్ధంతి కార్యక్రమంకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు.మహిళల విముక్తి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జైలుకు వెళ్లడానికి వెనకాడలేదని గుర్తు చేశారు.నేటి తరం మహిళ లు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని పోరాట పటిమను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.టీచర్‌గా సేవలు అందించి రాజకీయంలో ఎదిగారని తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్, రమాబాయి వంటి వారిని ఆదర్శంగా తీసుకుని మహిళల విముక్తి కోసం ఆమె నిరంతరం శ్రమించారని,కుల నిర్మూల న జరిగినప్పుడే ఆమెకు నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.మహిళల కోసం 33 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేశారని,ఈ అవకాశంను సద్వినియోగం చేసుకుని రాజకీయాల్లో రాణించాలని కోరారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి రాజకీయంలోకి అడుగుట్టిన ఆమె కార్పొరేటర్ నుండి ఎమ్మెల్యే వరకు ఎదిగారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలోమాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య,జేబీ రాజు,ధర్మేంద్ర కుమార్,డాక్టర్ రామచంద్ర రెడ్డి, విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మెర ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి

### జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్



**తాండూరు ఫిబ్రవరి 24(జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెర గ్రామంలో అగ్ర కులాల అహంకారంతో బీసీ రజక కుటుంబా నికి చెందిన గణేష్ చంద్రకళ కుటుంబంపై జరిగిన అమానుష దాడి కారణంగా రెండు నెల ల పసికందు మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు, తాండూర్ నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్ట్ చేసి, వారిపై హత్య కేసుతో పాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఇటువంటి కుల దురాహంకార దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే కొమ్మెర ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై భౌతిక దాడులు జరగకుండా ప్రభుత్వం కట్టడి చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించి, కేసుకు సంబంధం ఉన్న వారందరిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాత విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని రాజ్‌కుమార్‌డిమాండ్ చేశారు.

# విద్యుత్ షాక్ తగిలి బాలిక మృతి



**చేవెళ్ల, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** అడవి పందుల నుండి మొక్కజొన్న పంటను కాపాడేందుకు వేసిన విద్యుత్ కంచె షాక్ తగిలి తమ్ముడి కూతురు మృతి చెందింది. పంట రక్షణకు కోసం వేసిన విద్యుత్ షాక్ తో చిన్నారులకు యమపాషమైంది. పాప మృతి చెందగా బాబు ప్రాణాలతో బయటపడ్డాడు. చేవెళ్ల మండలం మిర్జాగూడ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మిర్జాగూడ గ్రామానికి చెందిన ఇబ్రహీంపల్లి యాదయ్య, అనిత దంపతులకు ఇద్దరు సంతానం కూతురు శ్రీవర్షణి(7) కొడుకు రిత్విక్(5)లు మండల కేంద్రంలోని నవచైతన్య హైస్కూల్లో చదువుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో నవాబ్ పెట్ మండలం తిమ్మరెడ్డిపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి తల్లితో కలిసి పిల్లలు వెళ్లారు. మంగళవారం ఉదయం వారు గ్రామానికి వచ్చే సమయానికి స్కూల్ బస్సు వెళ్లిపోవడంతో పిల్లలు ఇంటి వద్దనే ఉండిపోయారు. పెద్దమ్మ మౌనిక పొలం వద్దకు వెళ్తుండగా అడుకుంటున్న పిల్లలు గమనించి ఆమె వెంట వెళ్లారు. పెద్ద నాన్న మల్లేష్ సాగు చేసిన మొక్కజొన్న పంటను అడవి పందల నుంచి కాపాడుకునేందుకు రక్షణ కోసం పొలం చుట్టు విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. పెద్దమ్మ పొలం పరిశీలిస్తుండగా వెంట వచ్చిన వారిని చూడలేకపోయింది. పిల్లలు సంతోషంగా అడుకుంటూ పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను తగిలి ఒక్కసారిగా శ్రీవర్షిణి గిలగిల కొట్టుకొని కింద పడిపోయింది. బాబు రిత్విక్ విద్యుత్ వైరు తాకగానే ఎగిరి పడ్డాడు. వెంటనే పెద్దమ్మ చూసి అరవడంతో చుట్టు పక్కల రైతుల వచ్చి వారిని వెంటనే చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే పాప మృతి చెందగా బాబు పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రాణాలతో బయటపడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**పెద్ద నాన్న నిర్లక్ష్యంతో పాప ప్రాణం పోయింది**

పంట రక్షణకు వేసిన విద్యుత్ కనెక్షన్ రాత్రివేల మాత్రమే ఉంచి ఉదయం తీసివేయాలి. అతని నిర్లక్ష్యంగా పగలు కూడా విద్యుత్ కనెక్షన్ తొలగించకుండా ఉంచడం వలన జరిగింది. గతంలో అక్కడ కు వెళ్లిన వారు పగలు తీసివేస్తే బాగుటుందని చెప్పారు. అతడు మాత్రం నిర్లక్ష్యంగా ఉంచడంతో తమ్ముడి కూతరును బలితీసుకుందని వాపోయారు. మల్లేష్ నిర్లక్ష్యం కారణంగా పలు ప్రమాదాలు జరిగిన జాగ్రత్తగా వ్యవహరించడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఇష్టాను సారంగా పంట రక్షణకోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు ఇతరుల ప్రాణాలు తీస్తున్నాయి. ప్రతి సంవత్సరం పదల సంఖ్యలో పంటల కోసం ఏర్పాటు చేసిన కంచె కారణంగా విద్యుతాక్ తగిలి మృతి చెందుతున్నారు.

## భారీ బందోబస్తు నడుమ 2వ రోజు పారిశ్రామిక వాడ ఏర్పాటుకు కొనసాగిన భూసర్వే



**బొంరాస్ పేట,దుద్యాల ఫిబ్రవరి 24 (జనం సాక్షి):** పారిశ్రామిక వాడ ఏర్పాటలో భాగంగా గతంలో జరిగిన సంఘటనలును దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో 100 మంది పోలీసుల పహారా మధ్య రెండవ రోజు పారిశ్రామి క వాడ ఏర్పాటుకు సంబంధించి దుద్యాల మండలం ఈర్లపల్లి, సంట్రకుంట తండా, నాన్యానాయక్ తండా పరిధిలోని 88 సర్వే నంబర్ లో గల 213.37 ఎకరాల అసైన్మెంట్ భూమిలో మంగళవారం తహాసిల్దార్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది గ్రూపులుగా ఏర్పడి సర్వే నిర్వహించారు.నన్య నాయక్ తండాలో పట్టా భూమిలో ఎంజాయ్ మెంట్ సర్వేలో రైతులు తమ హద్దులను అధికారులకు చూపించారు.అధికారులు రైతుల వివరాలను నమోదు చేసుకోవడం జరిగింది.మాకు నష్టం జరగకుండా పరిహారం అందించాలని అధికారులను రైతులు కోరగా జిల్లా రెవెన్యూ అధికారి మంగిలాల్ పొజిషన్ లో ఉన్న రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు.సర్వేలో ఆర్ఐ నవీన్ కుమార్,సర్వేయర్లు మహేష్, ఆనంద్, శ్రీను, ఎస్పైలు బాల వెంకట రమణ, శ్రీశైలం, రాజకుమార్ ఉన్నారు.

# పరీక్ష ప్రారంభం తర్వాత 5 నిమిషాల వరకు ప్రవేశం

- పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు : సీఎస్ రామకృష్ణారావు
- ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు తప్పనిసరి
- సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలపై నిషేధం
- మేడ్చల్‌లో 151 కేంద్రాలు, లక్షా 35 వేల మంది అభ్యర్థులు




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్, మార్చి 14 నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ప్రారంభమైన తర్వాత ఐదు నిమిషాల వరకు పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశానికి అనుమతి ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయం విద్యార్థుల సౌకర్యార్థం తీసుకున్నదని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ పాల్గొన్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు, వివాదాస్పద కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు, సీసీ కెమెరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో పాటు ప్రతి కేంద్రంలో ఒక ఏఎన్ఎం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకుండా అన్ని కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సిట్టింగ్ స్క్వాడ్లు, ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే చీఫ్ సూపరింటెండెంట్‌కు ఫోన్ వినియోగానికి అనుమతి ఉంటుందని తెలిపారు. ఈసారి తొలిసారిగా ప్రతి కేంద్రంలో క్లాక్ రూమ్ సౌకర్యం కల్పిస్తున్నామని సీఎస్ పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలకు ప్రత్యేక క్యూఆర్ కోడ్, సీరియల్ నంబర్ ఉండగా పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే మాత్రమే తెరవాలని సూచించారు. విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడంతో పాటు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ సౌకర్యం కల్పించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ ఇంటర్ ఫస్ట్ ఇయర్‌కు 4,89,055 మంది, సెకండ్ ఇయర్‌కు 4,53,832 మంది, పదవ తరగతికి 5,28,239 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు 151 కేంద్రాలు ఏర్పాటు చేశామని, సుమారు లక్షా 35 వేల మంది అభ్యర్థులు హాజరవుతారని వివరించారు. హై పవర్ కమిటీ ఆధ్వర్యంలో పూర్తి భద్రతా ఏర్పాట్లతో పరీక్షలు నిర్వహిస్తామని, మౌలిక వసతులు, సీసీ కెమెరాలు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం పూర్తి చేశామని తెలిపారు. పరీక్షల సమయంలో అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ కూడా పాల్గొన్నారు.

# గోపన్‌పల్లి తండా ఏటిఎం నగదు చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- పోలీసుల అదుపులో నిందితుడు... 34.90 లక్షల నగదు స్వాధీనం
- జల్సాలకు మిగిలిన డబ్బు.. సెక్యూరిటీ ఏజెన్సీపై చర్యలు




**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** హైదరాబాద్‌లో సంచలనం రేపిన గోపన్‌పల్లి తండా ఏటిఎం నగదు చోరీ కేసును గచ్చిబౌలి పోలీసులు ఛేదించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని 34.90 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. నార్సింగి ఏసిపి రమణ గౌడ్ మంగళవారం ఈ వివరాలను మీడియాతో పంచుకున్నారు. ఈ నెల 12న గోపన్‌పల్లి ప్రాంతంలో ఏటిఎంలకు నగదు సరఫరా చేస్తున్న వాహనం నుంచి 56 లక్షల రూపాయల నగదు అపహరించిన ఘటన జరిగింది. ఫిర్యాదు అందగానే గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 278/2026గా కేసు నమోదు చేసి కుమ్మర దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థల పరిశీలన, సీసీటీవీ ఫుటేజ్ సేకరణ, సాంకేతిక ఆధారాల విశ్లేషణ, క్లూస్ టీం ద్వారా విచారణ కొనసాగించారు.

నిందితుడు సికింద్రాబాద్ డైమండ్ పాయింట్ నివాసి బడిగెరే అజిత్ కుమార్ అలియాస్ శివ (34). ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లా బొమ్మనహల్ స్వస్థలం. సంగెం సెక్యూరిటీ ఏజెన్సీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏటిఎంలో నగదు పెడుతున్న సమయంలో సహచరులు వాహనం బయట సెక్యూరిటీగా ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకుని వాహనాన్ని నగదుతో సహా తీసుకుని పారిపోయాడు. కొంతసేపు తోటి సిబ్బందిని మభ్యపెట్టి గద్దర్ చౌరస్తా, నల్లగండ్ల ప్రాంతాలకు వెళ్లి నగదు ఉన్న ట్రంక్ బాక్స్‌ను తీసుకుని వాహనాన్ని అక్కడ వదిలేశాడు. ఆటోలో పారిపోయి ఆర్టీసి క్రాస్ రోడ్స్ ప్రాంతంలోని ఒక లాడ్జ్‌లో సాధారణ ప్రయాణికుడిలా దిగాడు. యాక్స్ బ్లేడ్‌తో నగదు పెట్టెను తెరిచి డబ్బును బ్యాగ్‌లో పెట్టుకుని మరునాడు అనంతపూర్‌కు పారిపోయాడు. అనంతరం బళ్లారి, బెంగళూరు, పుణే ప్రాంతాల్లో తిరిగి పోలీసుల కళ్లుగప్పి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. సాంకేతిక ఆధారాలతో కదలికలను ట్రాక్ చేసిన పోలీసులు మంగళవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో అతడు వేరే ప్రాంతానికి వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉండగా అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడివద్ద 34.90 లక్షల రూపాయల నగదు లభ్యమైంది. ఆ నగదును స్వాధీనం చేసుకుని సీజ్ పంచనామా నిర్వహించారు. మిగిలిన నగదును జల్సాలకోసం వెచ్చించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

డ్రైవర్ల నియామకంలో నిర్లక్ష్యం వహించిన సంగం సెక్యూరిటీ ఏజెన్సీపై ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ రెగ్యులేషన్ చట్టం-2005 ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏసిపి తెలిపారు. కేసు దర్యాప్తులో అప్రమత్తంగా వ్యవహరించి నిందితుడి అనుమానాస్పద కదలికలను గమనించి సమాచారం అందించిన ఎస్వీఆర్ బస్ ట్రావెల్స్ డ్రైవర్ ఉమాకాంత్‌ను పోలీసులు ప్రత్యేకంగా అభినందించారు. శేరిలింగంపల్లి జోన్ డిసిపి సి.హెచ్. శ్రీనివాస్ పర్యవేక్షణలో, అదనపు డిసిపి ఉదయ్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంలో నార్సింగి సిసిఎస్ మాదాపూర్ సహకారంతో గచ్చిబౌలి పోలీసులు, డిటెక్టివ్ విభాగం, క్రైమ్ బృందం కేసును ఛేదించారని ఏసిపి రమణ గౌడ్ పునరుద్ఘాటించారు.

# ఇంటర్, టెన్త్ పరీక్షలకు కట్టుదిట్ట ఏర్పాట్లు

- నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు



**నిజామాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** జిల్లాలో ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. పరీక్షల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ ఆదేశించారు. ప్రశ్నపత్రాల రవాణా నుంచి పరీక్షా కేంద్రాలకు చేరే వరకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్ కొరత లేకుండా, విద్యార్థులకు తగిన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 36,963 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, 58 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. పదవ తరగతి పరీక్షలకు 24,542 మంది విద్యార్థులు హాజరవుతారని, 144 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 15 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. నోడల్ అధికారులతో సమావేశాలు నిర్వహించి, లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ చెప్పారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తో రవాణా చేస్తామని, పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తామని తెలిపారు. పరిసర జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించామన్నారు. ప్రతి కేంద్రంలో తాగునీరు, పరిశుభ్రత వంటి సదుపాయాలు ఉండేలా చూస్తున్నామని వివరించారు. విధుల్లో ఉండే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని, విద్యార్థులు పరీక్షకు ఒక గంట ముందుగా చేరుకోవాలని అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అనుమతించకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి ధీమా వ్యక్తం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఇంటర్ విద్యాధికారి రవి కుమార్, డీఈఓ అశోక్, డీపీఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



## సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పది

### టిడబ్ల్యూజేఎఫ్ డైరీని ఆవిష్కరించిన కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్‌టౌన్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) 2026 డైరీని జిల్లా కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టుల పాత్ర గొప్పదని అన్నారు. జర్నలిస్టుల డైరీని తన చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరు భాధ్యతగా ఉండాలని అందులో తానుకూడా ముందు వరుసలో ఉంటానని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్‌లకు టిడబ్ల్యూజేఎఫ్ డైరీని ఫెడరేషన్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి బాపూరావు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టిడబ్ల్యూజెఎఫ్ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పిఎస్ రవీంద్ర, జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్ రావు, జిల్లా సహాయ కార్యదర్శి గుండి కిరణ్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్ రెడ్డి, దీక్షిత్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్

### సీఎం రేవంత్‌కు కరీంనగర్ జేఏసీ నాయకుల కృతజ్ఞతలు

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన క్యాష్‌లెస్ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌పై కరీంనగర్ జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని లక్షలాది ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత అందించే ఈ నిర్ణయాన్ని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్త్ కేర్ ట్రస్ట్‌కు రూ.1056 కోట్ల నిధులు కేటాయించడం, ఉద్యోగుల వాటాకు సమానంగా ప్రభుత్వం కాంట్రిబ్యూషన్ ఇవ్వడం అభినందనీయమని జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సుమారు 17 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఈ స్కీమ్ ద్వారా పూర్తి క్యాష్‌లెస్ వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగులకు రూ.1.2 కోట్ల బీమా, 60 ఏళ్లలోపు సాధారణ మరణం చెందిన వారికి రూ.10 లక్షల బీమా వర్తింపజేయడం శుభపరిణామమని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ ట్రస్ట్ నిధులను ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించకుండా, కేవలం ఉద్యోగుల ఆరోగ్య రక్షణకే ఉపయోగించాలని డిమాండ్ చేశారు.

పూర్తిస్థాయి క్యాష్‌లెస్, లిమిట్‌లెస్ వైద్య విధానాన్ని అమలు చేసేందుకు



స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి, అందరికీ ఆరోగ్య డిజిటల్ కార్డులు జారీ చేయాలని కోరారు. గతంలో పెండింగ్ బకాయిలు, జీపీఎఫ్, ఇన్సూరెన్స్, పెన్షనర్ బెనిఫిట్స్ నిధుల వినియోగంపై ఉన్న అనుమానాల నేపథ్యంలో ఈ ట్రస్ట్ నిధులు ఇతర అవసరాలకు మళ్లించబడకుండా హామీ ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, టీఎన్జీవోల సంఘం ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీతోపాటు జిల్లా నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మీందర్ సింగ్, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళి చరణ్, కార్యదర్శి ఎడ్ల అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**మహేశ్వరం,ఫిబ్రవరి24(జనంసాక్షి):** రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీశైలం జాతీయ రహదారి గూడూరు గేట్ సమీపంలో మంగళవారం ఉదయం 8 గంటలకు చోటు చేసుకుంది.కందుకూరు సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం...రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ కు చెందిన మొల్ల సైదులు (22) యమహా బైక్(టిజీ08 జేఎఫ్4535) మీద నాగర్ కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో గూడూరు గేట్ సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు బైకును ఢీ కొట్టింది. మొల్ల సైదులు తలకు తీవ్ర రక్త గాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించి అవేర్ మాధవన్ జీ హాస్పటల్‌కు తరలించారు. వైద్యులు సైదులు ను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

## బేగంపేట్‌లో ట్రాఫిక్ పోలీసుల హెల్మెట్ బ్యాంకు కార్యక్రమం

**సికింద్రాబాద్(జనంసాక్షి):** ద్విచక్రవాహనదారుల ప్రాణాలను రక్షించాలనే ఉద్దేశంతో హెల్మెట్ బ్యాంకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి, అదనపు డీసీపీ ఏ.లక్ష్మీ పేర్కొన్నారు. బేగంపేట్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం బేగంపేట్‌లో హెల్మెట్ బ్యాంక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి, అదనపు డీసీపీ లక్ష్మీతో కలిసి మీడియాతో మాట్లాడారు. హెల్మెట్ లేని ద్విచక్రవాహనదారులను గుర్తించి వారి వివరాలు నమోదు చేసి, వారికి హెల్మెట్‌ను అప్పుగా ఇస్తున్నామని చెప్పారు. 24 గంటల లోపు కొత్త హెల్మెట్ కొనుగోలు చేసి, అప్పుగా తీసుకున్న హెల్మెట్‌ను తిరిగి హెల్మెట్ బ్యాంక్‌లో జమ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం ద్విచక్రవాహనదారుల మరణాలు హెల్మెట్ లేకపోవడం వల్లనే జరుగుతున్నాయని తమ అధ్యయనంలో తేలిందన్నారు. తనిఖీల సమయంలో హెల్మెట్ ధరించకపోవడానికి కొందరు హడావిడిలో ఇంట్లో మరిచిపోయామని, జుట్టు రాలిపోతుందనే భయంతో, లేదా తల–మెడ నొప్పుల కారణంగా ధరించడం లేదని వివిధ సాకులు చెబుతున్నారని వెల్లడించారు. అవగాహన కార్యక్రమాలతో పాటు ఇప్పుడు ఈ హెల్మెట్ బ్యాంకు ద్వారా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చలానా విధించడం మాత్రమే కాకుండా, ప్రాణ రక్షణపై అవగాహన పెంచడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వాహనదారుడిని గుర్తించి వివరాలు నమోదు చేసి హెల్మెట్‌ను అప్పుగా ఇస్తామని, 24 గంటల తరువాత అదే హెల్మెట్‌ను బ్యాంక్‌లో తిరిగి జమ చేయాలని డీసీపీ రాహుల్ రెడ్డి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో అల్వాల్, తిరుమలగిరి ప్రాంతాల్లో కూడా ఈ హెల్మెట్ బ్యాంక్‌ను విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, బేగంపేట ఆర్ఎస్ఐ అశోక్ రెడ్డి, తిరుమలగిరి సీఐ సర్దార్ నాయక్, అల్వాల్ సిఐ శంకర్ పాల్గొన్నారు.





## అకాల వర్షాలకు.. రైతుల ఆశలు నీటిపాలు

### నేలకొరిగిన మొక్కజొన్న, మామిడి పంటలు

### ఎకరాకు 20 వేల నష్టపరిహారం ఇవ్వాలి : మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

- ఫిబ్రవరి చివర్లో రైతు భరోసా విడుదల చేయాలి
- ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి..
- క్షేత్రస్థాయిలో పంట నష్టం పరిశీలన
- రైతులు కన్నీటి పర్యంతం

**రాయికల్/జమ్మికుంట/ ఫిబ్రవరి 24 (జనం సాక్షి ):** తెలంగాణలో అకాల వర్షాలు, ఈదురు గాలులతో రైతులు తీవ్ర నష్టపోయారు. కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న, మామిడి పంటలు నేలకొరిగి రైతుల ఆశలు నీటిపాలయ్యాయి. ఆరుకాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చిన సమయంలో ప్రకృతి వైపరీత్యాలు భారీ దెబ్బ తీశాయి. మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాయికల్ మండలంలోని రామజిపేట్ గ్రామంలో మంగళవారం క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి బాధలు తెలుసుకున్నారు.

పంట నష్ట భీమ పథకం అమలు లేకపోవడంతో ప్రభుత్వం ఎకరాకు 20 వేల రూపాయల నష్టపరిహారం అందించాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టర్, వ్యవసాయ అధికారులు వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని సూచించారు. రాయికల్ పట్టణంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బిడ్డగా రైతాంగ పక్షాన దృష్టి సారించి దేశానికి అన్నం పెట్టే రైతులను ఆదుకోవాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికలు రాజకీయ అంశమే అయినప్పటికీ రైతాంగ మేలు కోసం రైతు భరోసా నిధులను ఫిబ్రవరి చివర్లో విడుదల చేయాలని సూచించారు. బడ్జెట్ సమావేశంలో పంట నష్టం, రైతు భరోసా అంశాలపై నిర్ణయం తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇల్లందకుంట మండలంలోని ఇల్లందకుంట, బూజునూరు, చిన్న కోమటిపల్లి, సిరిసేడు, టేకుర్తి గ్రామాల్లో సుమారు 350 ఎకరాల మొక్కజొన్న పంట ఈదురు గాలులతో నేలకొరిగిందని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము పరిశీలించి తెలిపారు. పీసు దశలో ఉన్న మొక్కజొన్న పంట పూర్తిగా నాశనమైందని, ప్రభుత్వం ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ఈదురు గాలులతో వేల ఎకరాల పంట నష్టపోవడంతో రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమ హామీలు ఇస్తున్నప్పటికీ ఆచరణలో లోపాలున్నాయని, అకాల వర్షాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఫసల్ బీమా చేయాలని సూచించారు. రాయికల్ మండలంతో పాటు అల్లిపూర్ గ్రామంలో సుమారు 200 ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరిగింది. రైతులు "ఒక్క వానతో మా కష్టం నీటిలో కలిసిపోయింది" అంటూ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తక్షణ నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్, బిజెపిలో విలీనం కాబోతోంది

- కరీంనగర్ మేయర్‌కు 1000 కోట్లు తెచ్చి చూపించాలి
- హిందువులకు బీజేపీలోనే భద్రత అని ప్రచారం
- బీఆర్ఎస్ ఎన్నికల్లో అడ్రస్ లేకుండా పోయింది
- కాంగ్రెస్‌కే దేశ, రాష్ట్ర భావి మాట్లాడే హక్కు
- కెసిఆర్ ప్రాజెక్టులు మాట్లాడుతున్నారని విమర్శ



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** పీసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గజ్జల కాంతం మంగళవారం కరీంనగర్‌లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2023 ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్, బీజేపీలకు గుణపాఠం చెప్పినా వారు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని గజ్జల కాంతం విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అడ్రస్ లేకుండా పోయిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టలేని స్థితికి దిగజారిందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో చిత్తుచిత్తుగా ఓడిపోయిందని పేర్కొన్నారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు బీఆర్ఎస్‌ను పాతర వేశారని, మున్సిపల్ ఎన్నికల్లో ఇండిపెండెంట్లే అధికంగా గెలిచారని తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ త్వరలో బీజేపీలో విలీనం కాబోతోందని ఇది వాస్తవమని గజ్జల కాంతం ఆరోపించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో బీఆర్ఎస్ నేతలు చర్చలు జరిపారని, కెసిఆర్‌ను జైలుకు పంపకుండా చూడాలని చీకటి ఒప్పందం జరిగిందని విమర్శించారు. ఫోన్ టాపింగ్, ఈ ఫార్ములా రేస్ కేసుల్లో కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ ఆమోదం ఇవ్వకపోవడం దీనికి నిదర్శనమన్నారు.

కరీంనగర్ మేయరు స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుందని, 1000 కోట్లు తెచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. బీజేపీలో ఉంటేనే హిందువులకు భద్రత ఉంటుందని బండి సంజయ్, కిషన్ రెడ్డి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. స్వతంత్రం, తెలంగాణ సాధనకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీకే దేశ, రాష్ట్ర ప్రజల గురించి మాట్లాడే హక్కు ఉందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం కెసిఆర్, హరీష్ రావు, కేటీఆర్ ప్రాజెక్టుల గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యానంతరం బాక్రానంగల్, నాగార్జున సాగర్, ఎస్ఆర్‌బీసీ, శ్రీపాద్ రావు ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టులు కాంగ్రెస్ పరిపాలనలోనే నిర్మాణమయ్యాయని గుర్తుచేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, అకుల ప్రకాష్, గడ్డం నాగ రాజు, కృదాశు ప్రభాకర్, గజ్జల ఆనంద రావు తదితరులు పాల్గొన్నారు.



## చెత్త సేకరణపై చిత్తశుద్ధి ఏది?

### మూలకు చేరిన చెత్త సేకరణ ఆటోలు



### మరమ్మతులు పట్టించుకోని అధికారులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు చెత్త సేకరణపై చిత్తశుద్ధి చూపడం లేదన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. చెత్త సేకరణకు ఉపయోగించే ఆటోలు మరమ్మత్తులకు చేరి మూలకుపడిన వాటిని పట్టించుకోకపోవడంతో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఫలితంగా పలు వార్డులో మూడు రోజులకు ఒకసారి కూడా ఆటోలు రాని పరిస్థితి నెలకొంది. పట్టణంలో 28 వార్డులు ఉన్నాయి.వార్డుల్లో చెత్త సేకరణ,రహదారుల శుభ్రం కోసం సుమారు106 మంది పారిశుధ్య కార్మికులు పురుషులు విధులు నిర్వహిస్తున్నారు. సేకరించిన చెత్తను తరలించడానికి 24 ఆటోలు,8 ట్రాక్టర్లు గతంలో కొనుగోలు చేశారు. ట్రాక్టర్లతో ప్రధాన రహదారుల్లో చెత్త సేకరిస్తున్నారు. ట్రాక్టర్లు వెళ్ళలేని వీధుల్లో ఆటోల ద్వారా చెత్త సేకరణ జరుగుతుంది.

#### రిపేర్లపై పట్టింపేది..

చెత్త సేకరణకు వినియోగిస్తున్న 24 ఆటోల్లో 8 ఆటోలు రిపేర్‌కు చేరడంతో వాటిని పక్కకు పెట్టారు. ప్రస్తుతం 16 ఆటోల్లో మాత్రమే చెత్త సేకరణ జరుగుతుంది. మూలకు చేరిన ఆటోల మరమ్మతును అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. పూర్తి స్థాయిలో ఆటోలు లేక పోవడంతో పలు వార్డుల్లోని వీదుల్లో మూడు రోజులకు ఒక్క సారి చెత్త సేకరణ ఆటోలు వస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఫలితంగా చెత్త నిల్వతో దుర్వాసనలు రావడంతో ఇతర ప్రాంతాల్లో వేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. కాగా 8 ట్రాక్టర్లలో 2 ట్రాక్టర్లు నీటి ట్యాంకర్లకు వినియోగిస్తున్నారు.

#### పార్శుద్ధ్య సిబ్బందే డ్రైవర్లు పారిశుద్ధ్యం కోసం..

పారిశుద్యం కొరకు నియమించుకున్న 106 మంది సిబ్బందిలో 14 మంది డ్రైవర్లు గా విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయంలో ఆరుగురు, పనులు చేస్తుండగా పార్కులో నలుగురు పనిచేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మూలకు చేరిన ఆటోలు మరమ్మతులు చేయించడంతోపాటు చెత్త సేకరణపై దృష్టి సారించాలని నూతన పాలక వర్గాని ప్రజలు కోరుతున్నారు.

#### ప్రత్యేక దృష్టి సారిస్తాం... కమిషనర్ సంపత్ కుమార్.

మున్సిపల్లో వున్న ఆటోలపై ప్రత్యేక దృష్టి సారించి నూతన పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్ళి రిపేర్లో వున్న ఆటోలను వినియోగంలోకి తీసుకు వస్తామని కమిషనర్ తెలిపారు.

## అంబర్‌పేట్‌లో అప్పుల బాధతో కుటుంబం ఆత్మహత్య

- ఉరితీసుకున్న దంపతులు, కుమారుడు
- అప్పుల ఒత్తిడి కారణంగా దారుణ నిర్ణయం
- ప్రాంతంలో విషాద ఛాయలు



**అంబర్‌పేట్ బ్యూరో, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ ప్రాంతంలో అప్పుల బాధ తట్టుకోలేక ఓ కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకున్న దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతులను రామరాజు (55), ఆయన భార్య మాధవి, కుమారుడు శశాంక్‌గా గుర్తించారు. తెల్లవారుజామున సుమారు 3.15 గంటల సమయంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఉదయం వరకు ఇంటి తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు, పొరుగువారు లోపలికి వెళ్లి చూడగా దంపతులు, కుమారుడు ఉరితీసుకుని మృతిచెందిన స్థితిలో ఉన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో అప్పుల ఒత్తిడి కారణంగానే ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం అందుతోంది. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో అంబర్‌పేట్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. అప్పుల సమస్యలతో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్థిక ఒత్తిడి, అప్పుల భారంతో జీవితాలు నాశనమవుతున్న నేపథ్యంలో సమాజంలో అవగాహన, సహాయ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులదే కీలక పాత్ర

- ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేసే వారు జర్నలిస్టులు
- హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని



**హుజురాబాద్, ఫిబ్రవరి 24 (జనం సాక్షి ):** ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులదే కీలక పాత్ర అని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు కాయిత రాములు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రొంటాల సుహాసిని మాట్లాడుతూ...నిత్యం ప్రజా సమస్యలను విలువలు గుర్తించేందుకు జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొని నిస్వార్థంగా పనిచేస్తుంటారని ఆమె అన్నారు. ప్రజా సమస్యలను తమ సమస్యలుగా భావించి సమస్యల పరిష్కారం కోసం పోరాడే ఏకైక వృత్తి జర్నలిజమే అని పేర్కొన్నారు. సమస్యలను వెలికి తెచ్చే సాహసంలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులు ఉన్నారని అన్నారు. అనంతరం విలేకరులు మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతే కాకుండా జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ రాజపల్లి సర్పంచ్ గా ఎన్నికైన కటుకూరి మల్లారెడ్డి, గత నాలుగు సార్లు కౌన్సిలర్ గా గెలుపొందిన కేసిరెడ్డి లావణ్య-నరసింహారెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి కౌన్సిలర్ గా గెలుపొందిన గోస్కుల రాజ్ కుమార్, చెల్పూర్ వార్డు సభ్యునిగా ఎన్నికైన వేల్పుల సునీల్ కుమార్లను విలేకరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కామని రవీందర్, సీనియర్ జర్నలిస్టులు తిరునగరి ఆంజనేయస్వామి, నంబి భరణి కుమార్, బండి సాయికృష్ణ, చిలుకమారి సత్యరాజ్, కేదాసి శ్రీధర్, పిల్లల సతీష్, మాచర్ల రాజు, సమ్మెట సతీష్, పబ్బ తిరుపతి, టేకుల సాగర్, గోపగాని మహేష్, కేషబోయిన స్వామి, ఎడ్ల కుమార్, ఫహీం, నిమ్మటూరి సాయికృష్ణ, పోతరాజు సంపత్, నాగవెల్లి రాజు, భారత రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25 ఫిబ్రవరి 2026

# వీణవంకలో సీఐడీ విచారణ

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జాతర ఘటనపై ఘటనాస్థలికి అధికారులు
- విచారణను సీఐడీకి అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం



వీణవంక ఫిబ్రవరి 24 (జనం సాక్షి) : వీణవంకలో సమ్మక్క సారలమ్మ జాతరలో ఇటీవల జరిగిన ఘటనపై సీఐడీ విచారణ ప్రారంభించింది. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై వీణవంక పోలీస్ స్టేషన్ లో పలు సెక్షన్లలో విధించిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఇటీవల వీణవంక మండల కేంద్రంలో మినీ మేడారంగా ప్రసిద్ధి చెందిన సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవంలో జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం సిఐడి అధికారులకు ఈ కేసును అప్పగించింది. సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అనుసరించిన తీరు విధానంపై సిఐడి అధికారులు స్థానికంగా ఉన్న హుజురాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మీనారాయణతోపాటు ఎస్ఐ ఆవుల తిరుపతిని జరిగిన ఘటనపై అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో సమ్మక్కను గద్దెకు తీసుకుని వచ్చే సమయంలో సమ్మక్క గద్దపై ఉన్న హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలీసులతో అనుచితంగా ప్రవర్తించిన విధానాన్ని అక్కడ ఉన్న అధికారులు సిఐడి అధికారులకు తెలియజేశారు. అక్కడున్న చుట్టుపక్కల వారికి సీఐడీ అధికారులు విచారణపై ఆరా తీశారు. పోలీస్ అధికారుల మీద అనుచిత వాఖ్యలు చేయడం జరిగిందని పోలీసు అధికారులు సిఐడి అధికారులకు తెలిపారు. విచారణలో సిఐడి డిఎస్పి రంగ స్వామి, సీఐ రఘునందన్, ఎస్ఐ,ఉమా ఆధ్వర్యంలో హుజురాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై ఆవుల తిరుపతి నుండి వివరాల అడిగి తెలుసుకున్నారు. సిఐడి అధికారులు మండల తాసిల్దార్ రాజమల్లు, ఎండోమెంట్ ఈవోలనూ విచారించారు.

# గ్రామీణ మంచినీటి సరఫరాపై కట్టుదిట్టమైన చర్యలు

- మిషన్ భగీరథ ద్వార ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టండి
- సర్పంచ్‌లతో కలిసి పని చేయండి
- మిషన్ భగీరథ సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన మంత్రి సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : గ్రామీణ ప్రజలకు నిరంతర, నాణ్యమైన తాగునీటి సరఫరా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న మిషన్ భగీరథ కార్యాలయంలో గ్రామీణ తాగునీటి సరఫరా, వేసవి సన్నద్ధతపై మంగళవారం నిర్వహించిన సమగ్ర సమీక్ష సమావేశంలో ఆమె అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఎఈలు, ఎస్ఈలు పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా మిషన్ భగీరథ సోర్స్ పాయింట్లు, రిజర్వాయర్లలో నీటి లభ్యత, పంపింగ్ వ్యవస్థ, గ్రామాలవారీగా సరఫరా పరిస్థితులపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో తగినంత నీరు నిల్వలో ఉందని, వేసవిలోనూ పెద్ద ఇబ్బందులు ఉండవని వివరించారు. అయితే మంత్రి ప్రతి ఎస్ఈ పరిధిలో ఇంటింటికి తాగునీరు అందుతున్న పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 24 వేల ఆవాసాల్లో కేవలం 150 ఆవాసాలకు మాత్రమే మిషన్ భగీరథ నీరు అందడం లేదని, ఇటీవల కొత్తగా 397 ఆవాసాలు ఏర్పాటయ్యాయని అధికారులు తెలిపారు. కొండలపై, అటవీ ప్రాంతాల్లో పైప్‌లైన్ వేయడం సవాల్‌గా ఉన్న చోట్ల స్థానిక జల వనరులను వినియోగించి ప్రత్యామ్నాయ పద్ధతుల్లో నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే మిషన్ భగీరథ లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. వేసవి దృష్ట్యా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని సూచించారు. సర్పంచ్‌లతో సమన్వయం చేసుకుని గ్రామాల వారీగా సరఫరా పరిస్థితిని సమీక్షించి, సరఫరా జరిగిందని వారి సంతకాలు తీసుకోవాలని తెలిపారు. సర్పంచ్‌ల ఫోన్ కాల్స్‌కు తక్షణ స్పందన ఇవ్వాలని, సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలాగే గ్రామాల వారీగా తాగునీటి అవసరాలు, సరఫరా పరిస్థితులపై సర్పంచ్‌లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించాలని మంత్రి సూచించారు. "అప్పుడే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయి. ప్రజలకు ఏ ఇబ్బంది ఉన్నా వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవచ్చు" అని ఆమె పేర్కొన్నారు. గతంలో మాదిరిగా వాస్తవాలను దాచిపెట్టి 100 శాతం నల్లా నీటి సరఫరా జరుగుతోందని నివేదికలు ఇవ్వాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఉన్న వాస్తవాలను నిజాయితీగా తెలియజేసి సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. గ్రామీణ తాగునీటి సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ ప్రజల అవసరాలు తీర్చుతోందని చెప్పారు. ఈ రంగానికి తగిన నిధులు విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు పెంచాలని, ప్రజల్లో మిషన్ భగీరథ నీటిపై నమ్మకం పెంపొందించాలన్నారు. గ్రామసభల్లో మిషన్ భగీరథ నీటి వినియోగంపై తీర్మానాలు చేయించి అవగాహన పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా సమ్మక్క--సారలమ్మ మహా మేడారం జాతర సందర్భంగా ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా సమర్థవంతంగా పనిచేసిన మిషన్ భగీరథ ఇంజనీరింగ్ సిబ్బందిని మంత్రి సీతక్క అభినందించారు. వారికి శాలువాలు కప్పి, మోమెంటోలు అందజేసి సత్కరించారు. మహా జాతరలో లక్షలాది భక్తులకు అంతరాయం లేకుండా తాగునీరు అందించినందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు.

# ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలు

- యూత్ కాంగ్రెస్ చిల్లర చేష్టలపై విమర్శలు
- యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు చిబ్ అరెస్ట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి24 (జనంసాక్షి) : ఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల జరిగిన ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన 'షర్ట్‌లెస్' నిరసనకు సంబంధించి.. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసన గురువారం సమ్మిట్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఐదుగురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షర్టులు విప్పేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, భారత్‌-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా సందేశాలు రాసిన టీ-షర్టులు పట్టుకొని నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు గుప్పించారు. సెక్యూరిటీ సిబ్బంది.. వారిని వెంటనే బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన తర్వాత ఏడుగురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.మంగళవారం ఢిల్లీ పోలీసులు ఉదయ్ భానును అరెస్టు చేశారు. ఆయన్ను తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారించిన తర్వాత అరెస్ట్ చేశారని సమాచారం. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్ట్‌ల సంఖ్య ఎనిమిదికి చేరింది. పోలీసులు ఆయనపై.. కుట్రలో పాత్ర ఉందని, విచారణకు సహకరించలేదని, తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. త్వరలోనే కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. భూపేశ్ బాఘేల్ వంటి సీనియర్ నేతలు ఈ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. 'ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నలు వేయడం, నిరసన తెలపడం నేరం కాదు,అది ప్రజాస్వామ్య ఆయుధం' అని బాఘేల్ అన్నారు. ఈ అరెస్ట్‌లను అరాచక, అన్యాయ చర్యలుగా పేర్కొన్నారు. యువత బాధలను బయటపెట్టడమే ఉద్దేశ్యమని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. బీజేపీ నేత ప్రదీప్ భండారి ఈ నిరసనను 'నేక్డ్ యాంటీ-ఇండియా ప్రొటెస్ట్' అని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను యాంటీ-ఇండియా, యాంటీ-గ్రోత్ పార్టీగా విమర్శించారు. 'యువతకు కాంగ్రెస్ 'నంగి' పార్టీగా కనిపిస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 భారత దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో జరుగుతున్న చర్చలు, ప్రదర్శనలకు సంబంధించింది. దీనిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈవెంట్‌గా చూస్తున్నారు. అయితే.. ఈ నిరసన వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని, దేశం పరువు మంటగలపాలన్నది వీరి పన్నాగమని బీజేపీ వర్గాలు మండిపడుతున్నాయి.

# పేదల గూడు కూల్చివేత



- ఖమ్మం భూదాన్ భూముల్లోని గుడిసెల తొలగింపు
- కన్నీరు మున్నీరైన స్థానికులు

ఖమ్మం / ఖమ్మం టౌన్, ఫిబ్రవరి 24 (జనం సాక్షి): ఖమ్మం కలెక్టరేట్ సమీపంలోని భూదాన్ భూముల్లో గల గుడిసెల తొలగింపు చర్యలు అక్కడి పేద కుటుంబాల జీవితాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఏళ్ల తరబడి అక్కడే జీవనం సాగిస్తున్న నిరుపేదలు ఒక్కసారిగా నిరాశ్రయులుగా మారడంతో ఆ ప్రాంతం కన్నీటి దృశ్యాలకు వేదికైంది. ఉదయం వేళ భారీగా పోలీసులు మోహరించి గుడిసెలను తొలగించడంతో వృద్ధులు ఆవేదనతో నేలపై కూర్చొని కన్నీరు పెట్టుకున్నారు. "ఎనిమిదేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. మా పిల్లలు ఇక్కడే పెరిగారు. ఒక్కసారిగా వచ్చి గుడిసెలు కూల్చేస్తే మేమెక్కడికి వెళ్లాలి? మా బతుకు ఎక్కడ?" అంటూ మహిళలు విలపించారు. కొంతమంది తమ గుడిసెల్లో ఉన్న సామాన్లు బయటకు తీసుకునేలోపే కూల్చివేతలు జరిగాయని వాపోయారు. "మాకు ముందుగా సరైన గడువు ఇవ్వలేదు. ప్రత్యామ్నాయ స్థలం చూపించలేదు. రాత్రికి రాత్రే రోడ్డు మీద పడేశారంటే మా పరిస్థితి ఏమవుతుంది?" అని స్థానికులు ప్రశ్నించారు. పిల్లలు పుస్తకాలు, బట్టలు పట్టుకుని ఎక్కడికి వెళ్లాలో తెలియక అయోమయంలో నిల్చుండగా, వృద్ధులు ఆశ్రయం కోసం చుట్టుపక్కల చూస్తున్న దృశ్యాలు హృదయ విదారకంగా కనిపించాయి. ప్రభుత్వ అధికారులు పేదల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని, వెంటనే ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి వారికి న్యాయం చేయాలని స్థానికులు కన్నీటి విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధులు స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, ఇకపై ఇలాంటి చర్యలు మానవీయ దృక్పథంతో చేపట్టాలని వారు కోరుతున్నారు.

## పేదల గుడిసెలు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?

- భూదాన్ భూముల్లో ప్రభుత్వ చర్యను ఖండించిన ఎంపీ రవిచంద్ర



ఖమ్మం నగర శివారులోని భూదాన్ భూముల్లో పదేళ్లుగా నివాసం ఉంటున్న పేదల గుడిసెలను కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా కూల్చి వేయడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండించారు. అక్కడ నివాసముంటున్న సుమారు 600 పేద కుటుంబాలపై వందలాది మంది పోలీసులు, పదుల సంఖ్యలో జేసీబీలు, ట్రాక్టర్లతో తెల్లవారు జామున్నే దాడి చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదే పదే ఇందిరమ్మ రాజ్యం అని ప్రగల్బాలు పలికే కాంగ్రెస్ నేతలు.. పేదల ఇల్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ, న్యాయపరంగా పోరాడుతున్న పేదలపై ప్రభుత్వం దుర్మార్గంగా విరుచుకుపడటం ద్వారా కాంగ్రెస్ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని మండిపడ్డారు. గుడిసెల తొలగింపును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, బాధితులకు అండగా ఉంటామని ఎంపీ రవిచంద్ర హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలపై నిజంగా సానుభూతి ఉంటే తక్షణమే అక్కడి అర్హులైన పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## కవరేజీకి వెళ్తున్న జర్నలిస్టుల అరెస్టు సరికాదు

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలో పేదల గుడిసెల కూల్చివేతల ఘటనను కవర్ చేసేందుకు వెళ్తున్న మీడియా ప్రతినిధులను అరెస్టు చేయడం దారుణమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వార్త కవరేజీ కోసం హైదరాబాద్ నుంచి ఖమ్మంకు వెళ్తున్న జర్నలిస్టులను నకిరేకల్ టోల్ గేట్ వద్ద పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా జర్నలిజం గురించి చెప్తాం.. ప్రజల పక్షాన నిష్పాక్షికంగా వార్తలు కవర్ చేసే జర్నలిస్టులను ప్రివెంటివ్ అరెస్టుల పేరుతో నిర్బంధించడం అంటే రాష్ట్రం పాలన ఏ దిశగా సాగుతున్నదో అర్థం చేసుకోవచ్చని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరెస్టులకు స్థానం లేదు.. జర్నలిస్టుల అరెస్టుల ఘటనపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో నకిలీ టీ పౌడర్ అమ్మకాలు

- తయారీదారును పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి24 (జనంసాక్షి) : హైదరాబాద్‌లో కల్తీ టీ పౌడర్ రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. టాస్క్‌ఫోర్స్, వెస్ట్ జోన్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి నిందితుడైన ఫతేనగర్ నివాసి జగన్నాథ్ బిష్ణోయ్‌ను అరెస్ట్ చేశారు. కోకోపీట్, బెల్లం నీరు, సింథటిక్ ఫుడ్ కలర్స్‌తో కల్తీ టీ పొడిని జగన్నాథ్ తయారు చేస్తున్నాడు. ఒక కిలో టీ పౌడర్ తయారీ కోసం 50 గ్రా. కోకోపీట్ మిశ్రమం ఉపయోగిస్తున్నాడు. అలాగే సన్‌సెట్ ఎల్లో, టార్ట్రాజిన్ రంగులను వినియోగిస్తున్నాడు. దాడులకు పాల్పడిన పోలీసులు నిందితుడి వద్ద నుంచి 120 కిలోల కలర్ మిక్స్‌డ్ టీ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు . అలాగే 30 కిలోల నేచురల్ టీ పౌడర్, 138 కిలోల కోకోపీట్ మిక్స్, 800 గ్రా. సన్‌సెట్ కలర్, 700 గ్రా. టార్ట్రాజిన్ స్వాధీనం చేసుకున్నారు. జగన్నాథ్ ఈ కల్తీ టీ పౌడర్‌ను స్థానిక టీ స్టాల్స్, డీలర్లకు అధిక ధరకు సరఫరా చేస్తున్నాడు.

# వైరాలో భారీగా గంజాయి పట్టివేత

ఖమ్మం, ఫిబ్రవరి24 (జనంసాక్షి) : ఖమ్మం జిల్లా వైరాలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా అవుతున్న 101.2 కిలోల ఎండు గంజాయితో పాటు 2.7 కిలోల హాషీష్ ఆయిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ అనుమానస్పదంగా ఉన్న హర్యానా నెంబర్ ప్లేట్ కలిగిన కారును ఆపి చెక్ చేసింది. తనిఖీల్లో గంజాయి, హ్యాషిష్ ఆయిల్ బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మహమ్మద్ అస్లాంను పోలీసులు అరెస్ట్ చేశారు. కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వైరా ఎక్సైజ్ స్టేషన్‌కు నిందితుడిని అప్పగించారు. వీటి విలువ సుమారు రూ.67.20గా తెలుస్తోంది.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మార్చి మొదటి వారంలో లబ్ధిదారులకు అందిస్తాం
- నిర్మాణ పనులను పనులను వేగవంతం చేయండి
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక : మంత్రి ఉత్తమ్



హుజూర్‌నగర్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : అర్హులైన పేదలందరికీ రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం హుజూర్ నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో 125 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్లను రాష్ట్ర హౌజింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి క్యాంప్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఒకే చోట 2,160 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి పేదలకు అందిస్తున్నామని, 2011 లో నాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హుజూర్ నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లులో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించామని, రాష్ట్ర విభజన తర్వాత ఆనాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసి డంపింగ్ యార్డ్ మాదిరిగా మార్చిందని మండిపడ్డారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల , కృషి ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం నెరవేరుతుందన్నారు. దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, 1 ఫ్లాట్ కు రూ. 6 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని, ఒక్క ఫ్లాట్ విస్తీర్ణం 325 స్క్వేర్ ఫీట్ ఉంటుందని వివరించారు. రూ.75కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించినట్లు వెల్లడించారు. మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల విదుగా మొదటి విడతలో హుజూర్ నగర్ లోకల్ లో ఇండ్లు లేని వారికి, నిరుపేదలు, తెల్ల రేషన్ కార్డు కలిగిన 1000 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు. రెండవ విడతలో హుజూర్ నగర్ నియోజకవర్గంలోని పేదలకు అందిస్తామని, ఎంపిక ప్రక్రియలో ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్, తాసిల్దార్ లు పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ కే నరసిం హ, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికా ర్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక దేశ్ముఖ్, నాయకులు గెల్లి రవి, యరగాని నాగన్న, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకూ హెల్త్ కార్డులివ్వాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్టంలోని జర్నలిస్టులు కనబడడం లేదా ?
- తెలంగాణ కోసం పోరాడిన వాళ్లం. జర్నలిస్టులకోసం మరో ఉద్యమం చేస్తాం
- మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ
- ప్రమాద బీమా సొమ్ము చెల్లించండి: ఆస్కాని మారుతి సాగర్




హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులు ఇచ్చి హెల్త్ పాలసీ అమలు చేయాలని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో జర్నలిస్టులు పోరాడి సాధించుకున్న హెల్త్ కార్డును, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం టీయూడబ్ల్యూజే ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్యమంత్రి కాక ముందే, ఉద్యమ సమయంలో తను జర్నలిస్టులకు ఇచ్చిన మాట ప్రకారం, ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డును జిఓ 64 రూపంలో తీసుకువచ్చి కార్డులు ఇచ్చి అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ లో చెల్లు బాటు అయ్యేలా అమలు చేశారని అల్లం నారాయణ చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం హాయంలో జర్నలిస్టులకు ఇచ్చిన క్యాష్ లెస్ హెల్త్ కార్డు వల్ల జర్నలిస్టులకు కోట్లాది రూపాయల వైద్య సహాయం అందిందని ఆయన గుర్తు చేశారు. అదే కార్డు ఇప్పటి వరకు నిమ్స్ వంటి హాస్పిటల్స్ లో చెల్లుతుందని అన్నారు. నిన్న కేబినెట్ మీటింగ్ అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనలో ఉద్యోగులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డు స్కీమ్ లో జర్నలిస్టుల విషయం లేక పోవడం అత్యంత బాధాకరం ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు గత ప్రభుత్వం కంటే మెరుగైన విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయినా జర్నలిస్టులకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని అన్నారు. కొత్తగా ఏమీ ఇవ్వకపోగా, ఉన్న అక్రెడిటేషన్ కార్డులలో కోత విధించడం, ఉన్న హెల్త్ కార్డును కూడా తీసివేయడం అత్యంత శోచనీయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టులు కనబడం లేదా? అని ప్రశ్నించారు. అసలు మీ దృష్టిలో జర్నలిస్టులు ఉన్నట్టా...? లేనట్టా....? అని అల్లం నారాయణ ఈ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్టుగా ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్‌కార్డును అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఈ హెచ్ ఎస్ మాదిరిగా ఇప్పటికే ఉన్న జెహెచ్‌ఎస్‌ను కూడా కొనసాగించాలన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అమలు చేయకపోతే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి జర్నలిస్టుల ఉద్యమం ఎలా ఉంటుందో చూపిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్లపాటు పోరాడిన వాళ్లం, జర్నలిస్టుల ప్రయోజనాల కోసం మరోసారి పోరాడుతామని అయిన హెచ్చరించారు. ఈ ప్రెస్ మీట్‌లో పాల్గొన్న టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోం దన్నారు. ఒక వైపు అక్రెడిటేషన్ కార్డులలో కోత, మరో వైపు ఉన్న హెల్త్ కార్డునూ తొలగించడం దారుణమన్నారు. గత ప్రభు త్వంలోలాగే జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డు అమలు చెయ్యాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఉద్యమిస్తారని మారుతీ సాగర్ హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే కోటి 20 లక్షల బీమా సొమ్ము వచ్చేలా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం గత ప్రభుత్వం జి ఓ నెంబర్ 22 తో జర్నలిస్టులకు, ఆటో డ్రైవర్లకు, హోమ్ గార్డులకు అమలు చేసిన 5 లక్షల ప్రమాద బీమా పాలసీని ప్రీమియం కట్టి మరీ రెన్యువల్ చేయకపోవడం దారుణమన్నారు.ఈ విషయంలో ఇప్పటికే వారు కూడా ఆందోళన బాట పట్టారనే విషయాన్ని గుర్తు చేస్తూ వెంటనే బీమా ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర కోశాధికారి పి.యోగ నంద్, హైదరాబాద్ నగర ఇంచార్జ్ యార నవీన్ కుమార్, టీయూ డబ్ల్యూ జే నగర కోశాధికారి బాపు రావు, కేబుల్ చానెల్స్ జర్నలిస్టుల జేఏసీ నేత కడకంచి వెంకటేష్, టీయూ డబ్ల్యూ జే నేత లాయక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370